



# గానకళ

సంగీత మాసపత్రిక

#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్ : 9441488721



సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల,హైదరాబాద్

**శ్రీ కె.వి.బ్రహ్మానందం,**
విజయవాడ,విశ్రాంతాచార్యులు,ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

అసోసియేట్ ఎడిటర్స్

**శ్రీ ధర్మాల రామమూర్తి**
(హైదరాబాద్)

**డా॥ బి.యస్.వి.ప్రసాద్,**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మృదంగం
కాశీవిశ్వవిద్యాలయం, వారణాసి.



**సంపుటి -56 | డిశంబరు - 2019 | సంచిక - 07**



**సంపాదకవర్గం :**

శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషరాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


పేజిలలో **ఈ సంచికలో...**


2. బాహ్యాసక్తి..పటాటోప భక్తి -శ్రీ మల్లాది సూరిబాబు
4. పారుపల్లి వారు త్యాగయ్య రచనలు - శ్రీ మోదుమూడి సుధాకర్
9. విలక్షణ విద్వత్కళాకారులు - వీణ వెంకటరమణదాసు - శ్రీ వి.వి.కృష్ణరావు
5. సంగీత పరిణామములు - వాగ్గేయకారుల రచనాశిల్పం- వేమూరి రామలక్ష్మి
11. ఆంధ్ర - సంగీతము - కీ॥శే॥ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు
15. రామదాసు కీర్తనలు
19. ఓలేటి 'సంగీత శిక్షణ' కోదండరామం భజామి -శ్రీ మల్లాది సూరిబాబు
20. తాళ్ళపాక అన్నమాచార్య కీర్తనల్లో చతుషష్ఠికళా వైభవం - శ్రీ విష్ణుభట్ల రామకృష్ణ
21. దాక్షిణాత్య నాదోపాసనాధురీణులు -శ్రీ కొమాండూరి శేషాద్రి
23. హిందుస్థానీ సంగీత పద్ధతి 'ఆలాప్, తాన్' - ప్రొ॥ శ్రీమతి ద్వారం లక్ష్మి
25. సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'


## ముఖచిత్రం

1. **విశాఖమ్యూజిక్ అకాడమీ గోల్డెన్ జూబ్లి ఉత్సవాలలో 'సంగీతకళాసాగర' బిరుదాన్ని పొందిన హైదరాబాద్ సోదరులు.**
2. **కంచి చిన్న స్వాములు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వాములనుండి ఆశీఃపూర్వక సమ్మానబిరుదుపత్రాన్ని అందుకొన్న విద్వన్మణి శ్రీజొన్నలగడ్డ ఈశ్వరప్రసాద్.**
3. **వి.జి.ఆర్.మ్యూజిక్ అకాడమీ, విశాఖ నాల్గవ వార్షికోత్సవంలో సత్కరింపబడిన విద్వాంసులు శ్రీ పంతులగోపాలరావు దంపతులు.**
4. **స్వరఝరిలో అన్నవరపు వారిచే సత్కరింపబడిన విదుషి శ్రీమతి ద్వారంలక్ష్మిగారు.**
5. **గాయత్రీ సంగీత సన్మండలిలో వాగ్గేయకారులు శ్రీభక్త జ్ఞానానంద తీర్ధ స్మారక అవార్డును వారి కుమారులు రామకృష్ణ గారి నుండి స్వీకరిస్తున్న శ్రీ మోదుమూడి సుధాకర్.**
6. **దశాబ్దాలుగా సంగీత సేవలందిస్తున్న వి.ఎమ్.ఎ.విశాఖ గోల్డెన్ జూబ్లీ కార్యదర్శి శ్రీ.ఎమ్.యస్.శ్రీనివాస్‌కు సభసభ్యుల సత్కార నీరాజనం.**
7. **వి.ఎమ్.ఎ.గోల్డెన్ జూబ్లీలో సభ్యులచే సన్మానాన్ని అందుకొంటున్న సేవాపరాయణులు ప్రొ॥ప్రసన్నకుమార్.**

# బాహ్యాసక్తి.. పటాటోప భక్తి



మల్లాది సూరిబాబు, సెల్ : 9052765490

త్రికరణ శుద్ధిగ జేసిన పనులకు దైవము మెచ్చును, లోకము మెచ్చును అంటాడు తాళ్ళపాక అన్నమయ్య. త్యాగరాజ కీర్తనలకున్న అర్థం తెలిసి పాడితే చాలు ఆ కీర్తనల్లోని రాగాలు భావంతో పాడేలా చేస్తాయి.

'అంతా గాయకులే, అంతరంగమున ఆత్మానంద చిన్మూర్తితో పంతాలాడెదు పందెగాడు ఒక్కడూ లేడయ్యా' అనేవారు, కల్లూరి సుబ్రహ్మణ్య దీక్షితులనే సంగీతజ్ఞుడు.

త్యాగరాజ కీర్తనలకు వ్యాఖ్యానం రాసిన కల్లూరి వీరభద్ర శాస్త్రిగారి సోదరుడీయన. త్యాగరాజు తన కీర్తనల ద్వారా తెలుగు జాతికి సమర్పించిన సంగీత జ్ఞానం యొక్క లోతు ఎంత అని అన్వేషించాలంటే, ఆ కీర్తనల్లోని రాగతాళ సమన్వయాన్ని బాగా వొంటబట్టించుకోవాలి. నాలుగైదు సార్లు సినిమా పాటలాగా వినేసి ముక్కున పట్టేసి ఊదేసేవి కాదు.

వేదాంతిగా, తత్వవేత్తగా ఆయన్ని తెలుసుకోవాలంటే పెద్దల దగ్గర కూర్చుని అధ్యయనం చేయాలి. తెలిసి పాడాలి. త్యాగరాజు మన తెలుగువాడే సుమా! అని పైకి గట్టిగా అనటం తప్పించి, సాహిత్యం జోలికి లోతుగా వెళ్ళి తెలుసుకుని పాడాలని సాధారణంగా అనిపించదు కొందరికి.

నిజాన్ని ముఖం మీద చెబితే కట్టుకున్న భార్య కూడా వినకపోవచ్చు, ఏకీభవించే అవకాశం లేకపోవచ్చు. అవతలివారు ఏమాత్రం ఉద్వేగపడకుండా చెప్పగలిగే తెలివి అందరికీ ఉండదుగాక ఉండదు. ఎదుటి వాళ్ళు తిరగబడేలా కాకుండా కఠోర సత్యాన్ని కూడా మృదువుగా చెప్పటంలోనే ఉంది మజా...

సత్యమే అనుకోండి. అయినా అంత పెళసరంగా చెప్పాలా ? పరుషంగా చెప్పాలా ? అని ఈసడించుకునే వారుంటారు.

సత్యాన్ని ప్రియంగా చెప్పడమే కాదు, చెప్పేది ఎదుటి వారి శ్రేయస్సు కోరి చెప్పినట్లుగా ఉండాలి.

సత్యాన్ని ప్రియంగా చెప్పాలనుకుని లోకాభి రామాయణాన్ని చెబితే ఎలా ? ఆ మాట మేలు కలిగిస్తేనే పూలబాటవుతుంది.

ఎందుకొచ్చిందీ తలనొప్పి అనుకుని మనలో సాధారణంగా వుండే బలహీనతలను తనవిగా చేసుకుని తప్పులన్నీ తనలోనే ఉన్నాయని తనకే ఆపాదించుకుని 'మనసా' అంటూ సంబోధన చేసుకుంటూ పాడుకున్నాడు త్యాగరాజు- అందుకే పుణ్య పురుషుడయ్యాడు. సంస్కారవంతమైన వారికి తిన్నగా ఆయన సందేశం చేరి తీరుతుంది. సాధారణంగా పైకి కనిపించే మనుషులకూ, లోపల వారికున్న గుణాలకు సంబంధం ఉండదు.

త్రికరణ శుద్ధిగా చేసే పనులు దిగ్విజయవంత మౌతాయను కోకండి. పెద్దలు చెప్పిన మాటను నమ్మినంత మాత్రాన అన్ని పనులు సవ్యంగా జరుగకపోవచ్చు అందరూ ఇష్టపడతారనీ లేదు. ఆడిషన్ టెస్ట్ కోసం. ఆలిండియా రేడియోలో నేను పనిచేసే రోజుల్లో లలిత సంగీతం పాడేవారెందరో వచ్చి వెళ్తుండేవారు. పాపం! తంబురా శృతిలో పాట కలవకుండా పాడేవారిని కూడా 'మావాళ్ళు' బాగా పాడుతున్నారని పైకి అభినందిస్తూ, లోపల నవ్వుకునే వాళ్ళు. పోనీ ముఖం మీద చెబితే తెలుసుకుని అర్థం చేసుకుని, ఆచరణలో పెడ్తారా ? అంటే అనుమానమే. స్వీయ లోపమ్మెరుగుటే పెద్ద విద్య అని వేమన చెప్పనే చెప్పాడు. లోపం వారికి తెలియదు. చెపితే నచ్చదు. మునులైనా, యోగులైనా, మహర్షులైనా, జ్ఞానులైనా అందరూ మౌనస్వాములు కాదు. అవసరమైన సందర్భాల్లో హాయిగా మనసువిప్పి మాట్లాడేవారు. త్యాగయ్య వంటి వాగ్గేయకారులు మానసికంగా తమకు సంబంధం లేని వాటికి చాలా దూరంగా వుండేవారంతే – చెప్పవలసినవన్నీ మౌనవ్యాఖ్యలే. వారికి మౌనమే బలం. మాటను బలహీనతగా భావించి పొదుపుగా మాట్లాడేవారు-సంగీతం ఉండే ఉంది. జీవితమంతా హాయిగా పాడుకునే బ్రతికారు. అగరబత్తీని వెలిగిస్తే చుట్టూ వాతావరణం ఎలా పరిమళిస్తుందో, పవిత్ర భావనలతో ఉన్న వ్యక్తుల వల్ల మొత్తం సమాజమే సుఖసంతోషాలతో నిండిపోతుంది. వారెంత దూరంలో వున్నా వారి ప్రభావం ఉండి తీరుతుంది.

జరిగిన తప్పులన్నీ దిద్దుకోవడానికే ఒక జీవితం సరిపోదు. స్వధర్మాన్ని నిర్వహించే సమయం చిక్కదు. చేసిన తప్పులు దిద్దుకుంటూ, దిద్దుకోలేక క్రిందా మీదా పడుతున్న వారు మనలో ఎంతమంది లేరు ? సమయానికి తగ్గట్లు మనసుని నియంత్రించు కోక పోవడమే దీనికి కారణం. అది తెలిసిన కొద్దీ తప్పులు తగ్గుతుంటాయి. దైవానుసంధానానికి దారి దొరుకుతుంది – ఇంతకంటే తపస్సు ఇంకేముంటుంది. ?

నేర్చుకోవలసిన విద్యలు లోకంలో ఎన్నో ఉంటాయి. ఎంత నేర్చుకున్నా, ఎన్నాళ్ళు సాధన చేసినా ఓ పట్టాన లొంగని విద్యల్లో సంగీత విద్య ఒకటి.

గురువుకూ శిష్యుడికి ఉండే బలమైన బంధాన్ని బట్టే ఆ సంగీతం పెరుగుతుంది. శిష్యుడిలో ఉన్న బలహీనతనీ, లోపాలనూ ఒక్కొక్కటే తొలగిస్తూ కడిగిన ముత్యంలా చేయవలసిన బాధ్యత సద్గురువుదే.

దీనికి శిష్యుడు సర్వదా సిద్ధుడై ఉండాలి.

విద్వాంసుడై వెలుగులో రావాలంటే ఈ గురువాక్కడి వల్లనే సాధ్యం – అనే నమ్మకం లేకపోతే ప్రయోజనం సున్నా. నేను ఇన్ని మెట్లు ఎక్కి పైఅంతస్తుకు రాలేను. అశక్తుణ్ణి. అమ్మా ! నన్ను ఎత్తుకుని పైకి తీసుకెళ్ళి కాస్త అన్నం పెట్టు తల్లీ ! అని పసిపిల్లాడు, మారాం చేస్తూ అడిగిన విధంగా…

'గురువును అర్థిస్తే తప్ప' సంగీత విద్య అబ్బే అవకాశం లేదని అనుభవజ్ఞులు చెప్పే మాట. నాకు కొంత తెలుసు. కాస్త మెరుగులు దిద్దండి, అనే శిష్యులు గురువులకు ఎప్పుడూ బరువులే. వాళ్ళు ప్రయోజనం అందుకునే లబ్ధి చాలా తక్కువ.

నిజమైన సంగీత సద్గురువు త్యాగరాజే. ముగ్గురు సంగీత మూర్తులూ ఒకే ఊళ్ళో ఉన్నారు. ఎవరి ధోరణిలో వారు పాడు కుంటూ బ్రతికారు. ఎవరి శిష్యులు వారికున్నారు. ఒక రంటే మరొకరకి గౌరవమే. అన్యోన్యంగానే ఉండేవారు తప్ప అసహనంగానీ, అహంకారంగాగానీ, మత్సర బుద్ధిగానీ ఎరుగరు. కాబట్టి ప్రాతఃస్మరణీయులైయ్యారు. సంగీత లోకానికి ఆదర్శ పురుషులయ్యారు.

తమ జీవితాలను సంగీత మార్గంలో నడుపుకుని తరించారు. ఆ దారిని మనకూ చూపించారు.

తనకంటే గొప్ప వారిని అభినందించటం, తక్కువ వారిని ప్రోత్సహించి మాట్లాడటం సంగీతజ్ఞులకుండాల్సిన ప్రాథమిక సద్గుణాలు.

ఇవి లోపించినంత కాలం వారి పాటకు పెరుగుదలంటూ ఉండదు. ఉన్నట్లుగా కనిపిస్తుంది.

సంగీత మూర్తిత్రయమైన (శ్యామశాస్త్రి, త్యాగరాజు, దీక్షితులు) ముగ్గురికీ కీర్తికండూతిలేదు – రాజులతోనూ రాజా స్థానాలతోనూ పనిలేదు. 'రాజుల్ మత్తులు, వారి సేవ నరక ప్రాయమ'ని వాళ్ళకు చాలా దూరంగానే బ్రతికారు.

రికార్డుల కోసమో, రివార్డుల కోసమో అర్రులు చాచలేదు. దేహి అనలేదు. ప్రొద్దున్నే లేచి రోజులెలా గడిచేదెలా ? అని తాపత్రయం కొద్దీ అడ్డమైన వాళ్ళను పొగిడి పబ్బం గడుపుకోవాలనే ఆశగానీ, చూస్తే ముద్దుగొలిపే సంసారపు లంపటంలో మునిగి, జీవితాన్ని క్రమబద్ధంగా గడుపుకోలేక పోవడంగానీ, మదంతో డబ్బు, పిల్లలు, స్థిర చరాస్తుల్ని చూసుకుంటూ మురిసిపోవటం గానీ, ఎదుటి వారి సంపదను చూసి నిరాశా నిస్పృహలతోనూ, ఈర్ష్యాసూయలతో కృంగిపోవడం గానీ, ముసలితనంతో మతితప్పిలేవలేని దయనీయ స్థితిలో జీవితాలను గడపవలసి వచ్చిన దశ గానీ ఈ మహాను భావులెరుగరు.

కోరికలే లేనివారికి కీర్తికాంక్ష ఎందుకుంటుంది? కర్ణాటక సంగీత పరిధిలోని రాగాలకు, రచనలకు స్పష్టమైన రూపాన్ని కల్పించిన మహనీయులు వారు. ముగ్గురిలోనూ శ్యామశాస్త్రి వయస్సులో పెద్దవాడు. ఈయన త్యాగయ్యను ఎంతో ఇష్టపడటమే కాదు, తన కుమారుణ్ణి (సుబ్బరాయశాస్త్రి) త్యాగయ్య వద్ద సంగీత విద్యాభ్యాసం కోసం పంపాడు.

త్యాగరాజుని చూడాలని చాలామందికి ఉండేది. ప్రయాణ సౌకర్యాలు ఏమీ లేని ఆ రోజుల్లో వ్యయ ప్రయాసలు కోర్చి ఆయన్ని దర్శించిన వారిలో దక్షిణాదిలో 18వ శతాబ్దంలో మయూరానికి చెందిన 'గోపాలకృష్ణ భారతి' ఒకరు. జీవితాంతం బ్రహ్మచారిగా గడిపిన గొప్ప ఆధ్యాత్మిక చింతనాపరుడు, సంగీతమే జీవితంగా గడిపిన వ్యక్తి భారతి శిష్యుడైన యు.వి స్వామినాథయ్యర్ త్యాగయ్యతో వీరిద్దరి సంభాషణను గ్రంథస్థం చేసిన మహనీయుడు. నందనార్ చరిత్ర రాశాడు. సినిమా కూడా తీశారు.

గోపాలకృష్ణ భారతికి త్యాగయ్యను చూసి తరించాలనే కోరిక చాలా బలంగా ఉండేదట. ఒక శుభ ముహూర్తంలో తిరువయ్యారు వెళ్ళారు. ఆ సమయంలో శిష్యులతో త్యాగయ్య 'అభోగి' రాగకృతిని పాడుతున్నారుట. భారతిని చూడగానే త్యాగబ్రహ్మ కుశల ప్రశ్నలడిగి 'ఏ ఊరు నుంచి వచ్చార'ని అడిగారుట.

'నేను మయూరం గ్రామానికి చెందినవాణ్ణి' అనగానే, 'అలాగా! అయితే'మీకు గోపాలకృష్ణ భారతి అనే మహావిద్వాంసుడు తెలుసా?' అని ఆసక్తిగా అడిగేసరికి, భారతికి నోట మాటరాలేదు.

ఆనందాశ్రువులతో పులకించిపోయి.. అయ్యా! నేనే, ఆ సామాన్యమైన సంగీతజ్ఞుణ్ణి' అని ఎంతో వినమ్రంగా బదులిచ్చాడు.

అంతకు ముందే గోపాలకృష్ణ భారతి సంగీత సాహిత్య విద్యా పాండిత్యం గురించి విన్న త్యాగరాజస్వామి గోపాలకృష్ణ భారతిని ప్రత్యక్షంగా చూడగలిగినందుకు పరమానంద భరితుడైయ్యాడు.

సంగీతమే రూపుగా భావించబడే త్యాగరాజు వంటి వారే అలా భావిస్తే ఇంక చెప్పేదేముంది? త్యాగరాజస్వామి సాన్నిధ్యంలో వున్న భారతిని, 'అభోగి' రాగంలో మీరేదైనా రచన చేశారా? అని అడిగారుట, మౌనంగా వుండిపోయారు. ఆ రాగంలో అంతవరకూ సంగీత రచన చెయ్యలేదు. త్యాగయ్యను కలిసిన రోజు మరునాడు ప్రణతార్తిహరుని దేవాలయంలో స్వామి దర్శనం చేసుకున్న గోపాలకృష్ణ భారతి ఆ రాత్రికి రాత్రే 'అభోగి' రాగంలో 'సభపతిక్కు వేరే దైవం' అనే కృతిని స్వరపరచి సిద్ధం చేసి మరుసటి రోజు త్యాగయ్యకు వినిపించాడు. త్యాగరాజు పరమానంద భరితుడయ్యాడు.

త్యాగరాజ దర్శనంతో పులకాంకితుడైన గోపాలకృష్ణ భారతి 'శివపరంగా'త్యాగరాజ పంచరత్న కీర్తనల మాదిరిగా 5 శివస్తుతులు, నాట, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ రాగాల్లో రచించి ప్రసిద్ధుడయ్యాడు. గోపాలకృష్ణ భారతి కీర్తనలు 18వ శతాబ్దంలోనే ప్రసిద్ధమయ్యాయి. వసంత కోకిలం, సుబ్బులక్ష్మి, పట్టమ్మాళ్ లాంటి వారు పాడి గ్రామఫోను రికార్డులిచ్చారు. తమిళనాట గోపాలకృష్ణకు నీరాజనాలిస్తారు.

# సుధాతరంగమ్ - 22 పారుపల్లి వారు త్యాగయ్య రచనలు

మోదుమూడి సుధాకర్


సంగీత విద్వాంసులెందరో ఉన్నారు. సద్గురువులూ ఎందరో ఉన్నారు. ఐతే ఆ రెండింటితో పాటు సంగీతాన్ని నిత్యం ఆరాధించి, ఆ కళ ప్రాభవం కోసమే చివరి శ్వాసవరకూ తపించిన బహు కొద్దిమందిలో 'గాయక సార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు అగ్ర తాంబూలం అందుకున్నారు.

సంగీతాన్ని గురించి గాని, వాగ్గేయకారుల్ని గురించి గాని ఎవరైనా విమర్శిస్తే సహించేవారు కారు పంతులుగారు. అందుకు ఒక దృష్టాంతం...



1948 సంవత్సరంలో సాహితీ సదస్సు ఒకటి బెజవాడలో జరిగింది. సభలో ఆనాటి ప్రముఖ సాహితీవేత్తలతో పాటు సంగీతానికి ప్రతినిధిగా పంతులుగారినీ నిర్వాహకులు ఆహ్వానించారు.

సాధారణంగా సాహితీ వేత్తలకు శాస్త్రీయ సంగీతం రుచించదు. సంగీత రచనలలో తప్పులే వారికి ఎక్కువగా కనబడుతాయి. ఆనాటి సభలో ఒక వక్త, త్యాగయ్య గారిని, వారి కృతులలోని సాహిత్యాన్ని విమర్శించటం ఆరంభించారు. వారి కృతులలో చందస్సు, వ్యాకరణ నియమాలు సరిగా పాటించబడలేదని, త్యాగయ్య కవి కాదని కేవలం ఒక పాటగాడని పేర్కొన్నారు.



ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే పంతులుగారి ముఖం ఎర్రబడింది. వక్తగారి ప్రసంగం పూర్తికాగానే సభాధ్యక్షులవారిని తనకు సమాధానం చెప్పే అవకాశం ఇవ్వవలసిందిగా కోరి, అనుమతి తీసుకొని, ఒక క్షణం గళం సవరించుకొని, 'అయ్యా! తమరు త్యాగయ్యగారి కృతులు ఎన్ని విన్నారో, ఎవరు పాడితే విన్నారో నాకు తెలియదు. ఏ విషయాన్ని గురించి మాట్లాడాలన్నా ఆ విషయాన్ని గురించిన సమగ్ర అవగాహన ఎంతో అవసరం. అందునా ఒక సభలో తమకు పరిచయంలేని సంగీత రంగానికి సంబంధించిన ఒక మహోన్నత వ్యక్తిని గురించి విమర్శచేసేముందు కొంతైనా ఆలోచించాలి.

విశ్వవేదికలపై ఆంధ్రేతరులచే సైతం తెనుగును పలికించిన ఘనత త్యాగయ్యది, ఆయన కృతిది.

త్యాగరాజు, రామభక్తి సామ్రాజ్యానికి మకుటంలేని మహారాజు. సంగీతాన్నే సాధనంగా చేసుకొని రామసాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడు. చిన్ననాటనే సంస్కృతాంధ్ర భాషలు ఆయన క్షుణ్ణంగా అభ్యసించారు.

---

వారు సంగీత విద్యను విద్య విత్తకరీ, భోగకరీ అనుకోలేదు. మోక్షకారక విద్యగానే భావించారు. అందుకే చిరస్మరణీయులయ్యారు.

లోకంలో కపటం లేని సంగీత విద్యాంసులు, చాలా అరుదు.. అని చెబుతూ ఎదలో నెంచుటొకటి, పయ్యెద కలిగినచోనొకటి, గొప్పతనముకై ఆస,కుత్సిత విషయపాస, మెప్పులకై బహులేసమిడి – ఉప్పతిల్లెదురు, త్యాగరాజ వినుత। అది కాదు భజన। అంటారు త్యాగయ్య.

ఈ దౌర్భాగ్యం సంగీత రంగంలో ఉన్న వారికే ఒక పాలు ఎక్కువ వినిపిస్తుంది.

తనకంటే బాగా పాడే వారిని మెచ్చుకోలేరు. పోని వారి లోవున్న లోపాలు గ్రహించలేరు. తెలుసుకుందామనే జిజ్ఞాస లేకపోగా ఈర్ష్య, అసూయ, కక్ష, కార్పణ్యాలు పీడిస్తుంటాయి. అలాగే బ్రతికేస్తారు. తెలుసుకుందామనే సరికి జీవితమై పోతుంది.

'జ్ఞాన ఖలుని లోని శారద' వుండి ఏమి ప్రయోజనం? మనసులో ఏర్పడే ఆలోచనలు వ్యతిరేకంగా ఉంటే, అవి మన మార్గాన్ని పూర్తిగా మార్చేస్తాయి. సక్రమంగా ఉంటే దారి చూపిస్తాయి. భగవాన్ రమణమహర్షి ఓ కథ చెప్పారు. మన మనస్సు ప్రశాంతంగా మృదువుగా సున్నితంగా, చెదిరిపోకుండా మన మాట వింటే అది మిత్రుడు. మనసు స్వాధీనం తప్పితే, అది మనల్ని మించి, అధిగమించి ఒక్క దూకు దూకి మన గమ్యాన్ని, మార్గాన్ని పూర్తిగా మార్చేస్తుందంటూ చెబుతూ, ఒక ముసలావిడ చూడ్డానికి చాలా ఉత్తమురాలుగా, మర్యాదస్తురాలుగా, ధర్మాత్మురాలుగా, నెమ్మదస్తురాలుగా కనిపించేది. ఆమెను ప్రేమాస్పదురాలుగా చెప్పుకునేవారు. కానీ, ఆమె అంతరంగమంతా ద్వేషంతో ఉడికిపోతుండేది. ముఖ్యంగా తనని విమర్శించి నిందారోపణ చేసిన వారి మీద. ఒకరోజున ఆమెను పిచ్చికుక్క కరిచింది. ఆమెకు పిచ్చెక్కింది. ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ తెలివిగా మాట్లాడినప్పుడు డాక్టర్ ఒక కాగితం, కలం ఇచ్చి, మీ చివరి కోరిక' ఏమిటో రాయమన్నాడు. ఆమె వెంటనే ఆదుర్దాగా ఏదో రాసేస్తోంది. దాన్ని డాక్టర్ చూసి 'ఏమిటి? ఏం రాస్తున్నారు?' అని అడిగాడు. దానికి ఆమె 'నేను ఎవరెవరిని కొరకాలో వాళ్ళందరి పేర్లూ రాస్తున్నా' అంది. ఆ మాటకు డాక్టర్‌కు మతిపోయింది.

ఆమెలో నిగూఢంగా దాగి ఉన్న క్రోధాగ్ని మొత్తం ఓ కుక్క కాటు దెబ్బతో బయటకు వచ్చింది.

ఇటువంటి ద్వంద్వ వైఖరి మనస్తత్వాలు మనుషుల్లో, వివిధ కోణాల్లో ముఖ్యంగా కళారంగంలో సర్వ సాధారణం. కొసరు వ్యక్తులు బాగానే ఉంటారు. చివరకు సదరు వ్యక్తులే దెబ్బతింటారు. కళను అభిమానించే ప్రతీవారికి కళా హృదయముంటుందను కోవడానికి వీలులేదు.

# సంగీత పరిణామములు-వాగ్గేయకారుల రచనాశిల్ప సౌందర్యములు

## భారతీయ సంగీతము - ఆదిమూలము - సామవేదము

ఏ శాస్త్రమైననూ - దానియొక్క పూర్వాపరములు - చరిత్రను తెలుసుకోవాలంటే - మొట్ట మొదట ప్రాచీనులను గురించి తెలుసుకొననిదే ఆచరిత్ర సమగ్రంగా -సంపూర్ణముగా వుండదు. క్రీ.శ.1-2 శతాబ్దములు భారతీయ సంగీత చరిత్రను గురించి తెలియజేసేది మనకు లభించిన మొట్ట మొదటి సంగీత లక్షణ గ్రంధము - 'నాట్యశాస్త్రము' దీనిని రచించిన 'భరతుడు' మొదటి వాగ్గేయకారుడుగా లక్షణకారునిగా మనము స్మరించి కొనవలసివున్నది సప్తస్వరములు - గ్రామములు - మూర్ఛనలు జాతులుగా పరిణామంచెందుట-జాతులు- జాతి రాగములుగా ఏర్పడిన విధానము, 'ధ్రువపదములు' అనురచనలు, నాట్య శాస్త్ర విషయములను చర్చించిన యీగ్రంధము ఆనాటి సంగీత స్వరూపను మనకు అందిస్తోంది. ఆనాటి లక్ష్యరూపములు, గానము చేసే విధము తెలుసుకొనే అవకాశములు లేవు. భరతుని తరువాత 'నారదుడు' - సంగీత మకరందము, 'మతంగుడు' బృహద్దేశి-అనుగ్రంధములు రచించేరు. మరెందరో లక్షణకారులు గ్రంధములు రచించేరు. ఆకాలంలో రచనలన్నీ సంస్కృతంలో వ్రాయబడినాయి. భరతుని కాలంనుండి క్రీ.శ.10-11 శతాబ్దముల వరకును భారతీయ సంగీత సంప్రదాయము ఒకేపద్ధతిలో సాగింది - 10-11 శతాబ్దముల ప్రాంతంలో జరిగిన మహమ్మదీయుల దండయాత్రలు, వారి పరిపాలనా పద్ధతులతో రాజకీయ పరిణామములకు అనుగుణంగా సంగీత పద్ధతిలో కూడా సంకీర్ణం చోటు చేసుకున్నది. ఆవిధంగా పారశకప్రభావంతో కలసిన సంగీతము 'హిందుస్థానీ సంగీతము'గా ఆవిర్భవించిన సందర్భములో క్రొత్తగా దక్షిణ దేశమందు ఏర్పడిన 'కర్ణాటక సంగీతము'నకు సంగీత విధానము నూతనంగా సంగీతరచనలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో విజయనగర సామ్రాజ్యస్థాపనాచార్యులు, దక్షిణదేశంలో 'కర్ణాటక సంగీతం' అనేపేరుతో సరికొత్త సంగీత సంప్రదాయమును స్థాపించిన వారును-విజయనగర ప్రభువులకు ప్రధానామాత్యులుగా - హితైషులుగా నుండిన వారును వేద వేదాంగములు, సంగీత శాస్త్రములందు మహాపండితులు ఆశ్రమ స్వీకారం తరువాత శ్రీశృంగేరీ పీఠాధిపతులుగా (1320-1380) వున్న శ్రీ విద్యారణ్యస్వామివారు దక్షిణదేశమందలి అనేక ప్రాంతములయందలి సంగీత విద్వాంసులను, పండితులను ఆహ్వానించి, సదస్సులు, గోష్ఠులు, చర్చలు జరిపి - అందరి సమన్వయంతో 'కర్ణాటక సంగీతం' అనేపేరుతో ఒక సంప్రదాయాన్ని ఏర్పాటు చేసేరు.యీకాలమునందు వున్న మేళములు 15, యితర రాగములు 50 వరకు మాత్రమే పేర్కొనుట జరిగినది. యీ విధంగా కర్ణాటక సంగీత వాగ్గేయకారులను స్మరించుకొను సందర్భమందు - యీ చారిత్రక ప్రాచీనమైన వారిలో ప్రధమ స్మరణీయులు 'శ్రీ

---

పోతన వలెనే త్యాగయ్య తన నోట కృతులు రాముడే పలికించినట్లు భావించారు. ఆ రాముని సన్నిధిలో తనువు మరచి, ఆసువుగా పాడుకొన్నవే గాని ప్రయత్నపూర్వకంగా కూర్చొని ప్రణాళికాబద్ధంగా వ్రాసినవి కావు. అలా పాడుకొన్న సమయంలో వారి శిష్యులెవరైనా ప్రక్కన ఉంటేనూ, వారికి భాషా పరిజ్ఞానం తగినంత ఉంటేనూ, వాటిని యధాతథంగా వారు ధారణ చేయగలిగితేనూ మాత్రమే మనకి తరాలు మారినా. అవి దోషరహితంగా నేటికి లభ్యమయ్యే అవకాశం కల్గింది. కీర్తి ప్రతిష్ఠల కోసం, ఒకరి మెప్పుకోసం ఆయన పాకులాడలేదు కనుక, వేలాది కీర్తనలు త్యాగయ్యగారు పాడుకోగా కేవలం ఏడు వందలు మాత్రమే మనకు ఈనాడు వినబడుతున్నాయి. యతి, ప్రాసాది ఛందోనియ మాలను ఎక్కడా వారు తప్పలేదు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈరోజుల్లోనే పుస్తకాలలో ఎన్నో అచ్చుతప్పులు చూస్తున్నాం. త్యాగయ్య కృతులలో దోషాలు మీరు వినిఉంటే ఆ దోషాలు, సరిగా గ్రహించలేకపోయిన మనవేగాని, దైవాంశ సంభూతులైన త్యాగయ్యగారివికాదు.

ఇక కవిత్వం విషయానికొస్తే ఒకే కృతిని ఉదహరిస్తాను. హరచాపాన్ని ఎక్కుపెట్టేటప్పుడు శ్రీరాముడి నుదిటిపై అందంగా కదలాడిన ముంగురులను మధ్యమావతిరాగంలో 'అలకలల్లలాడగ గని, ఆ రాణ్ముని ఎటు పొంగెనో!' అనే కృతిలో త్యాగయ్యగారు, తాను ఆనాటి జనకుని సభలో ఉండి, ప్రత్యక్షంగా చూచినట్లు భావించి, వర్ణించారు. అలా ఏ కవి వర్ణించారో చెప్పండి?

అసలు ఓ కవి పద్యం పాడితే మా సంగీత విద్వాంసులం ఆ పద్యంలోని భావాన్ని వదలి, ఆయన పాడిన రాగంలో తప్పులెన్ను తామా? మీరూ త్యాగయ్య కృతిలోని భక్తిని సంగీతాన్ని ఆస్వాదించటం నేర్చుకోండి. విమర్శలు మానండి. ఈవిధంగా అప్రతిహతంగా సాగింది పంతులుగారి సుదీర్ఘోపన్యాసం.

సాధారణంగా సంగీత విద్వాంసులకు సాహిత్య పరిజ్ఞానం తక్కువే ఉంటుంది. కానీ పంతులుగారు చేసిన వివరణాత్మక ప్రసంగం సంగీత సాహిత్యప్రియుల హర్షధ్వానాల నందుకుంది. త్యాగయ్యను విమర్శించిన వక్తకు గుణపాఠం నేర్పింది.

విద్యారణ్యస్వామివారు'. ఈ కాలము నుండియే ప్రాచీన సంస్కృత 'ధ్రువపదములు' ఆ మూలము ఆధారంతో ప్రాంతీయభాషల లోనికి రూపాంతరములు చెందుట, నూతన ప్రక్రియలు సృష్టించుట ప్రారంభమైనది. ఏ ప్రాంతంలో అధిక ప్రచారంలో వున్న రాగమునకు ఆప్రాంతీయనామమే స్థిరపడినది. సౌవీరి, సౌరాష్ట్ర, పూర్వి (తూర్పు) మొదలైనవి. మాళవ గౌళ కూడా దేశము పేరు.

**మాళవ – గౌడ రాజ్యములు**

ఉత్తర – దక్షిణ భారతములకు మధ్యదేశములో – తూర్పుదిక్కున గౌడ, పశ్చిమప్రాంతంలో మాళవరాజ్యములు న్నాయి. రాజుల పాలన మారుతూవున్నప్పుడు – రాజ్యముల పేర్లు–సరిహద్దులు మారుట సహజం. సంధి యుగమైన 12వ శతాబ్దములో గౌడ రాజ్యలక్షణసేనుని ఆస్థాన విద్వాంసుడు జయదేవుడు ఓశ్చిమ దిశలో యాదవరాజుల ఆస్థాన విద్వాంసుడు శారదేవుడు–సంగీత రత్నాకర గ్రంధకర్త – కాశ్మీరీ బ్రాహ్మణుడు; ఆంధ్రదేశీయుడైన గోపాలనాయకుడు చతుర్దండి బిరుదాంకితుడు – వీరుముగ్గురును స్మరణీయులు. భారతీయ సంగీత విభజన జరిగిన కాలమునాటి సంగీత రచనా స్వరూపవిశేషములు యీ ముగ్గురు వాగ్గేయకారుల వలన కొంత తెలుస్తోంది. శార్ఙదేవుని సంగీత రత్నాకరము' అందరికీ పరిచితమే! గోపాలనాయకుడు గీత, ఆలాప,ఠాయ, ప్రబంధరచనలు ఆశువుగా చేసి, గానము చేయగల ప్రతిభావంతుడైన వాగ్గేయకారుడు + గాయకుడు. ఆనాటి మహమ్మదీయపాలకుడైన ఢిల్లీసుల్తాను ఖిల్జీ ఆస్థానములో, ఆస్థాన సంగీత విద్వాంసుడు – పారశీక దేశస్థుడైన ఖుస్రూతో జరిగిన సంగీత వివాదంలో జయించి–సుల్తానుచే సన్మానములు – బహుమానములు పొందినవాడు. ఈ చతుర్దండి గానమే నేటి ప్రతిభావంతమైన రాగాలాపన, తానము, పల్లవి, నెఱవు, స్వరకల్పలకు మూలములు, మనోధర్మశాఖకు చెంది యుండి – ప్రబంధరచనలే – పదములై అన్నమాచార్యుల కాలమునకు సంకీర్తనా పదములుగా రూపాంతరము చెందేయి. గోపాలనాయకుడు విద్వత్సభలకు, సంగీత ప్రదర్శనలకు, సంగీత వివాదములకు దూరప్రాంతములకు వెళ్లునప్పుడు వెయ్యి మంది శిష్యులు వెంటనడిచే వారుట. యితని బండికి కట్టినెద్దుల మెడలో పట్టెడలోని చిరుగంటల ధ్వనులు సప్తస్వరములు పలికేవిధంగా అమర్చబడినవి. గోపాలనాయకుని రచనా ప్రౌఢిని – సంగీతరత్నాకర వ్యాఖ్యాతయైన మల్లినాధసూరి యీవిధంగా కీర్తించేడు.

**తథాహి గోపాలనాయకేన గీత ద్వాత్రింశ భాగనామ యుక్తే**
**గద్యాత్మకే భ్రమరాఖ్యే, స్వస్తిక భేదే రాగ కదంబే**
**ప్రథమ సింహనందన తాళబద్ధే మాళవశ్రీ పదే పద తాళావేవ**
**ఉద్గ్రాహ ధ్రువయోః యోజితావితి ద్వ్యంగత్వమ్॥**

గీత, ఠాయ, ఆలాప, ప్రబంధములయందు విశేషమైన ప్రజ్ఞకలిగిన వారికి 'చతుర్దండి' బిరుదు యియ్యబడుతుంది. యీ బిరుదు పొందిన ప్రాచీన ఆంధ్ర గాయక – వాగ్గేయకారుడు బహుశా ఒక్క 'గోపాలనాయకుడే' కావచ్చును.

జయదేవుడు : సంధియుగపు రచనలలో భక్తి ప్రాధాన్యత గల్గిన అనేక రచనలు వెలువడినాయి. జయదేవుడు రచించిన 'గీతగోవిందము' సంగీత ప్రబంధము. కర్ణాటక సంగీత రచనా విధానములో చెప్పబడిన 'కీర్తిన' సంకీర్తన రచనకు మూలాధారము. సంస్కృత మందు రచించబడినది. 8 పాదములు గలది గనుక 'అష్టపది' అనిపేరు. వీనికి 'శరభపదములు' అను పేరు కూడా వున్నది. ప్రాచీన త్రిధాతుప్రబంధమునకుదాహరణ. ఉద్గ్రాహము, ధ్రువమ్, మేళాపకము అనునవి యీరచనకు ధాతువులు / అనగా అంగములు మొదట ఉద్గ్రాహములో 4పాదములు పాడిన తరువాత 'ధ్రువమ్' అను అంగము ఒకటి / రెండు పాదములుంటాయి. తరువాత వచ్చే 4పాదములను అభోగ ఖండము అంటారు. యిందులో ముద్ర కూడా కనబడుతుంది. యితని ముద్ర 'జయదేవ' కర్ణాటక సంగీత సంప్రదాయంలో నేడు యీ అష్టపదులను కర్ణాటక సంగీత రాగములలోను, హిందుస్థానీ సంగీత గాయకులు హిందుస్థానీ రాగాలలోను పాడుటకు కారణము – యీసంధియుగ ప్రభావమే! పూర జగన్నాధస్వామి ఆలయంలో గానం చేసే అష్టపదులు ఆలయ సంప్రదాయమైన రాగాలలో నేటికి నీ పాడుతున్నారు. 12 సర్గలు, 24 అష్టపదులు కూడినది 'గీతగోవింద ధ్రువమ్ – పల్లవి, ఉద్గ్రాహ, అభోగముల చరణములుగా నేటి కీర్తనా గాన పద్ధతిలో పాడుచున్నారు. సంస్కృత త్రిధాతు ప్రబంధములే రూపాంతరం చెంది–తెలుగులో కీర్తన రచనలుగా మరియొక రూపాన్ని సంతరించుకొన్నాయి. అనగా : కర్ణాటక సంగీతము – భారతీయ సంగీత మూలములపై నిర్మించబడిన సంగీత మహాభవన నిర్మాణమే కదా!!!

శార్ఙదేవుడు = యితడు రచించిన సంగీత రత్నాకరములో 7 అధ్యాయములున్నవి.

స్వరగతాధ్యాయము, రాగవివేకాధ్యాయము, ప్రకీర్ణకా ధ్యాయము, ప్రబంధాధ్యాయము, తాళాధ్యాయము, వాద్యాధ్యాయము, నృత్తాధ్యాయము సంస్కృతము, హిందూస్థానీ, ఆంధ్రభాషలలో యీ గ్రంధముపై వ్యాఖ్యానములున్నవి. ఇతనికి

'నిశ్శంక' అనిబిరుదు.

క్రీ.శ.1408–1502 – తాళ్ళపాక అన్నమాచార్యులు – 'పదకవితాపితామహ', 'సంకీర్తనా చార్యులు'గా ప్రసిద్ధికెక్కి – 32 వేల సంకీర్తనలు రచించి – తెలుగు భాషకు చేసిన సేవ అమూల్యము కృతి, కీర్తన అని యీ కాలంలో మనము వాడుతూవున్న సంగీత రచనకు – అన్నమాచార్యుల కాలంనాడు 'పదము' అనీ 'సంకీర్తన' అనీ వ్యవహరించేరు. భరతుడు మొదలుగా గల అనేక మంది సంగీత లక్షణకర్తలు నిర్వచిస్తూవచ్చిన గేయప్రబంధములలో యిది ఒకటి. కర్ణాటక సంగీతంలో 'ఆదిగేయకవి' (సంగీత రచనాకారుడు)గా చెప్పదగిన అన్నమాచార్యులు – తరువాత కీర్తన రచనా కారులకు మార్గదర్శి. సంస్కృతం, తెలుగుభాషలలో రచనలు చేసేడు. గ్రాంధిక, శిష్టవ్యవహారిక, వ్యవహారిక భాషలలోనే గాక – కొండకోనలలోని కోయ, బోయజాతులవారి సంస్కృతి–భాషను కూడా సంకీర్తనా పదములలోనికి ఎక్కించి – పాడించగలిగిన కీర్తనా చార్యుడు– అన్నమయ్య – సంస్కృత భాషలో సంకీర్తనా పదలక్షణమును కూడా శాసించేడు, భరతుని కాలంలో ప్రబంధములు / ధ్రువపదములు అని సంస్కృత భాషలో వ్రాయబడిన సంగీతరచనలే–తరువాతతెలుగు భాషలో 'పదము'లుగా రూపాంతరం చెందుతూ–సంకీర్తనలు–సంకీర్తనా పదములుగాను – తరువాత భక్తి కీర్తనలు – క్షేత్రయ్య శృంగారపదములకు బాటలు పరచినవి.

'పదము' అనుపేరు – అన్నమయ్యకాలంలో – 'సంకీర్తనం'కి పర్యాయపదం.

'పదము' అనుపేరు – క్షేత్రయ్య కాలంలో – శృంగారపదములు

'పదము' అనుపేరు – త్యాగరాజు కాలం నుండి – వైరాగ్యపదాలు, సంకీర్తనలు, కీర్తనలు, కృతులు

సంస్కృతంలోని సంకీర్తనా లక్షణమును–అన్నమయ్య మనుమడైన 'చినతిరుమలయ్య' (చిన్నన్నకు అన్నగారు) తెనిగించినారు. అందులోకొన్ని :

**కం॥ పదముల యర్థము పల్లవి । వదలక యన్నిటికి నేక వాక్యత చేయన్ ।**
**గుదిగ్రుచ్చినట్లు తగులై। పదము తుదిన్ మరియు–మరియు పల్లవియమరున్॥**

**కం॥ పదములు శృంగార వధూ। మృదుమధుర మనోజ్ఞవాక్య మిశ్రమములైనన్**
**విదితార్థ గ్రామ్యోక్తుల్ । పదిలముగా పొంకమెరిగి పలుకం జెల్లున్ ॥**

**కం॥ వల్లవనారీమ్లేచ్ఛా। ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై।**
**చెల్లును గ్రామ్యములైనను । హల్లీసక ముఖ్యనాటకాధిక ఫణితిన్॥**

**కం॥ వైరాగ్య వృద్ధి కర గం । భీరపదశ్రేణి పొసగ బెనుపుచు నగ్రా మ్యా రమ్య విష్ణుచరితో।దారములై యున్నజాలు ధరణిన్వెలయున్॥**

అన్నమాచార్యులు దేశి సంగీత ప్రబంధాలకు లక్షణం చెప్పడమే కాక,లక్ష్యరూపములైన పదములను (సంకీర్తనా పదములు) వేలకొలదిగ రచించేడు.

ప్రాచీన వాగ్గేయకారులు – రచనల నుండి – నేటి కాలము వరకు గల వాగ్గేయకారులను స్మరించుచు – వారి రచనలను గానముచేయుచున్నప్పుడు వారి యొక్క రచనా స్వరూపముల తీరుతెన్నులు–అంగములు–ధాతు, మాతువులలో చోట చేసుకున్న అనేక పరిణామదశలు అవగతమౌతాయి. Ref : ఆంధ్రవాగ్గేయకార చరిత్ర – By బాలాంత్రపురజనీకాంతరావు

కీర్తనలు పల్లవ, అనుపల్లవ పల్లవి, అనుపల్లవి = పల్లవం, అనుపల్లవం చరణములతో కూడి వుంటాయి.

వృత్తములకు వలెనే తెలుగు పద్యములకు యతిప్రాసలుం డాలి. పల్లవి ఒక ఖండముగాను ఒక పాదము, అనుపల్లవి రెండు ఖండములుగాను, చరణములు 4 ఖండములుగాను వుంటాయి.

తాళ్లపాక వారి సంకీర్తనలలో పల్లవి 2 ఖండాలుగా వుంటుంది. అనుపల్లవి లేకుండా మూడుచరణాలుంటాయి. ఒక్కొక్క దానికి 4 పాదాలుంటాయి.

జయదేవుని అష్టపదిలో మొదటి ఉద్గ్రాహఖండంలో 2 పంక్తులు, ధ్రువంలో రెండుపంక్తులు వుండి; చరణాలు రెండేసి పంక్తుల చొప్పున 8 చరణాలుంటాయి. వీటికి 'శరభపదములు' అనే శాస్త్రీయనామం (8కాళ్లు గల్గిన అతిప్రాచీనకాలపు జంతువు వున్నదని అన్నమాచార్యులు సంకీర్తన లక్షణంలో తెలిపినారు.

నారాయణ తీర్థుల తరంగములలో జయదేవుని కాలం నాటి ధ్రువం పల్లవిగా ముందుకు వచ్చింది–యిది ఒక పంక్తిగావుండి, రెండు పంక్తులున్న ఉద్గ్రాహం అనుపల్లవిగా మారింది. కొన్ని తరంగాలలో పల్లవి + అనుపల్లవి =1+2 పంక్తులుగా / లేక 2+2 పంక్తులుగా వున్నాయి. కొన్ని తరంగాలలో అనుపల్లవి లేకుండానే పల్లవే కొన్నింటిలో ఒకపంక్తిగా వుంది – మరికొన్నిటిలో రెండు పంక్తులుగా వున్నాయి.

యీరచనా ప్రక్రియ క్షేత్రయ్య (17శ కాలంలో) పల్లవి, అనుపల్లవి, 3చరణాలు వుండే సంప్రదాయం వచ్చింది. ఆకాలం నుండీ నేటి వరకు చివరి ఖండమైన అభోగ ఖండంలోనే వాగ్గేయకారుని ముద్రకనబడుతోంది. ప్రాచీనుల కీర్తనలు కొన్నింటిలో 5,6,10,15 చరణాలు కనబడుతూ వుంటే – తరువాత కాలం వారి కీర్తనలలో ఒకే చరణం కనబడుతోంది. నారాయతీర్థుల వారి శ్రీకృష్ణలీలా తరంగిణిలోని కొన్ని కీర్తనలకు చాలా చరణములుండుట గమనించవచ్చును. ఈ 'కీర్తన' పదమును 'తరంగము'నకు ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు.

క్షేత్రయ్యపదములలో ప్రాచీన ప్రబంధశైలిలో చరణము ముందు పాడి, తరువాత పల్లవి పాడుట – నేటికిని యీ సంప్రదాయం కొనసాగుతోంది.

త్యాగరాజు కాలమునుండియు ధాతువునకు ప్రాధాన్యత హెచ్చి, సంగతులతో ప్రస్తారము విస్తరించినది. కీర్తనలోని పల్లవి గాని, అనువైన యితర భాగముగా తీసికొని 'నెఱవు' చేసి, స్వరకల్పనలు చేసే సంప్రదాయం ప్రారంభమైనది. చిట్టస్వరము, స్వరసాహిత్యము, మధ్యమకాల సాహిత్యము, సొకకట్టు స్వరములు అను విశేషమైన అలంకారములతో సంగీత త్రిమూర్తులైన శ్యామశాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు చేతులలో 'కీర్తన' రచనలు – పరిణితిపొంది – వీనికి 'కృతి' అనుపదము వ్యవహారములోకి వచ్చింది.

కీర్తనలు రచించిన వారిలో కొంతమందిని ప్రస్తావించు చున్నాను.

భద్రాచలరామదాసు 1620–1687, మాతృభూతయ్య మార్గదర్శి శేషయ్యంగారు 17శ సంస్కృతంలో కీర్తనలు వ్రాసేరు, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి 1730–1780 అధ్యాత్మి రామాయణకీర్తనలు ప్రయాగరంగశర్మ 1859–1927 కొచ్చెర్లకోట రామరాజు 1878 సదాశివబ్రహ్మేంద్రసరస్వతుల వారు 1830–1887 పురందరదాసు 1484–1564 మధ్యకాలమందు జీవించేరు. కన్నడ భాషలో వేలకొలది పదములు రచించేరు. వీనిని 'దాసరపదగళ్' అంటారు అన్నమాచార్యులు వేలకొలది శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలను రచించి 'పదకవితా మార్గదర్శి' అని బిరుదు పొందేడు, 17వశతాబ్దకాలము వచ్చు సరికి – యీ 'సంకీర్తనాపదము' మూడు క్రొత్త మార్గములలో పయనించుట మొదట పెట్టినది. 1580–1680 – మధ్య జీవించిన నారాయణ తీర్థుల వారి శ్రీకృష్ణలీలా తరంగిణి యిందులోని సంకీర్తన అధ్యాత్మబోధన ఆదర్శంగాను, శృంగారం జీవచారికంగా వుండి, నాట్యాభినయములకు వుపాంగం అవుతూ యింకొకవిధంగా 'భజన పద్ధతి'కి దారి తీసింది. రామదాసు కీర్తనలు భక్తిరసమే పరమావధిగావుండి, పామరజనం కూడా భక్తి మార్గంలో సాధన చేయుటకు వీలుగా భజన గోష్ఠులు వ్యాప్తి పొందుటకు కారణమైన యిది రెండవమార్గం. మూడవది – క్షేత్రయ్య అనుసరించిన పదరచనా మార్గంలో శృంగారప్రధానమై–అంతర్గర్భితమైన అధ్యాత్మిబోధన. 17వ శతాబ్ద కాలము వచ్చు సరికి అన్నమాచార్యుల రచనలు – 'సంకీర్తనలు'గాను, రామదాసు రచనలు వుదాహరణలు. ప్రాచీన రచనమైన 'ప్రబంధము'నకు గల 'అవయవము' అని శార్ఙ్గదేవుడు మొదలైన లక్షణకర్తలు నిర్వచనము యిచ్చేరు. 'ప్రబంధము' శరీరము Body 4 భాగములు = 4 ధాతువులు. అవి ఉద్గ్రాహము=యిది మొదటి భాగము=ఆరంభం, ధ్రువము = ముగింపు భాగము, మేళాపకము = ఉద్గ్రాహ – ధ్రువములను కలుపునది,అభోగము=అంకితము/ముద్రభాగము పురందర దాసు గీతములు ఉద్గ్రాహ +ధ్రువములు అనురెండు ఖండములు గల ద్విధాతుునిరపబంధములు. గీతముల యందలి ధాతు మాతువులు చాలా సులభంగా వుంటాయి. ఉగాభోగములు కూడా గీతరచనలవంటివే యైననూ–దానికంటే కూడా సంగీతం యింకా సులభంగా వుంటుంది. సూళాది రచనలు ప్రాచీన ప్రబంధములైన రాగకదంబములు, రాగతాళ కదంబముల వంటివి. యివి సంస్కృతభాషలో మార్గతాళములలో రచించబడి నవి–కాగా–సూళాదులు దేశీయతాళములు–దేశభాషలో రచించబడినవి. 'సూడ' ప్రాకృత భాషాపదమునుండి వచ్చిన పదము 'గీతము' పాటయిందులోని సంగీత సాహిత్యములు గీతములందువలెనే సులభశైలిలో – భక్తి వేదాంతములతో కూడివుంటుంది. యిది 4 నుండి 7,8 వరకు భాగములుం టాయి. వీనిని చరణములు అని అనరు. ఒక్కొక్క భాగము ఒక్కొక్క రాగమందు, ఒక్కొక్క తాళమందు వుంటాయి. భజన సంప్రదాయం రచనలు యిందులో లయకే ఎక్కువ ప్రాధాన్యత యియ్యబడుతుంది.

భద్రాచలరామదాసు 1620–1687 ఆంధ్రదేశములో రామదాసు కీర్తనలు పాడని రామభక్తులుండరు. రామ మందిరములలోను, భజనగోష్ఠులలోను పండిత పామరులు, ఆబాలగోపాలం పాడుకొనే భక్తి సంగీత కీర్తనలు రామదాసు కీర్తనలు రామదాసు అసలుపేరు కంచెర్లగోపన్న. రామదాసు దాశరథీశతకం, చూర్ణికలు, దండకములు కూడా రచించేడు. యితని కీర్తనలు ఎక్కువగా కరుణరసంలోవున్నాయి.

– వేమూరి రామలక్ష్మి, సెల్ : 97014 86050


**మనవి**

**గానకళ చందా ముగిసిన వెంటనే పునరుద్ధరణ చేసి సహకరించగలరు. ఎమ్.ఓ. ద్వారా చందా చెల్లించవచ్చును. సంవత్సర చందా రూ.500/- దయచేసి చెక్కులు పంపవద్దు.**

**ప్రస్తుత బ్యాంకు వివరాలు**

**Name : M.Venkatarao,**

**S.B.అక్కౌంటు నం: 018310011005838**

**ఆంధ్రాబ్యాంక్, సినిమారోడ్ బ్రాంచ్, కాకినాడ-1.**

**IFSC Code : ANDB0000183**

# విలక్షణవిద్వత్కళాకారులు - వీణ వెంకటరమణదాసు 1866-1948

వి.వి.కృష్ణరావు

సర్వవిద్యాసరస్వతీ నిలయంగా చరిత్రలో ప్రసిద్ధి పొందిన ఉత్తరాంధ్రప్రాంతంలోని విజయనగరం ఎందరో శారదాదేవి అపురూపమైన బిడ్డలకి కన్న తల్లీ, పాలిచ్చి పోషించినతల్లీ కూడాను! అటువంటి శారదా తనయులలో జగద్విఖ్యాతిని ఆర్జించిన మహామహులలో ఒకరు 'వీణ వెంకటరమణదాసు గారు' వారు విజయనగరంలో, చాంద్రమాన, క్రోధన సంవత్సర, మాఘబహుళ అష్టమి రోజున, విశాఖ నక్షత్రంలో, అంటే, 08.02.1866, గురువారంనాడు జన్మించేరు. వారు మాధ్వ బ్రాహ్మణ కుటుంబంలో, శౌనకగోత్రంలో పుట్టేరు. వారి తండ్రిగారి పేరు, చిన్న గురురాయాచార్యులుగారు. తల్లిగారి పేరు లక్ష్మీనరసమ్మగారు. సుప్రసిద్ధ భైరవిరాగ – అటతాళ – వర్ణం, 'విరిబోణి' సాహిత్య – స్వర రచయిత పచ్చిమిరియం ఆదియప్పయ్యగారు వారి వంశపూర్వజులే!

వీణ వేంకటరమణదాసుగారి తాతగారు, మైసూరు వీణ శేషన్నగారి తాతగారు స్వయంగా సహోదరులే!

వేంకటరమణదాసుగారి వంశంలో ముందు ఏడు తరాల నుండి సంగీత కళాకారుల పరంపర వర్ధిల్లుతూ వచ్చింది.

ఆనందగజపతి మహారాజావారు ప్రాచీన భారతీయ సంస్కృతియందు పరమప్రీతి కలవారు కావడంచేత, వారి ఆస్థానంలో వివిధరంగాలలో ఆరితేరిన మహాప్రజ్ఞావంతులైన పండితులు ఉండేవారు. సంగీత రంగంలో, ఆ కాలంలో, మహానుభావులైన గురురాయాచార్యులవారు, దూర్వాసుల సూర్యనారాయణశాస్త్రిగారు, వీణ వెంకటరమణదాసుగారు, శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు, కళాప్రపూర్ణ ద్వారం వెంకటస్వామి నాయుడు వర్యులు మొదలైనవారంతా విజయనగర ఆస్థాన విద్వత్కళాకారులే!

వీణని వాయించే పద్ధతులు ప్రధానంగా రెండు విధాలుగా ఉంటాయి. మొదటిది, 'శయనవీణాపద్ధతి' (Horizontal way of playing Veena); రెండవది, 'ఊర్ధ్వ వీణాపద్ధతి' (Vertical way of playing Veena), మొదటి పద్ధతి, మనం తరచుగా సభలలో కళాకారులు వాయిస్తూండగా గమనించిన విధానం. ఈమని శంకరశాస్త్రిగారు, చిట్టిబాబుగారు, బాలచందర్‌గారు, దొరైస్వామి అయ్యంగారు, గాయత్రిగారు మొదలైనవారు ఇలాగ వీణని అడ్డంగా పట్టుకుని వాయిస్తారు. రెండవపద్ధతిలో వీణని నిలబెట్టి వాయిస్తారు. వీణ వేంకటరమణదాసుగారు, తుమరాడ సంగమేశ్వరశాస్త్రి గారు, మంచాళ జగన్నాథరావుగారు మొదలైన కళాకారులు, వీణని నిలబెట్టి వాయించేవారు.

దాసుగారు రోజూ పది–పన్నెండు గంటల తీవ్ర అభ్యాసంచేసే వారు. రోజూ, నాలుగు కాలప్రమాణాలలోను, మూడు స్థాయిలలోను సంగీతాభ్యాసం నిరంతరాయంగా జరిగేది. వివిధతానాలని వేరు–వేరు కూర్పులతో భిన్నలయ ప్రమాణాలలో అనుదినమూ అభ్యాసంచేసేవారు.

దేహారోగ్యంకోసము, శరీరసౌష్ఠవంకోసము దైనిక దేహ వ్యాయామం విధిగా చేసేవారు. వారికుడి చేయి టెన్నిసు ఆడే అంతర్జాతీయ ప్రథమశ్రేణి క్రీడాకారుడి కుడి చేయిలాగ బలిష్ఠంగా వుండేదని, ప్రొఫెసర్ పి.సాంబమూర్తిగారు వ్రాసేరు.

రోజూ సంగీతాభ్యాసానికి, శరీరవ్యాయామానికి తగిన సమయం కేటాయించుకుని, సకాలంలోనే, సంధ్యోపాసనా అనుష్ఠానాన్ని, నిత్యదేవతార్చనవిధిని చక్కగా నిర్వర్తించుకునే వారు.

వారి వీణావాదనంలో మూడు ముఖ్యాంశాలు రసజ్ఞశ్రోతలని ఆకట్టుకునేవి. అవి, వారి వీణావాదనంలో అత్యద్భుతంగా ఉత్పన్నమయ్యేగాఢనాదవిభవం, ఊహాతీతమైన వారి వాదనలోని వేగతీవ్రత, సంగీతసృజనాత్మకమైన వారి అమేయ భావ ఔజ్జ్వల్యం.

'భైరవ' రాగంలోని, 'కొలువైయున్నాడే' అనే త్యాగరాజ స్వామివారి కృతి, 'కాంభోజి' రాగంలోని, 'సుబ్రహ్మణ్యాయ నమస్తే' అనే ముద్దుస్వామి దీక్షితుల కృతి, వేంకటరమణదాసు గారు వీణా వాదననైపుణిలో, విలంబిత– మధ్య–ద్రుతలయల లోను, అంటే మూడుకాలాలలోను, సుస్పష్టస్వర సౌష్ఠవ ప్రయోగ వైదగ్ధ్యంతో అలరారేవి అని సాంబమూర్తి వర్యులు వక్కాణిం చేరు.

ఆనందగజపతి మహారాజావారు, వెంకటరమణదాసుగారు రాజుగారికోటలో, ఎదురెదురుగా కూర్చుని, 19 సంవత్సరాల పాటు, వీణావాదనం చేసుకునేవారట! సంగీతసహచరులైన వీణ వేంకటరమణదాసుగారికి, రాజావారు, సొంతింటినేకాక, మంచి పంట పొలాలని కూడా పారితోషికంగా ఇచ్చేరట!

ఇరవయ్యవశతాబ్ది ఆరంభంలో, కర్జను ప్రభువు, వీణ వేంకటరమణదాసుగారికి, ఘనమైన సమ్మానంచేసి, ఆ వీణావాదనకోవిదుడి కళాకౌశలాన్ని పదే–పదే సభాముఖంగా కొనియాడి, 'సువర్ణ సింహతలాటం' వారి చేతికి తొడిగేరు. అనేక సభలలో అనేక సమ్మానాలు, బహుమానాలు ఆయన పొందేరు. ఆ బహుమతులన్నీ విజయనగరంలో వారి ఇంట ఉండేవి.

ఆయన వీణావాదన నైపుణ్యంలో ఆరు విశిష్టలక్షణాలు ఉన్నాయని విశ్వవిఖ్యాత సంగీతవిద్యాకోవిదులైన 'పద్మభూషణ' ఆచార్యపి.సాంబమూర్తిగారు గమనించి, వాటిని ఈ క్రింది విధంగా వివరించేరు.

దాసుగారు తమ వ్రేళ్ళని వినియోగించడంలోను, వీణతీగలని మీటడంలోను ప్రత్యేకశైలిని కలిగినవారు.

వారి వీణ పొడవు, సాధారణవీణల పొడవుకన్న తక్కువగా వుండేది. అందువలన, వారు తమ వీణని చాలా హెచ్చుస్థాయిలో 'శ్రుతి' చేసేవారు.

వారు ఉపయోగించే తీగలు, సాధారణంగా వీణలకి వినియోగించే తీగలంత సన్నంగా ఉండేవికావు. వాటికన్న కొంచెంలావు తీగలని వారు వాడేవారు. వారి వీణయొక్క అనుమంద్రతంత్రి, మామూలు వీణల తీగకి భిన్నంగా, రెండుసార్లు మెలిత్రిప్పబడినలోహతంత్రి గావుండేది.

వారు తమ వీణకి మైనపుమెట్లని వాడేవారు కాదు.

అనుధ్వని ప్రయోజనంకోసం వాడబడే ఆనపకాయ పరిమాణం పెద్దదిగా ఉండేది.

వారిది 'ఏకఖండ వీణ' లేక ఏకాండీవీణ. అంటే, మొత్తం వీణ అంతా ఏ అతుకులూ లేకుండా, ఒకే ఒక కొయ్యముక్కతో లేక ఏకదారుఖండంతో చేయించుకునేవారు.

వెంకటరమణదాసుగారు సితారు, రుద్రవీణ కూడా అలవోకగా వాయించేవారట! సితారు వాదన నైపుణ్యాన్ని, తమ వీణపైన తానప్రయోగసౌలభ్యంకోసం వినియోగించేవారట!

అనేకసందర్భాలలో వారి వీణావాదనకౌశలంతో ఆ కాలంనాటి చెన్నపట్టణం రసజ్ఞశేఖరులని వెంకటరమణదాసు గారు రసానందడోలికలలో పరవశింపచేసేరట! 1912-1916 మధ్యకాలంలో తంజావూరులో అబ్రహాం పండితర్ ఏర్పాటు చేసిన సంగీతసభలలో పాల్గొన్న సంగీత విద్వాంసులలో, వేంకటరమణదాసుగారు ప్రత్యేకమైన మన్ననలని అందు కున్నారు. 1916లో బరోడానగరంలో జరిగిన అఖిలభారత సంగీత సమ్మేళన సభల సమాలోచనలలో ఆయన ప్రముఖ పాత్రని పోషించేరు.

'వీణా రహస్యప్రకాశిక' అనే చిన్న పొత్తాన్ని వారు తెలుగులో ప్రచురించేరు.

వారి వీణా వాదనవేగకోవిదత్వానికి గుర్తింపుగా 'షట్కాల చక్రవర్తి' అనే ప్రత్యేకబిరుదం ఆయనికి ప్రదానం చేయబడింది.

దాసుగారికి, వారి 22 ఏళ్ళ ప్రాయంలో, భార్యావియోగం సంభవించింది. ఆ తరువాత ఆయన పునర్వివాహం చేసుకోలేదు. అరవైయేళ్ళవయస్సులో వారికి చెవుడు వచ్చింది. అది ఏ వైద్యానికి లొంగక చివరి వరకు ఆయనని బాధించింది. అందువలన ఆయన రమారమి రెండు దశాబ్దాలపైన దైహికంగా బ్రతికేవున్నా, సంగీతప్రపంచానికి పూర్తిగా దూరమైపోయేరు. ఆ విధంగా ఆయన చివరి దశంతా అనామకజీవితాన్ని అనుభవించి, 28.02.1948వ తేదీన తనువు చాలించేరు.

వీణ వేంకటరమణదాసుగారి జీవితంలో జరిగిన ఒకటి -రెండు ముచ్చటలు చెప్పుకుని, ఈవారం విషయానికి 'స్వస్తి' పలుకుదాం.

1.1916లో బరోడాలో జరిగిన అఖిలభారత సంగీత సమ్మేళన సభల సందర్భంలోనిది ఈ ముచ్చట. బరోడాలోని సంగీతపాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఫ్రెడెలిసు (Mr.Fredelis) మహాశయుడికి, వేంకటరమణదాసుగారికి సంగీతం విషయంలో ఏదో ఒక చర్చ జరిగిందిట. ఆచర్చలో భాగంగా, ఒకరితో మరొకరు తమ - తమ సంగీతవాద్యాలపైన ఇతర విద్వాంసులు వాయించిన ఏ అంశాన్న యినా తాము తిరిగి వాయించగలమని ధీమా వ్యక్తంచేసేరుట! మొదట ఫ్రెడెలిసు తన పియానోమీదా ద్రుతగతిలోవున్న ఒక మధుర స్వరశ్రేణిగల సంగీతరచనని వాయించేడట! ఆ సంగీతరచనలోని స్వరక్రమాన్ని చక్కగా గ్రహించిన దాసుగారు తమ వీణపైన ఆ బాణీని యథాతథంగా వాయించి వినిపించేసరికి ఫ్రెడెలిసు విస్తుపోయి విని చాలా సంతోషించేడట. అటు పిమ్మట, దాసుగారు, తమ వీణపైన, త్యాగయ్య గారి, భైరవిరాగంలోని, 'కొలువైయున్నాడే కోదండపాణి' అనే కృతిని, వాయించి వినిపించేరట! ఫ్రెడెలిసుగారు, భైరవిరాగంలోని ప్రత్యేక నిషాదస్వర ప్రయోగంలోని వైలక్షణ్యాన్ని గమనించి, దానిని యథాతథంగా పియానోమీద రాబట్టడం సాధ్యంకాదని అంగీకరించేరట!

2.వేంకటరమణదాసుగారు ఒక సంగీతసభలో పాల్గొనడానికి మాయావరం వెళ్ళేరు. కార్యక్రమం ఐపోయినా, ఆ ఊరి కళాకారుడైన వీణ వైద్యనాథయ్యరు గారి ఇంటిలో, ఆయన కోరికమేరకి, దాసుగారు కొన్నాళ్ళు ఉండిపోయేరు. ప్రతిదినమూ ఇద్దరు కళాకారులూ కొంతసేపు ఎవరి వీణపైనవారు అభ్యాసం చేసుకునేవారు ఒకరోజు అభ్యాసానంతరం అయ్యరుగారు, దాసుగారిని, వారి తంజావూరు వీణని వాయించమని పట్టుపట్టేరు. దాసుగారు అందుకుసున్నితంగానే తిరస్కరించేరు. అయ్యరుగారు తమ పట్టుబిగించేరు. వేరే విధిలేక అర్థమనస్కంగానే తంజావూరు వీణని దాసుగారు ఒడిలోనికి తీసుకుని, పై స్థాయిలో శ్రుతిచేసుకుని, వాయించడం మొదలుపెట్టేరు.

ఒక సందర్భంలో సారణితీగపై, కొంచెం ఎక్కువ ఒత్తిడితో ఒక విశేషప్రయోగం చెయ్యబోతే, ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఆ తీగకాస్తాపుట్టుక్కున తెగిపోయింది. వెంటనే ఆ వీణని ప్రక్కకిపెట్టి, నవ్వుతూ, దాసుగారు, అయ్యరుగారితో, 'మీ వీణలు ఆడపిల్లలు వాయించడంకోసం తయారు చేయబడ్డాయి. మా వీణలు మగవారు వాయించడానికి తయారుచేసేరు' అన్నారట!

3.ఒకసారి, ఆ కాలపు మదరాసు సెనేటుహౌసులో దాసుగారి సంగీతసభ ప్రారంభంకాగానే, బయట బ్రహ్మాండమైన వాన కుండపోతగాపడడం మొదలయ్యిందిట! వానవల్లవచ్చే శబ్దం ఎక్కువైపోతోందని, కార్యకర్తలు, కిటికీలు గుమ్మాలు తలుపులు వేసెయ్యబోయేరట! వెంటనే దాసుగారు వారందరిని వారించి, ఆ ధ్వనులస్థాయిని మించేరీతిలో తన వీణావాదనం ఉంటుందని వారందరికీ భరోసా ఇచ్చి, తమ వీణావాదనసభని అపూర్వ విజయవంతంగా నిర్వహించి, రసికవరుల ప్రత్యేక గౌరవాదరాలకి పాత్రులయ్యేరట!

అటువంటి మహావైణిక సార్వభౌముడైన వీణ వేంకటరమణ దాసుగారికి నతమస్తకులమై, నమస్కరిద్దాం. -స్వస్తి

# ఆంధ్ర - సంగీతము

శ్రీనల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

సంగీతము చాల అనాది అయినది. వాల్మీకి రామాయణంలో 'అగాయతాం మార్గవిధాన సంపదా' 'కుశలవులు రామాయణమును మార్గరీతిలో పాడిరి' అని సంగీత ప్రస్తావము చేసెను. అనగా దేశి విభాగము అనాటికే ఉన్నట్లు కదా!గోవిందరాజు వ్యాఖ్యానములో 'మార్గవిధానమంటే సంస్కృత భాషాగానము' అని వ్రాసినాడు. ఆ విధంగా కొంతకాలము వ్యవహారం సాగినది. తరువాత కాలక్రమంలో బ్రహ్మాదులచేత అన్వేషింపబడినది. 'మార్గసంగీత' మని, దేశభేదము చేత ఏర్పడినది 'దేశి' అని వ్యవహరింప బడినది. సంగీత శాస్త్ర గ్రంధములయందు ఇట్లేయున్నది. ఈ విధంగా సంగీతమునందు రెండు విభాగములు ఏర్పడినవి హిందూస్థానీ సంగీతమని, కర్ణాటక సంగీతమని, తురుష్క ప్రభువుల పాలనములో వారిని రంజింపచేయుటకు పాడిన పద్ధతికి హిందూస్థానీ సంగీతము అని పేరు వచ్చినది. పాశ్యాత్య సంగీతము నుండి వేరు పరుచుటకు కూడ ఈ పేరు వచ్చినది. అనగా పాశ్యాత్య సంగీతము కానిది హిందుస్థానీయ సంగీతము. కనుక హిందూస్థానీ సంగీతము, కర్ణాటక సంగీతము అని రెండు భేదములని భావింపవచ్చును. కర్ణాటక సంగీతమంటే మలయాళ, తమిళ, కన్నడ, ఆంధ్రదేశములలో పాడే సంగీతరీతికి కర్ణాటక సంగీతమనిపేరు వచ్చినది. ఇదెట్లంటే పైన చెప్పిన నాలుగు భాషలయందును 'కర' అంటే సముద్రతీరము అని 'నాడు' అంటే 'దేశము' అని అర్థము. ఆ రెండును కలిపితే 'కరనాడు' అయినది. నాలుగు భాషల యందును దాని అర్థము 'సముద్రతీరదేశము' అని అర్థము. సేతువు మొదలుకొని తూర్పు సముద్రపు పరిథిలోనున్న దేశానికి 'కరనాడు' అని పేరు. దీనియందున్న సంగీతము కరనాటి సంగీతము. ఆ పదాన్ని సంస్కృతీకరిస్తే కర్ణాటక సంగీతము అయినది. ఇది సరి అయిన నిర్వచనము. దీనికి భిన్నంగా ఎవరేమి చెప్పినా అవి సరికావు. ఇది కర్నాటక సంగీత చరిత్ర.

సంగీతశాస్త్ర గ్రంథాలన్నీ సంస్కృతంలో రచింపబడినవి. నాదము, శ్రుతులు, స్వరములు, స్వరస్థానములు, రాగములు వీటికి సంబంధించిన శాస్త్రమంతా ఒకటే. దీనిలో భేదము లేదు. పాడే శైలిలో, ఉచ్ఛారణలో – ఇటువంటి వాటిలోపై నాలుగు దేశాలకు కొద్ది భేదముండవచ్చును. తెలుగుభాష ఒకటే అయినా విజయనగర ప్రాంతంలో ఒక మాదిరి, తెలంగాణలో ఇంకొక మాదిరి, నెల్లూరు ప్రాంతంలో వేరొకమాదిరి వినపడినట్లు సంగీతంలో కూడ అల్పాల్ప భేదము వినపడింది. నా చిన్నతనంలో మైసూరు రాచప్ప, బిడారం కిష్టప్ప, బిడారం దేవేంద్రప్పగార్ల పాట ఒక మాదిరిగాను, అరియకుడి రామానుజయ్యంగారు, మహారాజపురం విశ్వనాథయ్యరు, సెమ్మంగుడి శ్రీనివాసయ్యరుల పాట ఒకమాదిరిగాను ఉండేది. ఇదేవిధంగా ఆంధ్ర సంగీత విద్వాంసుల బాణీలో కూడా తేడా ఉండటం సహజం. మూల పదార్థం అందరిదీ ఒకటే గనుక, ఆంధ్రుల సంగీతం వేరు అని చెప్పటానికి వీలులేదు. ఈ చరిత్ర ఇలావుండగా సంగీత త్రిమూర్తులతో ఒక రంజకమయిన బాణీ ఏర్పడి దానికి తంజావూరు బాణీ అని పేరుపడి కర్నాటకదేశం అంతా ఆ బాణీ అల్లుకు పోయింది. ఇప్పుడంతా ఒకటే. త్రిమూర్తుల తరువాత రెండు వందల ఏండ్లలో క్రమంగా తంజావూరు బాణీ రంజకంగా ఉండి అందరినీ ఆకర్షించిన మాట నిజం. అంతేకాని ఆంధ్రసంగీతం అని వేరే ఏమీలేదు. ఇప్పుడు ద్రావిడ భాషల 'తెలుగు, కన్నడ,తమిళ, మలయాళముల' సంగీతమంతా కర్నాటక సంగీతమే. కృష్ణ దేవరాయల పరిపాలనమునుబట్టి కూడాపై నాలుగు రాష్ట్రములను కలిపి కర్నాటకమని, దానిని బట్టి కూడ కర్నాటక సంగీతమని పేరు వచ్చినది. ఇది ఉన్న విషయము. ఈవిధంగా పేరు రావటానికి హిందూస్థానీ సంగీతమనే పేరున ఇంకొకరీతి సంగీతం ఉండటం కూడ కారణము. ఇక నాకు తెలిసిన సంగీత విద్వాంసులను గూర్చి చెపుతాను.

పాపట్ల లక్ష్మీకాంతయ్యగారి వద్ద నుంచి నాకందిన వారు.

పాపట్ల లక్ష్మీకాంతయ్యగారిని గురించి నాకు వినికిడే. వీరు ఇప్పుడుంటే 130 సంవత్సరముల వయస్సు. ఫిడేలు నందు గాత్రమునందు ప్రవీణులు. వీరు యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆస్థాన విద్వాంసులుగా నుండి అక్కడ అనేక సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ లక్ష్మీనరసింహ స్వామి వారి మీద కొన్ని కృతులు రచించిన వాగ్గేయకారులు కూడ. ప్రణవస్వరూప–నాట, ఏ యాపదలు లేవు–హంసధ్వని మొదలయినవి. కృతులు మంచి గడుసుపోకడతో ఉంటాయి. ఆనాడు మైలవరం రాజావారు మైలవరం కంపెనీ అనుపేరుతో ఒక నాటక సంస్థ స్థాపించారు. లక్ష్మీకాంతంగారు దానికి సంగీత నిర్వాహకులుగా ఉండేవారు. యాదగిరి సంస్థానంలో ప్రతి సంవత్సరం సంగీతపు పోటీలు నిర్వహించేవారు. పల్లవి, స్వరకల్పన వంటివి పోటీలో ఉండేవి. ఈ విధంగా వారి జీవితాంతం వరకూ వ్యవహరించారు. వారి కీర్తి ప్రతిష్టలు

కృష్ణాజిల్లా నుంచి అటు తెలంగాణా వైపు ప్రాకినవి. వీరిది తంజావూరు బాణీ కాదు. వారు విద్యను గ్రహించే రోజులలో తంజావూరు బాణి పూర్తిగా వ్యాప్తిలోకి రాలేదు. రేడియో వంటి సాధనాలు ఆనాడు లేవు కదా. వారిని అనుసరించిన తరువాత వారి బాణీని బట్టి ఇది నా ఊహ. వారి శిష్యులు వారి అన్నగారి కుమారుడైన పాపట్ల హనుమచ్ఛాస్త్రిగారు. చక్కని పాట కచేరీలు చేసేవారు. కచేరీలో 4,5, దాశరథీ శతకం పద్యాలు పాడి త్యాగరాజ కృతులు పాడేవారు 'నిధిచాల సుఖమా' వంటివి. వీరి కచేరీలకు లక్ష్మీకాంతయ్యగారి శిష్యులైన కొదమసింహం లక్ష్మణాచార్యులుగారు ఫిడేలు. ఇద్దరిలోనూ లక్ష్మీకాంతయ్యగారి బాణీకనిపించేది. ఫిడేలు శుద్ధ పొడి స్వరములు అయినా రంజకంగానే ఉండేది. లక్ష్మణాచార్యులుగారి ఫిడేలు ఎదురెత్తుస్వరాల ప్రధానంగా ఉండేది. వారు పక్క వాద్యం వాయిస్తే పాడిన విద్వాంసుడు సాఫీ స్వరం పాడినా వారు ఎదురెత్తు స్వరాలే వాయించేవారు. వారి కీర్తి ప్రతిష్ఠలు కూడా తెలంగాణ వైపే ప్రాకేయి. లక్ష్మణాచార్యులుగారిని చూస్తే అందరికి హడలుగా ఉండేది. చాలా పెద్ద పేరు సంపాదించారు. వారి రోజులలో గమక వాద్యం అపురూపం. 60 ఏండ్ల క్రితం గోడచాటున ఉండి నేను గమక బాణీతో ఫిడేలు వాయిస్తున్నా, లక్ష్మణాచార్యులుగారు విని 'ఒరేయి నువ్వట్రా! ఎవరో అయ్యరను కున్నా' అన్నారు. అంటే నా వాద్యంలో, వారికి తంజావూరు బాణీ వినిపించినదన్నమాట. వారి బాణీలో ప్రాక్టికల్‌లో వారు ఎంత పులో శాస్త్రం విషయాలలో అంతపిల్లి. స్వర స్థానాల పేర్లు సరిగా తెలియవు. మాకాశ్చర్యంగా ఉండేది. శిక్షణలో కూడ వారు దూరమే. వారి బాణీలో, వాద్యంలో చాలా దిట్ట. చాలా ఎక్కువ పేరు సంపాదించేరు. ఈ వర్గంలో చెప్పుకోతగ్గవారు పిరాట్ల శంకరశాస్త్రిగారొకరు. వీరుంటే ఇప్పుడు 110 సంవత్సరాలు. వీరు చెన్నై ఆ ప్రాంతాలకు వెళ్లటం, రావటం ఉండేది. అంచేత పాటలో తంజావూరు బాణీ కనిపించేది. లక్ష్యలక్షణాలు రెండును వారికి తెలుసును. ఈయన కొన్ని నియమాలు పాటింపక కచేరీలో పాట చెడగొట్టేవారట. కాకినాడ సరస్వతీ గానసభలో పీకవరకూ భోజనం చేసి కచ్చేరికి కూచుండి చెడగొట్టేవారట. నా ఎరుకలో రేడియోకి కూడా ఇలాగే వచ్చేవారు. తరువాత పాటకు టైం పాటించేవారు కారట. ఎంత సేపయినా ఏదో పాడేవారట. ఇవన్నీ పక్కకు పెట్టితే సంగీత పదార్థం దాని విద్వత్తూ మంచివేనట. వీరి అన్నగారు శివరామయ్యగారు మృదంగ విద్వాంసులు. వీరి కుమారుడు సేనాసిగారు హిందూస్థానీ సంగీత విద్వాంసులు. ఇది జగ్గయ్యపేట చరిత్ర. ఇంత వరకు పాపట్ల లక్ష్మీకాంతయ్యగారి వర్గము. పిరాట్ల శంకరశాస్త్రిగారి శిష్యులు 1935-1960 మధ్యలో మంచిపేరు గడించిన గుంటూరు వాస్తవ్యులు వింజమూరి వరదరాజయ్యంగారు. తరువాత వారణాసి వారు. వీరిది కృష్ణాజిల్లా గుడివాడ వద్ద వడలి. వీరిలో నేనెరిగిన మొదటివారు వారణాసి బలరామయ్యగారు. 60 ఏండ్ల క్రితం వీరివయస్సు 80 సంవత్సరాలు. ఆ వయస్సులో బలరామయ్యగారు చక్కని వయొలిన్ కచ్చేరీ చేశారు. ఒంటి తీగె వాద్యం బాగా వాయించేవారు. 'సారమతి రాగం' లక్ష్యలక్షణ యుక్తంగా ఉన్నది. దాదాపుగా ఆ సమయం వారు విరమించు కుంటున్న సమయము. అందుచేత ఇక మళ్లీ వినలేదు. తరువాత వారి అన్నగారి కుమారులు బ్రహ్మయ్యశాస్త్రి గారు. ఈ ఇద్దరూ ఆనాడు కచ్చేరీలకు సెట్టు. ఏ పెద్ద పాటకచేరీకయినా వారణాసి బ్రదర్సుగా పేరు మ్రోగేరు. బ్రహ్మయ్య శాస్త్రి గారి ఫిడేలు గమకం తంజావూరు బాణీ ననుసరించి ఉండేది. ఘంటయ్య శాస్త్రిగారు మృదంగం, తని ఇస్తే గాయకుడు చౌకకాలంలో ఇస్తే ఘంటయ్య శాస్త్రిగారు ధృతకాలంలో వాయించేవారు. ఐతేనేమి? చాలా బాగుండేది. ఆయన చేతికి అది వీలు. బ్రహ్మయ్య శాస్త్రిగారికి 1955 ప్రాంతంలో రేడియో వారు ప్రోగ్రాం ఇచ్చారు. బ్రహ్మయ్య శాస్త్రిగారు రాగం తానం పల్లవి వాయిస్తానన్నారు. ఆరోజు ఆదివారం కాదు కనుక మామూలుగా వాయించమన్నారు. శాస్త్రిగా రొప్పుకోలేదు. మీరు పల్లవే వాయించండి దానిని మీరు రచించిన కృతిగా ఎనౌన్సు చేస్తామన్నారు రేడియోవారు. దానికి శాస్త్రిగా రొప్పుకోలేదు. ఈ పేచితో శాస్త్రిగారి ప్రోగ్రాం తీసేశారు. కొద్దికాలంలో శాస్త్రిగారీ లోకాన్ని వదిలేశారు. బ్రహ్మయ్యశాస్త్రిగారి చివరి తమ్ములు వారణాసి యజ్ఞనారాయణశాస్త్రిగారు, గోపాల కృష్ణయ్యగారు, వీరిద్దరూ మృదంగ విద్వాంసులే. కళారంగంలో సేవచేసినవారే. యజ్ఞనారాయణశాస్త్రిగారు 60 ఏండ్ల క్రితం రాజమండ్రి వరదరావుగారి హొటలులో ఒక భజన బృందం ఉండేది. నెల వేతనం మీద దానిలో ఉండేవారు. 30 ఏండ్లు పనిచేసి విరమించారు. గోపాలకృష్ణయ్యగారు కూచిపూడి భాగవతుల మేళంలో ఉండేవారు. వారణాసి సోదరులు ఇప్పుడెవరూ లేరు.

హరినాగభూషణంగారు బందరు కాపురస్థులు. పట్నం సుబ్రహ్మణ్యయ్యరు సంప్రదాయుస్థులయినవారి తండ్రి రామయ్యగారి శిష్యులు. వీరు ఫిడేలు జంత్రగాత్ర ప్రవీణులు ఫిడేలు, గాత్రము కలిపి కచేరీలు చేసినవారు. వారిప్పుడు ఉంటే సుమారు 120 సంవత్సరాల వయస్సు సంగీతాన్ని వారు జీవనోపాధికి వాడుకోలేదు. బి.ఎ., బి.ఎల్., పాసై న్యాయవాద

వృత్తి చేపట్టి దానితో కుటుంబం పోషించుకొన్నారు. స్వతః రామభక్తి పరులు. పాట కచేరీ చేసేటప్పుడు రామ విగ్రహం ముందు పెట్టుకొని రామార్పణంగా పాడేవారు. సంగీతంలో ఆర్భాటం ప్రధానంగా ఉండేది. ఫిడేలు వాదము అంతే. అందరు దేవతల మీదా కృతులు రచించిన వాగ్గేయకారులు. మదరాసులో కచేరీలు చేసి ఆనాటి విద్వాదంసుల మన్ననలు పొందేరు. సుమారు 1940లో కాకినాడ సరస్వతీ గాన సభలో కచేరీ చేస్తూ ఉండగా పక్షవాతం వచ్చి వారి గాన సరస్వతి మూగ పోయినది. వారు సంస్కృత భాషలో మంచి పండితులు. శంకరభాస్యంలో కూడా పండితులు. త్యాగరాజోత్సవాలు చేస్తూ త్యాగరాజ చరిత్ర కథా రూపంలో ప్రవచనం చేసేవారు. 'జంత్రగాత్ర ప్రవీణ', 'భావనా పరాయణ' అనే బిరుదులు వారిని అలంకరించాయి. కుమారులు ముగ్గరిని సంగీతంలో, సంస్కృతంలో తయారు చేశారు. హరి నాగభూషణంగారు జీవిత చరమ దశలో సన్యాసాశ్రమం స్వీకరించి రామానందభారతిగా పేర్కొనబడ్డారు. చాలామంది శిష్యులను తయారుచేశారు. సుబ్రహ్మణ్యదేవరగారు, జంగం సుబ్రహ్మణ్యదేవరగారు అని ప్రసిద్ధి చెందారు. బందరు నివాసము. 4 గురు అన్నదమ్ములు. ఒకరు ఫ్లూట్ విద్వాంసులు.రాజమౌళి, చంద్రమౌళి అని ఇద్దరు సోదరులు ఫిడేలు విద్వాంసులు. ఆరోజులలో సుబ్రహ్మణ్య దేవరగారు బాగా పేరు పొందినవారు. వారి అనుయాయులు ద్వారం వారి కంటే వీరిని పెద్దగా భావించేవారు. వీరి ఫిడేలు వాద్యం కంపిత ప్రధానంగా ఉండేది. తరువాత సమగ్రహ కృతికి అక్షరన్నర జాగా అంటే మూడు లఘువుల జాగా ఇచ్చి స్వరకల్పన చేసేవారు. ఇది ఆయనకు ప్రీతి. భీమ్ పలాస్ వంటి రాగాల మీద ప్రీతి ఉండేది. ఆ విధంగా ఆయన కచ్చేరీ నడిచేది. ఈయన పేరు 1930-1950 మధ్యలో వెలిగింది. తరువాత ఎవరూ తలచలేదు. బందరు వారణాసివారిని, సుబ్రహ్మణ్యదేవర గారి వర్గాన్ని, హరినాగభూషణం గారిని ఆదరించింది.

ద్వారం వెంకటస్వామి నాయుడుగారు : వీరి జన్మస్థలము విజయనగరము. వీరుంటే సుమారు 110 సంవత్సరాల వయస్సుండేది. వీరి అన్నగారు వెంకట కృష్ణయ్య నాయుడుగారు సంగీతంలో వీణ సంగమేశ్వరశాస్త్రిగారి శిష్యులు. వీరు తమ్ముని బడికి పంపక ఫిడేలులో శిక్షణ ఇచ్చారు.

అన్నగారిచ్చిన శిక్షణ ఆధారంగా వేంకటస్వామినాయుడు గారు ఫిడేలు వాద్యంలో పరిపూర్ణ పాండిత్యం సంపాదించారు. సాటిలేని మేటి విద్వాంసుడైనారు. ఫిడేలులో ఉండే అన్ని రీతులు కరతలామలకమైనాయి. దేశంలో కీర్తి ప్రతిష్ఠలు బాగా వచ్చాయి. మదరాసు సంగీత విద్వాంసులు కూడా బ్రహ్మరథం పట్టారు. సుమారు 70 సంవత్సరాల క్రితం ఆనంద గజపతి రాజావారు విజయనగరంలో సంగీత కళాశాల స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్ నారాయణదాసుగారు. తరువాత ప్రిన్సిపాలుగా వెంకటస్వామినాయుడు గారు ఏకగ్రీవంగా ఎన్నికయై సమర్థంగా నిర్వహించారు. కర్ణాటక సంగీతంలో పాశ్చాత్య సంగీత విధానాలు ప్రవేశపెట్టి కచేరీని సర్వ సమ్మోహనంగా చేసేవారు. వీరికి పైతరం అయిన గోవిందస్వామి పిళ్ళై (మదరాసు)గారు, కాకినాడ సరస్వతీ గానసభలో నా తరువాత నా అంతవాడు మీ వెంకటస్వామినాయుడే అని చెప్పినారట. సుమారు 1940లో మదరాసు పెద్దలు వెంకటస్వామినాయుడు గారికి యాభైవేల రూపాయిలతో సన్మానం ఏర్పాటు చేశారు. వెంకటస్వామినాయుడు గారు కొంచెం ఆర్థిక బాధితులైన హరినాగభూషణం గారిని ఆ సభకు పిలిపించి వారికి ముందు ఆర్థిక సన్మానం చేసి. తరువాత తాము సన్మానం గ్రహించారు. మదరాసులోని పెద్ద గాయక విద్వాంసులు మక్కువతో వెంకటస్వామినాయుడుగారి ఫిడేలు పక్కవాద్యం పెట్టుకుంటే రాగం చాన్సులో నాయుడు గారి ఒక్కముక్కతో గాయకుని పాట ఎగిరిపోయేదిట. 'మీరిలా వాయిస్తే మేమేమయి పోతాము' అని గాయకులనేవారట. ఇది సుమారు 60ఏండ్ల క్రితం సంగతి. తరువాత నాయుడు గారు పక్కవాద్యం పెట్టుకోక సోలో కచేరీలే ఒప్పుకునేవారు. చివరి దాకా అలాగే సాగింది. వీరి శిష్యులు, అన్నగారి కుమారుడయిన నరసింగరావుగారు, మారెళ్లకేశవరావుగారు, చాగంటి గంగబాబుగారు, ఖండవిల్లి జనార్ధనాచార్యులుగారు (వైణికాగ్రేసరలు) కుమారులు భావనారాయణరావు, సత్యనారాయణరావులు, కుమార్తె మంగతాయారు. ఇంత వరకు బాగా తయారయి ప్రసిద్ధిగన్న శిష్యులు. ఇంకా చాలామంది ఉన్నారు. 65ఏండ్ల క్రిందట హిజ్ మాస్టర్స్ వాయిస్ కంపెనీ వారి కోరికమీద వెంకటస్వామినాయుడు గారు కల్యాణి రాగం తానం పల్లవి గ్రామ ఫోను రికార్డిచ్చారు. అది సర్వాంగ సుందరంగా ఇప్పటికీ బజారులోనున్నది. యహుదీ మెనుహిన్ అనే పాశ్చాత్య వయోలిన్ విద్వాంసుడు 50 ఏండ్ల క్రితం ఇండియా వచ్చి వెంకటస్వామనాయుడు గారి ఫిడేలు వాదాన్ని చాలా ప్రశంసించాడు. నా భావనలో ఆయన ఫిడేలు కోసం అవతరించిన గంధర్వుడని. ఇది అతిశయోక్తికాదు. స్వభావోక్తే.

పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు. వీరి జన్మస్థలం కృష్ణాజిల్లా శ్రీకాకుళం. జన్మ సంవత్సరం సుమారు 1885. ఉపనయనం అయినది. మైనారిటీ తీరినది. ప్రభుత్వం

తాణేదారు ఉద్యోగం ఇచ్చినది. వివాహం అయినది. చిత్రం! వారి మనస్సులో సంగీతం నేర్చుకుందాం అనే అభిలాష కలిగింది. వెంటనే ఉద్యోగం వదలి సమీపంలో నున్న పెద్దకళ్లేపల్లి వచ్చి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులు వారిని ఆశ్రయించారు. వారు స్వీకరించారు. సంగీత విద్యాభ్యాసం ప్రారంభమయింది. దక్షిణామూర్తి శాస్త్రులు వారంటే త్యాగయ్యగారికి ప్రశిష్యులు. వారి సన్నిధిలో రామకృష్ణయ్య పంతులుగారి సంగీత విద్యాభ్యాసం కొనసాగినది. దానిలో ప్రవీణులయినారు. గురువుగారి సంతోషానికి మేరలేదు. వారు అగ్రహారికులు శిష్యుల భోజనాలు వారింట్లోనే. రామకృష్ణయ్య గారికి ప్రథమ భార్యావియోగమై రెండవ వివాహమయినది. ఆమె వెంకట రమణమ్మగారు. రామకృష్ణయ్య గారికి తమకబ్బిన సంగీతంతో దేశానికి ఉపయోగ పడాలని కోరిక కలిగింది. బెజవాడకు కాపురం మార్చారు. తమకున్న ఆస్తితో బెజవాడలో ఇల్లు కట్టారు. కుటుంబ పోషణ కూడా దానితోనే. సంగీతంతో డబ్బు సంపాదించదలచ లేదు. పాటకచ్చేరీల ద్వారా పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. వారి హృదయ మెరిగి కొందరు సంగీతాభిలాషులు క్రమక్రమంగా వారి వద్ద శిష్యులుగా చేరి వారి ఇంటిని సంగీతనిలయం చేశారు. రూపాయికి పెద్ద విలువుండి తమకు అవసరమున్న ఆరోజులలో రామకృష్ణయ్యగారు తమ ఇంటిలోని కొన్ని గదులను పొరుగూరునుంచి వచ్చిన సంగీత శిష్యుల వసతికే ఉపయోగించారు కాని అద్దెకివ్వలేదు. ఈ విధంగా వారి జీవితాంతం వరకు గడిచింది. 'గాయకసార్వభౌమ', భారతీ తీర్థోపాధ్యాయ' అనే బిరుదులు వచ్చాయి వారికి. సంగీతంలో లక్ష్యలక్షణాలు రెండును వారికి చిక్కినవి. సంగీత త్రిమూర్తుల కృతి పాఠం సమగ్రంగా వారి కబ్బినది. ఆంధ్ర దేశంలో ఇక రెండవవారు లేరంటే స్వభావోక్తి. గురువుగారైన దక్షిణామూర్తి శాస్త్రులువారు స్వర్గస్థులయిన తరువాత ప్రతి సంవత్సరం వారి వర్ధంతి ఉత్సవాలు కొనసాగించారు. 1950 సంవత్సరంలో గురువుగారి ఉత్సవాల లోనే తనువు చాలించారు. తమ సహాధ్యాయులు తమ శిష్యులతోటి తమ గురువుగారి వర్ధంతి ఉత్సవాలు, దేశంలోని ఇతర సంగీత విద్వాంసుల సహకారంతో త్యాగరాజ ఉత్సవాలు జరిపేవారు. వారి ఆదర్శము మనదేశంలో పదిమంది సంగీత విద్వాంసులు తయారు కావాలి. దేశంలో సంగీత అభివృద్ధి పొందాలి అని, సంగీత విద్వాంసులు అందరు అన్ని విధముల మంచి స్థితిలో ఉండాలి అని. దీనికోసమే తమ జీవితం ధారపోశారు. మంచి తెలుగుదనం ఉట్టిపడే చక్కని పాట, చూడగానే రెండు చేతులు ఎత్తి మ్రొక్కాలి అనిపించే వేషధారణము. చల్లని పలకరింపుతో జీవితం సాగించారు. సంగీతంలో ప్రతి విషయము రంజకంగా ఉండేటట్లు సమపాళ్లు గా, తూకంగా ఉండేటట్లు చూసు కొని పాడేవారు. కచేరీలో కూడ ఫిడేలు మృదంగాలకు ఛాన్సు ఇవ్వటంలో సరిగా ఉండేటట్లు విభజించి పాడేవారు. కృతుల భావమెరిగి సరి అయిన ఉచ్చారణతో రాగంలో అనవసరమైన వీరావేశము హుంకారము లేక సమరంజకంగా పాడేవారు. స్వర కల్పనము తక్కువస్థాయి వాళ్లు గ్రహించేవిధంలో ఆదర్శ ప్రాయంగా పాడేవారు. వారి తరం గాయకులలో వారు కొత్తదనం పాటించి పాడేవారు. దక్షిణాదిన అరియకుడి రామానుంజయ్యంగారి పాటవలె ఆంధ్రలో రామకృష్ణయ్యగారి పాట ఉండేది. వీరి శిష్యులు వందమందికి తక్కువలేరు. ఎక్కువ వయస్సు వాళు పోయారు. ఇప్పుడు క్షేమ లాభాలతో ఉన్న డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు, 'నాద సుధార్ణవ' అన్నవరపు రామస్వామి గారు, సంగీత సాహిత్య కలానిధి ఎన్.సి. హెచ్. కృష్ణమాచార్యులు, నేతి శ్రీరామశర్మరామకృష్ణయ్య పంతులుగారి శిష్యులే. రామకృష్ణయ్య పంతులు సంగీతంలో నిస్వార్థ సేవచేసి దేశానికి పదిమంది సంగీత విద్వాంసులను అర్పించారు. విజయవాడకు రేడియో స్టేషను రావటం, సంగీత కళాశాల రావటం కూడ రామకృష్ణయ్య పంతులుగారి ఆశాసన ఫలితాలే. ఆంధ్రదేశము ఈగ్రంథంలో పేర్కొన్న సంగీత మూర్తులతో 20వ శతాబ్దము కలకలలాడినది.

(ఆంధ్రమ్యూజిక్ అకాడమీ వారి సౌజన్యంతో)




సభానిర్వాహకులు సీతారామశర్మ, ఓంప్రకాష్, గోపాలకృష్ణ, వెంకటసుజ్ఞాన్, శ్రీవత్స తేజస్విగానం చేయగా సాయి భార్గవ వైలన్, బి.జనార్ధన్ మృదంగంపై సహకరించారు.

# భద్రాచల రామదాసు కీర్తనలు

ఇటువంటి ఈ గ్రంథములను ముద్రించే అవకాశము మాకు, మా పిల్లలకు కలగటము మా పూర్వజన్మ సుకృతము. సంగీతకళాకారులు, విద్వాంసులు, రామభక్తులందఱు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకొని భద్రాచల సీతారామస్వామి వారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని మనసారా ఆశిస్తున్నాను. ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన వారందఱికీ మా మనః పూర్వక కృతజ్ఞతలు. - శ్రీరామసేవలో **నేండ్రగంటి కృష్ణమోహన్.**

(గతసంచికలో 88వ కీర్తన అచ్చులో పొరపాటుకు చింతిస్తున్నాం. ఆకీర్తన తిరిగిప్రచురిస్తున్నాం ॥సం॥)

## 103. శ్రీమన్నారాయణ

**పల్లవి :**

శ్రీమన్నారాయణ తే నమోనమో
వేదపారాయణ తే నమోనమో ॥శ్రీమన్నారాయణ॥

**చరణములు :**

1. కదనభీమ దశవదన విరామా
రఘుకుల సోమా మేఘశ్యామా
మదనవైరి రామానుజరామా
రామచంద్ర తే నమోనమో ॥శ్రీమన్నారాయణ॥

2. కామజనక త్రిభువనపాలక
కామజసన్నుత కన్యధర
రామదాస పోషక భద్రాచల
రామచంద్ర తే నమోనమో ॥శ్రీమన్నారాయణ॥

## 103. నాటకురంజి రాగం - ఆది తాళం

28వ మేళకర్త హరికాంభోజి జన్యం - సరిగమనిదనిపదనిస - సనిదమగమపగరిస

**పల్లవి :**

i. ; గప మగ స స ని నిధని స సా సా। సా స రిగా మగ । రి గమగ మా ; ॥
. శ్రీ. . .మ న్నా. రా. .యణ తే। న మో . . న . । మో. . . . . ॥

; , మనిద నిప నిదని స సా సా । సని రిస నిదమగ । రి గమప గరిసా ॥
. . వే . ద పా. రా. . యణ తే । న . మో. . . న. । మో. . . . . . ॥

ii. ; గప మగ స స ని నిధని స సా సా। సా స రిగామని। ద సనినిదామా ॥
. . శ్రీ. . . మన్నా. రా. . యణ తే। న మో. . న .। మో. . . . . ॥

; , మనిద ద ని సరి గమగ సాసా। మగ స నిదని సా । ద పగమ పగరిస ॥
. . వే . ద పా . రా. . .యణ తే। న . మో. . . న । మో. . . . . . ॥

శ్రీమన్నారాయణ . . .

**చరణములు :**

1. ; నిదాని పదనిస నిద మాగా। ; రిగామపా। గరిసని ధనిసా ॥
. . కద న భీ . . . మ . ద శ । . వద న వి । రా. . . . .మా ॥

; ని సా రిగా మసనిద దా మా । ; మనీ ద నిప । ని దానిసా ; ॥
. . ర ఘుకుల సో. . . మా . । . మే . ఘ . . । శ్యా . .మా. ॥

; ని దా ని సా ; సా ; నిస । రి గమప మగసా। ససనిద నీ ; ॥
.. మ ద న పై . రి . రా. । మా. . . ను. జ । రా. . . మా. ॥

; , దనిస రీ , గరి స ససనిద । రి స ని దనిస ని ద। రి సనిద మగసని॥ సరి -
.. . రా. మ చం. . ద్ర . తే . . . । న . మో. . . న . । మో. . . . . . . . ॥ . . -
శ్రీమన్నారాయణ . . .

2. ; , సానిదా నిపదా , ని దా। మాగా రిగమద । పపగరి సా ; ॥
.. . కామజ న . క . త్రిభు। వ న పా. . . । . . ల . క . ॥

; ని సా రిగా మసనిద నిసనిద। మా మనీదనిప । నిదాని సాసా ॥
.. కా . మజ స . . . న్ను.త.। . క .న్య. . । . . . . ధ ర ॥

; , మని దనీ సాసా నిసరిగ। మపమగ సా ; । స సనిద నీ సా॥
.. రా. మదా. స పో. . . । ష . క . భ . । ద్రా. . . చ ల ॥

; నిసా రీ గరి సా సరి ససనిద। మగస నిదా రి స । ని దమా మగసని ॥ సరి
.. రా. మ . . చం ద్ర . తే. . . । న .మో. . న . । మో. . . . . . ॥ . .
శ్రీమన్నారాయణ . . .

## 104. శ్రీరామ నామమే

**పల్లవి :**

శ్రీరామ నామమే జిహ్వకు స్థిరమై యున్నది
శ్రీరాముల కరుణయే లక్ష్మీకరమై యున్నది ॥

**చరణములు :**

1. ఘోరమైన పాతకములు గొట్టేనన్నది మమ్ము
జేరకుండ నాపదలను చెండేనన్నది ॥ శ్రీరామ ॥

2. దారి తెలియని యమదూతల తరిమేనన్నది
శ్రీమన్నారాయణ దాసులకు చెలువైయున్నది ॥ శ్రీరామ ॥

3. మాయావాదుల పొందు మానుమన్నది - యీ
కాయ మస్థిరమని తలపోయుచున్నది ॥ శ్రీరామ ॥

4. వదలని దుర్విషయ వాంఛ వదలమన్నది - నా
మదిలో హరి భజన సంపత్కరమైయున్నది ॥ శ్రీరామ ॥

5. ముక్తి మార్గమునకిది మూలమన్నది - వి
రక్తుడు భద్రాచల రామదాసు డన్నది ॥ శ్రీరామ ॥

## 104. అఠాణా రాగం – ఆది తాళం (తిస్రగతి)

29వ మేళకర్త ధీరశంకరాభరణం జన్యం – సరిమపనిస – సనిసపదాపమగమరిస

**పల్లవి :**

పా , మ గ మ పా ప పా , । ప ద ని ప ని ని। ప మ పా ప ప ॥
శ్రీ . రా . మ నా మ మే . । జి . హ్వకుస్థి ర। మై .యు న్న ది ॥

మ ప సా స స ని రి స సని దా । పా ద ని స రి । సనిపా ని ని ప మ ॥
శ్రీ . రాముల క రుణయే . . । ల క్ష్మీ . క ర । మై . .యు . న్న ది ॥

2. పా మ గ మా పా ప పా , । ప ద ని ప ని ప । ని ని ప మ ప ప ॥
శ్రీ రా . మ నా మ మే . । జి . హ్వకుస్థిర । మై .యు . న్న ది ॥

మ ప సా స స ని రి స సని దా । పా ద ని స రి । సనిపా ని ని ప మ ॥
శ్రీ . రాముల క రుణయే . . । ల క్ష్మీ . క ర । మై . .యు . న్న ది ॥
॥ శ్రీరామ ॥

# 105. శ్రీరాముల దివ్యనామ

**పల్లవి :**

శ్రీరాముల దివ్యనామ స్మరణ సేయు చున్నచాలు
ఘోరమైన తపములను కోర నేటికే మనసా ॥

**అనుపల్లవి :**

తారక శ్రీరామనామ ధ్యానము జేసిన చాలు
వేరు వేరు దైవములను వెదక నేటికే మనసా ॥ శ్రీరాముల ॥

**చరణములు :**

చు॥ భాగవతుల పాదజలము - పైన జల్లుకొన్న చాలు
భాగీరథికి పొయ్యేననే - భ్రాంతి యేటికే
భాగవతుల వాగామృతము - పానము జేసిన చాలు
బాగు మీర నట్టి యమృత - పాన మేటికే మనసా ॥ శ్రీరాముల ॥

2. పరుల హింససేయకున్న - పరమ ధర్మమంతే చాలు
పరులను రక్షింతునని - పల్కనేటికే
దొరకని పరుల ధనముల - దోచక యుండితె చాలు
గురుతుగాను గోపురము - గట్ట నేటికే మనసా ॥ శ్రీరాముల ॥

3. అతిథి వచ్చి యాకలన్న - అన్నమింత నిడిన చాలు
క్రతువు సేయవలెననే - కాంక్ష యేటికే
సతతము మా భద్రగిరి - స్వామి రామదాసుడైన
ఇతర మతములనియేటి - వెతల వేటికే మనసా ॥ శ్రీరాముల ॥

**చరణములు :**

1. పా ప మ గ మ పా ప ప ప ప । ప ద ని ప ని ని । ప మా పా ప ॥
ఘోర మై . న పా త కములు । గొ . ట్టే . న . । న్న ది మమ్ము ॥

మ ప రి సా స ని రి స ని ద ద । ప ద ని రి స ని । పా ని ని ప మ ॥
జే . ర కుండ ఆ . ప ద ల ను । చెం . డే . న . । . . . న్న ది ॥
॥ శ్రీరామ ॥

2. ప ప మ గ మా ప ప ప పా ప । ప ద ని పా ప । ని ని ప మ పా ॥
వ ద ల ని దు ర్విషయవాంఛ । వ ద ల మ న్న । ది . . . నా ॥

మ ప సా స స ని రి స దా , । ద ప ద ని సా,రి । సనిపా ని ని ప మ॥
మ ది లో హ రి భ జ న సం . । ప . త్క ర మై . । యు . . . న్న ది ॥
॥ శ్రీరామ ॥

3. పా ప మ గ మ ప ప ప ప పా । ప ద ని పా ప । ద నీ ప , మ ॥
ముక్తి మా . . ర్గ మున కి ది । మూ . ల మ న్న । ది . . . వి ॥

పా సా సా ని రీ సని దా । పా ద నీ సరి । సనిపా ని ని ప మ ॥
ర క్తు డు భ ద్రాచ . ల । రా మదాసు . । డ . . . . న్న ది ॥
॥ శ్రీరామ ॥

(మిగిలిన చరణములు పైదానివలె పాడుకోదగును)

# 105. సావేరి రాగం - ఆది తాళం

15వ మేళకర్త మాయామాళవగౌళ జన్యం - సరిమపదస - సనిదపమగరిస

**పల్లవి:**

i. ;పదసా సససదరిసనిపదా ।;పదనిపదప ।మపదపమగసరీ ॥
..శ్రీ . రాములది . వ్య . నా . మ ।. స్మరణసే.యు।చు. న్న . . చా .లు ॥

;సరిగసరిసరిసనిధరిసరీ ।;సరిమమామ।పా ,మదపదా ॥
..ఘో. రమై. నతపము. ల . ను ।. కో . ర నే టి।కే . . మనసా ॥

ii. ;పదసా సససదరిసనిపదా ।;పదనిపద ప ।మపదదపమగసరీ ॥
..శ్రీ . రాములది . వ్య . నా . మ ।. స్మరణసే .యు।చు. . న్న . . చా. లు ॥

;సరిగసరిసరిసని ధరిసరీ ।;సరిమమామ ।దదపమదపదా॥
..ఘో. రమై. నతపము. ల . ను ।. కో . ర నే టి ।కే . . . మనసా॥

॥ శ్రీరాముల ॥

**అనుపల్లవి:**

దనిదపదమపాదాసాసా ।; సరిగసరీ।సదరిసనిపదా ॥
తా .రకశ్రీ . రామనామ ।. ధ్యా. నముజే।సి . న . చా .లు ॥

;దపదగరిససదరిస నిపదా ।;పదనిపదమ ।దదపమదపదా॥
..వే . ఋవే . ఋదై . వ . ములను ।. వెదకనే. టి ।కే . . . మనసా॥

॥ శ్రీరాముల ॥

**చరణములు :**

1. ;సరిమమమమపా ,మదపదా ।; పదమగారి ।సనిధాసాసా ॥
..భా. గ వ తుల పా . ద జలము।. పై . న జల్లు ।కొ . న్న చాలు ॥

సారిగసరిసససానిధరిసరీ।; సరిమమామ ।పదపదపా ;॥
భా గీ . . ర థి కి పొయ్యే. న . నే।. భ్రాం తి యే టి ।కే . . . . . ॥

; దనిదపదమపాదాసససా ।;సరిగసరీ।సదరిసనిపదా ॥
.. భా . గ వ తుల వా గా మృతము ।. పా . నముజే।సి . న . చా .లు ॥

;దపదగరిససదరిసనిపదా ।;పదనిపదమ ।దదపమదపదా॥
..బా . గుమీ. రన . ట్టి .యమృత ।. పా . నమే. టి ।కే . . . మనసా॥

॥ శ్రీరాముల ॥

(మిగిలిన చరణములు పైదానివలె పాడుకోదగును)

## గానకళకు సంగీత కార్యక్రమాల వార్తలు

చాలమంది గానకళలో సంగీత కార్యక్రమాల వార్తలు ఎలా ప్రచురిత మవుతాయని - గానకళ కార్యాలయానికి చేరే మార్గమేమిటని ప్రశ్నిస్తున్నారు. వాట్సాప్ ద్వారా ఎవరైన సభాకార్యక్రమం వార్త 'గానకళ'కు చేర్చవచ్చు. సెల్ : 9441488721 నెంబరు వాట్సాప్ నెంబరు. జరిగిన కార్యక్రమాల వార్త తెల్లకాగితంపై చక్కని సిరాతో మరింత చిక్కగా వ్రాసి పంపవచ్చు...

కార్యక్రమం ఫోటో కూడా బాగున్నది క్లోజప్‌లో చేర్చవచ్చు. లోపలిపేజీలలో తప్పక ప్రచురణకు నోచుకుంటుంది.

వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించగలరు.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

# ఓలేటి 'సంగీత శిక్షణ'

మల్లాది సూరిబాబు, సెల్ : 9052765490

## కోదండరామం - భజామి - కోకిల ప్రియ - ఆది (దీక్షితర్)

1) మా , పా , దా 'సనిదపమా | ; ; ; ; | మగ పమగరి సా ||
కో . దం డ రా మం | ; గపమా ; | భ . జా . . . మి
అనిశం

2) మా , పా , దా 'సనిదపమా | ; మపద మపా | మగ పమగరిసా ||
కో దం డ రా . . . మం అని . శం . భ . జా . . . మి

3) మా , దా , దా 'సనిదా 'సనిదప | మా మపదమపమ |
కో దం డ రా . . . మం . . . . అని . శం . .
మగ పమ గరి సా ||
భ . జా . . . మి

1) సారిసా , రిగామా | ; మాగ పమా | ; మపమగరి సా ||
కోకిలా రవ . భా . షణ కో మ . లాం

2) ; సారిసా , రి గామా ; ; ; దనిసని దప | మా , ప మగరి సా ||
కో కిలా . . . భా ష . కో . ర మ లాం ||

కోదండ రామం అనిశం భజామి ||

కోకిలా రవ - | దనిసని దప దా పమ పా . . పమగరిసా
| భా . . . ష . కో మ . లాం

కోదండరామం అనిశం భజామి ||

చరణం

సా పదని దప దా పమ పా 'సనిదప |
సా . . జ . . ప్రాం సు . . .
; దని సరి | రిసనిసా ; ; ||
పా వితో . . . ప్రం దాప్త మగా రా
రిపమ గా , రి సా , 'సని | దా , పా మగపమ | దపమగరిసా ||
ప . ర . మే . శ్వర గురు గుహా వా . . . వ్ర . . . ప్రం

సామా గమాప దపమప దనిసా |
వే దాం త వేద్య మతి కా . శ ప్రం

సాదా పా మద | పమ గమగరిసా || కోదండ రామం
వి శ్వా మి త్ర కాం తమ కౌ . టి ప్రం

# తాళ్ళపాక అన్నమాచార్య కీర్తనల్లో చతుష్షష్ఠికళా వైభవం

విష్ణుభట్ల రామకృష్ణ

మన భారతీయ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలలో చరిత్ర కారులు మనకు అందించిన చతుష్షష్టి కళలు గొప్ప భూమికనే పోషిస్తున్నాయి. ఇప్పటికినీ అవికొన్ని జీవనానికి ఉపయుక్త మైనవి.

సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఒక విషయం చెప్తారు ఒక కీర్తనలో 'కళలు నేర్చిన మునుజేసినది కాకనేమి అరువది నాలుగు కళలు నేర్చిన కలిమిలేములకు కారణము నేవే కడుపు కోసమై' అని ఆవేదన చెందుతారు శ్రీరామచంద్రునితో

అటువంటి ఆరువదినాలుగు కళలను శ్రీ వేంకటేశ్వర అంకితం చేసిన ధాన్యజీవి పదునైదవ శతాబ్దంకు చెందిన భక్తశిరోమణి 'ద్రావిడాగమసార్వభౌముడు' 'పదకవితా పితామహుడు'శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు.

ఇతిహాసము మొదలుకొని వైతాళికవిద్య దాకా అరవైనాలుగు కళలు. ఆ కళలను అన్నమయ్య ఎక్కడెక్కడ కీర్తనల్లో తెలిపారో మనం ఒకసారి తెలుసుకుందాం.

అన్నమయ్య రోజుకొక సంకీర్తనా కుసుమంగా ముప్పది రెండువేలు సంకీర్తనలను శ్రీ వేంకటేశ్వరునకు అంకితభావంతో అంకితమిచ్చారు.

అన్నమయ్య కీర్తనల్లో ఏముంది? అన్న ప్రశ్న వేసుకుంటే, దానికి సమాధానం తాళ్ళపాక చిన్నాన్న ఇలా చెప్తారు. 'శృతులై, శాస్త్రములై, పురాణకథలై, సుజ్ఞాన సారంబులై, యతిలోకాగమవిధులై, విపుల మంత్రార్థంబులై, నీతులై, కృతులై, శ్రీవేంకటశైలపతి రతిక్రీడా రహస్యంబులై, నుతులై తాళ్ళపాక యన్నయ వచో నూత్న క్రియల్ చన్నగున్. అని.

శాస్త్రములై అన్నవిషయంలో షట్ శాస్త్రములతోపాటు ఆరువది నాలుగు కళలు శాస్త్రములే. షట్ శాస్త్రములంటే, శిక్ష్యా, వ్యాకరణ, మీమాంస, తర్క, సాంఖ్య, ధర్మనీతి న్యాయ శాస్త్రములు.

**ఇతిహాసము :** మనం మామూలుగా మాట్లాడేటప్పుడు పురాణేతిహాసములు అంటుంటాం. అన్నమయ్యకు కీర్తనలు వ్రాయడానికి దొరికిన కథాంశాలు ఏమిటి? అంటే, వేదాలు, ఉపనిషత్తులు శ్రీమద్రామాయణం, శ్రీమద్భాగవతం, శ్రీమద్భారతం, శ్రీమద్భగవద్గిత, అష్టాదశ పురాణాలు, పూర్వాచార్యులు అందించిన నిగూఢార్థ విశేష వివరణలు, మధురభక్తికి నిర్వచనాలు అయిన శృంగార సంకీర్తనలుగా మలచబడ్డాయి.

ఒకరకంగా అన్నమాచర్య కీర్తనాలన్ని ఇతిహాసములే! ఎందుకంటే! ప్రతి కీర్తనలోనూ ఏదోఒక ఇతిహాసమునకు సంభందించిన కథ మనకు కనబడుతూనే ఉంటుంది. కాబట్టి.

రామాయణంని తీసుకుంటే, రామాయణంలో, బాలకాండ నుండీ ఉత్తరకాండ వరకు వుండే ఘట్టాలు కలిగిన కీర్తనలు అన్నమయ్య కీర్తనలలు కోకొల్లలు' నమో నమో రఘుకుల నాయకా' 'దేవదేవం భజే దివ్య ప్రభావం' 'జయ జయ రామా సమరవిజయ రామ' 'రామచంద్రుడితడు రఘువీరుడు' 'ఇతడే పరబ్రహ్మే ఇదియే రామకథ' అవి ఏక కీర్తన రామాయణాలుగా పేర్కొనవచ్చు. అలా ఇతర వాగ్గేయకారులు రచించారు. ఉదాహరణకు, స్వాతితిరునాల్ రచించిన, 'భావయామి రఘురామం' రాగమాలిక సద్గురు శ్రీ త్యాగరాజస్వామి విరచించిన 'శ్రీరఘుకులమందు' అన్న కీర్తన మరియు సంత్ తులసీ దాసు విరచిత 'నామ రామాయణం'.

ఏక శ్లోకి రామాయణం రెండు శ్లోకాలు రెండు రకాలుగా ఉంది. అవి ఆదౌ దశరథ మహారాజ సుతమ్ । కౌసల్యా గర్భ జననమ్ । బాలోదితమ్ క్రీడనమ్ । వాదిబంధన వేదశాస్త్రపఠనమ్ । గాదేయ శుశ్రూషణమ్। దివ్యాస్త్రగ్రహణమ్ । దైత్య స్త్రీ హననమ్ । సుభాహు మరణమ్ । మారిచ దేశాటనమ్ । విశ్వమిత్రయాగ దీక్ష సఫలమ్ । అహల్యా శాప విమోచనమ్ । శంభో కార్ముఖ భంజనమ్ । జనకజ కల్యాణ మహోత్సవమ్ । మార్గే భార్గవరామ గర్వహననమ్ । పితృవాక్య పరిపాలనమ్ । కైకేయిసుత దండకాటక గమనమ్ ।

ఆదౌ రామ తపోవనాది గమనమ్ । హత్వా జటాయు మరణమ్ । సుగ్రీవ సంభాషణమ్ । వాలీనిర్ధలనమ్ ।

సముద్ర తరణమ్ । లంకాపురీ దహనమ్ । పశ్చాత్ రావణ కుంభకర్ణ నిధనమ్ । ఏతత్ ఇతి శ్రీమద్రామాయణం ।

రామాయణంలో ముఖ్యఘట్టాలతో ఉంటాయి ఈ కీర్తనలు పరిశీలించండి.

నమో నమో రఘుకుల నాయకా దివిజవంద్య నమో నమో శంకర నగజనుతా

విహిత ధర్మ పాలకా వీర దశరథ రామ గహన వాసిని తాటక మర్దన అహల్యా శాపవిమోచన ఆసురకుల భంజనా సహజవిశ్వ మిత్ర సవన రాక్షక ।నమో నమో।

హర కోదండ హార సీతాంగనా వల్లభ । ఖర దూషణాది వాలి గర్వాపహా తరణి తనూజాది తరుచర పాలక శరధి లంఘన కృత్య సౌమిత్రి సమేత । నమో।

బిరుద రావణ శిరోభేధక విభీషణ వరద సాకేత పురవాస రాఘవా । నిరుపమ శ్రీవేంకటనిలయ విజయనగర పురహర విహారా పుండరీకాక్షా ।నమో నమో।

ఆది నాట అంటారు కదా! చక్కని కీర్తన సమకూరినది.

వేదాగమములు : మనకు సనాతనాధర్మమునందు చతుర్వేదాలు ఉన్నాయి. అవి ఋగ్వేద, యజుర్వేద, సామవేద మరియు అధర్వణ వేదాలు. 'సకల వేదములు సంకీర్తనలు చేసి । ప్రకటించినిను బాడి – పావనుడైన । అకలంకుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల। వెలికయై యేలీన శ్రీవెంకటానిలయ। వేదాలను మంచి పదాలుగా చేసి వేదార్థాలను సంకీర్తనల ద్వారా అందించారు. అన్నమయ్య అంతా వేదమయమే. అన్నమయ సంకీర్తనలు భక్తి సాహిత్య సంగీత

# దాక్షిణాత్య నాదోపాసనాధురీణులు

– కొమాండూరి శేషాద్రి

'నాదోపాసనయా దేవా బ్రహ్మవిష్ణుమహేశ్వరా' అనే శ్లోకములో నాదరూపులైన మూర్తిత్రయమే సముదాత్తమైన నాదోపాసనలో ఈదులాడినదట–దేవతా వర్గము కూడ వివిధ వాద్యములు చేకొని నాద సౌఖ్యమనుభవించినదనగా, జన సామాన్యము కది నిత్యానుసంధేయము కాదా! ఐతిహాసిక యుగము నుండియు సంగీతాదులు యిహపరశ్రేయముల నొసగు చక్కని రాజ మార్గములుగ నుపాసించబడినవి. రామాయణమును కుశలవులు తంత్రీలయ స్వర సమ్మితముగా రామప్రభువు నెదుట పాడిరట. గేయములు జాతి మార్గ భేదములతో తదనంతర కాలము నిబద్ధ అనిబద్ధములుగా ప్రవర్తిల్లినది.

పృతమున తొలతొల్త ప్రభవించిన వాగ్గేయకారులలో శ్రీ జయదేవకవి సంస్కృతమున 'గీత గోవిందం' ప్రబంధమును తానుపాడగ, సతీమణి యాడగ శ్రీకృష్ణుని మురిపించినది లోక వ్యాప్తమైనది. నాయక నాయికా భావమున, చూర్ణికలు శ్లోకములతో, 24 సర్గలుగా విభజించబడి జీవ– పరమాత్ముల భావమున పాడబడి అనుభవనీయమైనది.

'కాలక్షేపోన కర్తవ్యః క్షీణమాయుఃక్షణేక్షణే యమస్య కరుణానాస్తి – కరత్వ్యం హరి కీర్తనమ్' అని చెప్పుట కలిసంతరణోపాయము గానమూలకముగా ప్రవర్తిల్లునని తేలినది.

అన్నమాచార్యుడు ప్రభవించి పరమాత్మ గుణకీర్తనములే పరమని శ్రేయ సాధనమని 'తెలుసుకొని' ఇతనికంటె ఘనులిక లేరు – ఇతర దేవతలందరిలోన' యని 'కలౌ వేంకటనాయక' అనే తీర్మానమును ధృవీకరించి, 'నీవు దేవుడవు – నేనొక జీవుడ – ఈవిధి నిద్దరి కెంతెం తరువు' అని భగవంతునికి భక్తునికి దూరమనంత మైనదనీ, కేవలవిశ్వాస ప్రకటిత గాన రాసిక్యమే ఆ దూరము తొలగింప గలదని నాద విశిష్టతను తెల్పి 'వాడే వేంకటాద్రి మీద వరదైవము – పొడిమెతో పొడచూపే పొడవైన దేహము' అంటూ వేంకటవరదుని 'సకల రక్షకునిగ' సంభావన చేసి ఆర్తివంతముగా, ప్రకటికృత వైభవముతో సంభావించిరి. నామవైభవాన్ని హృదయగతంగా అనుభవించిన వారలలో కనక దాసులు, అన్నమయ్య సమకాలికులు – వేలాది దేవర నామాలలో భగవానుని అప్రాకృత తేజోవైభవాన్ని 'నిత్యం పురుషోత్తమం న్యాయం అపమృత్యుం – సంకల హరణం – ఇహపర సాధన కరుణాకరం శరణాగత జనాధారం' అంటూ నిత్యుని, న్యాయధారుని, పాపహరుని ఆశించి, ఆలపించి, తరించినారు. అంతియేకాక ఉడుపి శ్రీకృష్ణుని 'కృష్ణా నీ బేగబారో' అని హృత్పూర్వకంగా పాడినారు. అతని తర్వాత వెలసిన 'ఆదిగురు', కర్ణాటక సంగీత పితామహుడు' శ్రీ పురందర దాసులు తమ దేవర నామములలో – 'తాళబేకు' – తక్కుమేళ బేకు గళశు ద్ధియిరబేకు తిళజదుపేళలు బేకు–రతిపతి పిత నలి అతి శ్రద్ధెయిరబేకు' అని తాళ–మేళములతో శ్రద్ధాభక్తులతో వినిమ యమయ్యే గానమునే విని ఆనందిస్తాడని గానక్రియా విధి గతులు తెల్పియున్నారు.'జగదోద్ధారుని–ఆడిసి దళెశోదె'అంటే యశోద ముఖంగా భగవానుని దివ్యమంగళ శోభను తెల్పిరి. అంతేకాదు 'బందదెల్ల బరలి–గోవిందన దయ నమ గిరలి' ఏ విధమైన కష్టపరంపర వచ్చినా దిగులు లేదు. కేవలమైన గోవిందుని దయ వుంటే చాలట–ఎంత దృఢ సంకల్పము– భావన.

'కలియుగదల్లి హరినామవనెనెదరె కులగోటి గళుద్ధరిసువవో' అని నామస్మరణౌన్నత్యాన్ని వుగ్గడించినారు. మరొక గేయములో 'కృష్ణాయనబారదే! నాలిగెయిరువాగ – కృష్ణననెనెదరె కృష్ణవొందిల్ల' అని కృష్ణనామానుసంధాన ప్రాముఖ్యతను తెల్పినారు. కర్ణాటక సంగీత అభ్యాస ప్రణాళిక నేర్పరచి – మాధ్వమతవ్యాప్తి – భక్తి గరిమను వ్యాప్తి చేయడానికే నడుంకట్టిన సామాజిక స్పృహ కల్గిన త్రివేణి సంగమం.

---

కొలువుడి భక్తి కొండల కోనేటి నిలయుని శ్రీనిధి యైనవాని॥

1.ఆది దేవుని అభువుని సామ వేదనాద వినోదుని నెర – వాది జితప్రియు నిర్మల తత్త్వ వాదుల జీవన యైనవాని ।

2.దేవ దేవుడైన దివ్యుని సర్వ భావాతీత స్వభావుని శ్రీ వేంకటగిరి దేవుడైన పర దేవుని భూదేవ తత్పరుని॥

వేదానికి సంబంధించిన కీర్తనలు చాలానే ఉన్నాయి.

'వేదములే నీ నివాసమట'

'వేదములు నుతించగా వేడుకలు దైవారగా ఆదరించీ దాసుల మోహననారసింహుడు'॥

'వేదంబెవ్వని వేదంబెవ్వని వేదకేడినీ ఆది దేవుని కొనియాడుడి' మనకు సంగీతము సామవేదం. అందుకని ఈ కీర్తనను ఎంచుకోవడం జరిగింది.

3.కావ్యాలంకారము : ఛందోబద్ధమై, వ్యాకరణంతో కూడుకొని లక్ష్య లక్షణ సమన్వయంతోనూ, భావగాంభీర్యంతోనూ, శబ్దాలంకార సౌందర్యంతోనూ వుండే విధంగా అన్నమయ్య కీర్తనలు తీర్చబడ్డాయి.

తోడి వర్ణం, ప్రణమామ్యహం, తెర తీయగ రాదా, మాయా తీత స్వరూపిణి, ఎంత ముద్దో, నీదు చరణములే, వీణా భేరి, సుధా మయి, సామాజవరగమనా, బాగాయనయ్యా, మరి వేరే దిక్కెవరయ్యా, దేవాది దేవా, నాద లోలుడై, విడ జాలదురా, తక్కువేమీ మనకు , పొడగంటి మయ్యా, తిరో తిరో జవరాల, భోశంభో, గరుడ గమన తవ, మంగళం.

వాగ్గేయకారుడు.

ఆంధ్రదేశమును ప్రభవించిన రామదాసు యెన్నో లలిత మధుర కీర్తనములలో తన యార్తిని తెల్పడానికి మండప, గోపుర, ప్రాకారాదులేకాదు శ్రీరామ పరివారానికే యెన్నెన్నో దివ్యాభరణములను ప్రభుత్వ పైకముతో చేయించి ప్రజలు ఆ సొమ్మును ఖజానాకు తిరుగ చెల్లించుతారనేకేవల వాగ్దాన-విశ్వాసముతో) ఖర్చు చేయగా-చివరికి కారాగారమే శరణ్యమైంది. ప్రజల స్వభావాన్ని ఆయన దుయ్యబట్టలేదు. తన ప్రారబ్దమే ఆ రీతిగా ననుభవింపచేసినదంటూ-

'అబ్బబ్బా! దెబ్బలకోర్వలేక. తిట్టితినయ్యా!' అని వేడుకొంటారు. అయినా 'నినునమ్ముకొన్నందుకు బాగాయెను! భయమేమి! నేరామదాసుడనుకొంటి', పలుకే బంగారమాయె! పిలచిన పలుకవేమి! అంటూ రామభక్తిని నివేదిస్తారు. చూడడానికి బాహ్యానిందకానీ, అంతర్గర్భిత భక్తి అభివ్యక్తమైతుంది. ఏమైనా 'చరణములే నమ్మితి' అంటూ చెఱసాలలో వందలాది కృతుల పల్కుల నమృతములొలికే తేట తెనుగున పాడి శరణు పొందినారు. ఆయన ధీరుడు త్యాగయ్య భావనలో

అటు తర్వాత 'నారాయణ తీర్థులు' సంగీత నృత్యసంబంధ 'తరంగము'ల నర్తన - గాన- జతులతో యాడిపాడి వేడిరి.

శ్లోక, దరు, చూర్ణిక, తరంగ నిష్టమైన యీ యక్షగానము భజన గోష్టులలో రామదాస కీర్తనలవలె సముచిత స్థానము పొందినది. 'గోవిందమిహ గోపికా నంద కందం- సానందమవ లోకయా మోముకుందం'అల్లాగే'జయ జయగోకుల బాల- జయ సకలాగమ మూల, 'పూరయ మమకామం - గోపాలా పూరమ మమకామం' వంటి దివ్య మోహనభక్తి రసగేయాలు భక్తజన జిహ్వలపై నర్తించుతూ భజనగోష్టులద్వారా ప్రకాశమైనవి. భక్తనామదేవ, జ్ఞానదేవ, సూరదాసు, కబీరు, మీరా, తులసీదాసు వంటి జ్ఞానుల మహిమోపేత మైన భజనలు సంతశ్రేణిని సాధుజనులను అలరిస్తాయి, కర్ణాటక వాగ్గేయకారులలో.

'శ్రీ త్యాగరాజు' రచనలు సరళధాతువుతో శయ్యా సౌఖ్యము, రసస్ఫోరకమై - రాముని 'ఊయల' నూపుచుండును. మేలుకొలువు నుండి పవ్వళింపు వరకు అనేక ఉపచారముల కనువుగా భావపుష్టిగల ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, దివ్యనామ కీర్తనలు విరచించారు. బృహత్తరమైన రచనా శైలీ, సరళ ధాతువుతో కొన్ని, పటిష్టమైన సంగతుల నిర్మాణముతో సుదీర్ఘకృతులు, పంచరత్న కృతులు విరచించి పండిత పామర జనాకర్షణగా వెలయించారు. ఆత్యయిక ఆత్మీయభావముతో 'ఏతావునరా? నిలకడ నీకు! ఎంచి చూడ నగ పడవో! అని ప్రశ్నిస్తూ భగవానుని, సర్వవ్యాపకత్వ, సర్వసత్తా శ్రీమానుని' 'లావణ్యరాముని' - 'సొగసు చూడతరమా!' మారకోటి లావణ్యా' యని సంబోధించి 'శివ మంత్రమునకు 'మా' జీవము - మాధవ మంత్రమునకు 'రా' జీవము ఈ వివరము తెలిసిన ఘనులకు మ్రొక్కెద' అంటూ 'శివ-కేశవ' ఔన్నత్యాన్ని - అభేదాన్ని లోక హితముకై ఆవిష్కరించిన లోకపావనుడైన ఋషిసత్తముడు. ఆ భావన మనమాయన కృతుల ద్వారా తెలియగల్గుట' కావలెను. హరిగుణమణిమయ సరములు గళమున శోభిల్లు భక్తకోటులిలలో, తెలివితో, చెలిమితో, కరుణగల్గి జగమెల్లను సుధాదృష్టితో బ్రోచువారు' అనిన లోక శ్రేయోకాంక్షులైన వారలు మనకారాధ్యమైన మహనీయులైన భాగవతులు శ్రీ త్యాగరాజస్వామి - శ్రీవారి కృతులలో పరబ్రహ్మ శ్రీరాముడు కేవలం విష్ణువే కాదు - సర్వదేవతా రూపుడు. నాద సుధారస నరాకృతి, ఆయన భక్తి ఆత్యయికంగా ప్రతికీర్తనలో రామభావన యుతముగా రూపొందించబడినది. 'నాదలోలుడై - బ్రహ్మానందమందవే 'మనసా' యని నాద శరీరుడైన పరాత్పరుని వేడిన తీరు పూర్తిగా రససిద్ధము. అనుభవైక వేద్యము.

శ్రీ దీక్షితులు వారి రచనలలో ఆయనసాధించిన మంత్ర, యంత్ర, తంత్ర, జ్యోతిష, పూజావిధాన, అర్చనాది రీతులు, బీజాక్షరములు కల్గిన జటిల సంస్కృత సాహిత్యములు - పదశబలతతో శోభించుతూ ఉపాసన విషయములు కల్గికేవలం స్తుతి పూర్వకములైనను ఛందోలంకార యుక్తములైన నాదపాసన కలితగతి విళంబప్రధాన వాగ్గేయములు - ధార కొంచెము కఠినమైననూ రాగ కోశములుగా వ్యవహరించనగును.

ఇక శ్యామశాస్త్రివర్యుని మాతృవందనము - మాతా శిశు ప్రవృత్తి యుక్తమైన కృతులు సంఖ్యలో తక్కువైనా భావ సౌకుమార్యగము - తాళ చాతుర్యము కలవి. ఆయన దేవిని తప్ప యెవరినీ ఉత్కంఠంతో -సమరసంగా కొలవలేదు. ఆయన రచనలు భావార్తుల వెలువరించును. మాతాశిశు భావముతో 'మాయమ్మ అనినే పిలచితే మాట్లాడరాదా' అంటూ కరుణారస భావములతో ఎన్నోకీర్తనలను వెలయించారు. అట్లే స్వాతి తిరునాళ్ కృతులు భావగతములై గాన యోగ్యములు తదనంతరపు వాగ్గేయకారులైన వేంకటరమణ భాగవతులు, వీణకుప్పయ్య, సుబ్బరాయశాస్త్రి, సదాశివరావు, ముత్తయ్య భాగవతులు, ఆనయ్య పొన్నయ పిళ్ళె, వాసుదేవాచార్య, రామనాథపురం శ్రీనివాస అయ్యంగార్, తిరువత్తియ్యూర్ త్యాగయ్య, పట్టణం సుబ్రహ్మణ్య య్యరు, పాపనాశం శివన్, మైసూరు మహరాజా, ఆధునికులలో జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం, నల్లాన్ చక్రవర్తులు కృష్ణ మాచార్యులు, బాలమురళీకృష్ణ లాల్గుడి జయరామన్ మున్నగు వారెందరి కృతులు నవనవోన్మేషములై నాద సామ్రాజ్యములోని భావస్వారస్యములైన వర్ణ, కృతి, పద, తిల్లానాలను హృద్యంగా రచించి కర్ణాటక సంగీత గరిమను ఉత్తేజింపచేశారు. బుధకోవిద వాగ్గేయకారులు ఎందరో! మహానుభావులు వారందరికీ వందనములు.

# మనోధర్మ సంగీతం హిందూస్థానీ సంగీత శిక్షణాపద్ధతి 'ఆలాప్, తాన్‌నేర్చుకునే విధానం

డా॥ ద్వారం లక్ష్మి

ఈ సంచికలో గురువులు హిందూస్థానీ సంగీతశిక్షణంలో ముందుగా ఆలాప్ (రాగాలాపన) ఏ విధంగా నేర్పడం ప్రారంభిస్తారో గమనిద్దాం.

దీనికి ముందుగా నా ఈ వ్యాసాలను చదివి ఆశీస్సులంద జేస్తూ వున్న పెద్దలకు శిరస్సువంచి ప్రణామాలు తెలియజేస్తు న్నాను. మన గానకళ ద్వారా తమ సందేహాలను, ఆనందాన్ని అందజేస్తున్న యువతరానికి సదా కృతజ్ఞతలు.

'ఆలాప్' అనేది మన కర్ణాటక సంగీతపద్ధతిలోని 'రాగాలాపన' సమప్రాకృతికమైన మనోధర్మ సంగీతాంశం ముందుగా చెప్పుకున్నట్టు కర్ణాటక సంగీతపద్ధతిలో రాగాలాపనను, మనం తీసుకునే కృతి లేదా పల్లవి ముందు ప్రదర్శించి (పాడి లేదా వాయించి) లయవాద్య సహకారం లేకుండా, తరువాత ఆ రచనను ప్రదర్శించడం సంప్రదాయం

రాగాలాపన
|
కృతి । పల్లవి } కర్ణాటక సంగీత పద్ధతి

–దృత్‌ఖ్యాల్ విలంబిత్ ఖ్యాల్
–ఆలాప్ } హిందుస్థానీ పద్ధతి

గురువులు ఆలాప్‌లు వివిధ Stages లో ఏవిధంగా వ్రాసియిచ్చి ప్రారంభదశలో నేర్పుతారో ఇప్పుడు చూద్దాం.

**– భూపాలీ రాగం (మోహన) –**

స్టేజ్-1
సా ;;; సాధాధా ధా
సా ;;; ; స్రధా ధా ధా
ధాపా ;;; పాధా ధా
ధా రి ధా సా.

స్టేజి-2 : సా ;;; ధా ధా ;;;
ధధ సధా సపాపా ;;;
పా ప గా గపదస్రధా
ధా గా పధా ధధ సా

స్టేజి-3 : సా ;; ధధ
సరిరి ;;; రిధాధ
సాధరి రి ;; ధసాధ
ధసాప ధసాగ గపధసారి
రిధసా ;;;

స్టేజ్ 4 :
సా ;;; సరిరి ;;;
ధా సరిరి ;;;
రిసా రిధా రిపా
పధాప ధసాధ సరిస
రి ;;; రిరిరిగా ;;;
గసారిగా గాగాగా
గా గరిసధపగా గా ;;;
గపద సరిగ సరిగా గా ;;;
గారిరి ధా సా

ఈ విధంగా పాడుతున్నప్పుడు కొన్ని గమనించవలసిన విషయాలు.
→ ఒక్కొక్క స్టేజి పూర్తయ్యాక తిరిగి షడ్జంలో ఆపడం.

ఈ Stages ఒక్కొక్కటి పూర్తయ్యాక, తిరిగి రచన (విలంబిత్‌గాని ద్రుత్‌ఖ్యాల్‌గాని) యొక్క స్థాయి (పల్లవి) ఎత్తు పాడాలి రెండు మూడు పదాలైనా.

ఒక్కొక్క Stage లో సాధారణంగా ఒక్కొక్క స్వరాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది.


పైన వ్రాసిన ఆలాప్‌లలో సా (మధ్యస్థాయి షడ్జం) నుండి మంద్రపంచమం వరకూ Stages 1 లో వుండడం గమనించగలం.

Stages 2 లో స నుండి గ వరకు (ఆధార షడ్జం నుండి మంద్ర గాంధారం) వున్నాయి.

Stages 3 లో రిషభం ప్రవేశ పెట్టబడింది.

Stages 4 లో మధ్యస్థాయి గాంధారం ప్రవేశబెట్టారు.

ఇదేవిధంగా ఇంకొకరాగం, ఉదా పీలూ (మనకాపి)లో ఆలాప్‌లు చూద్దాం.



ఈ విధంగా ప్రతి రాగంలో ఆలాప్‌లో ఒక్కొక్క Stage లో ఒక్కొక్క స్వరాన్ని ప్రవేశపెడ్తూ, విద్యార్థులకు నేర్పుతారు గురువులు హిందూస్థానీ సంగీత శిక్షణా పద్ధతిలో.

ప్రతి ఆలాప్ వెనుక తబలా వాద్యంపై 'ఠేకా' అనబడే జతి నడుస్తూవుంటుంది. ఆలాప్ ముగియగానే తాళం ఎక్కడ ఎత్తుగడ వుందో, అక్కడి నుండి పల్లవి (స్థాయీ) తిరిగి ప్రారంభించడం జరుగుతుంది.

ఆలాప్‌లు తారస్థాయి షడ్జానికి చేరిన తర్వాత మధ్య మధ్యలో ఎత్తుగడలు అంతరా(చరణం)ని ప్రారంభించడం సంప్రదాయం.

ప్రతిరాగంలో దీర్ఘమైన స్వరస్థాయిలను శృతిలీనంగా నిలపడం, 2 జోడీ తంబురాల సునాదం మధ్య, ఆ రెండింటిలో ఒకటి గాయకులు స్వయంగా తంబురా వేసుకుంటూ ఆలాప్‌లను మొట్ట మొదటి నుండీ నేర్చుకుంటారు హిందూస్థానీ సంగీత విద్యార్థులు.


**తాన్ :** ఇది మనోధర్మసంగీతానికి చెందిన ఒక అంశం.

హిందూస్థానీ సంగీతపద్ధతిలో అత్యంత ఆకర్షణీయమైనది, ప్రముఖమైనది.

దీనిని విద్యార్థులు ఏ విధంగా గురువుల వద్ద నేర్చుకుంటారో గమనిద్దాం.

కర్ణాటక సంగీత పద్ధతిలో 'తాన్' అనే ప్రక్రియ లేదు.

సూక్ష్మంగా –చెప్పుకోవాలంటే కల్పనా స్వరాన్ని మనోధర్మంగా పాడు తున్నప్పుడు, స్వరాన్ని పలకకుండా, ఆ స్వరాన్నే అకారంతో పాడితే అదే 'తాన్' అనబడుతుంది.



# సంగీత సభల కార్యకలాపములు – 'విహారి'

## తుంబురు మ్యూజిక్ అకాడమీ

వారి 11వ నెలవారి కర్ణాటక సంగీత కచేరి హైటెక్ సిటీలోని ఫీనిక్స్ అరీనలో 30 నవంబర్ 2019 నాడు జరిగింది. హైదరాబాద్ వాస్తవ్యులు, ప్రఖ్యాత గురువు శ్రీ నైవేలి సంతానగోపాలన్ గారి శిష్యులు అయిన శ్రీ మల్లెల కాంతి స్వరూప్‌గారి గాత్ర కచేరి శ్రోతలను ఎంతగానో అలరించింది. ఈ కచేరీలో వయోలిన్‌పై శ్రీ రాజశేఖర్, మృదంగంపై శ్రీరామకృష్ణ, ఘటంపై శ్రీ జనార్ధన్ గార్లు చక్కని సహకారం అందించారు.

హామీర్ కళ్యాణి రాగంలో శ్రీ నైవేలి సంతానగోపాలన్ గారి విరచిత వర్ణంతో ప్రారంభమైన ఈ కచేరీలో, నాట రాగంలో ముత్తయ్య భాగవతార్ విరచిత 'శక్తి గణపతిం', ఆనంద భైరవి రాగంలో పొన్నయ్య పిళ్ళై విరచిత కృప జూడవమ్మా అభోగి రాగంలో త్యాగరాజస్వామి విరచిత మనసు నిల్ప, అఠాణ రాగంలో త్యాగరాజస్వామి వారి అనుపమ గుణాంబుధి' ఇత్యాది కీర్తనలను అత్యంత హృద్యమైన ఆలాపన, నెరవల్, స్వరకల్పన సహితంగా ఆలపించారు. తుంబురు సభ సంప్రదాయానుసారంగా, త్యాగరాజ ప్రహ్లాద భక్తి విజయంలోని నారదముని వెడలిన కీర్తనలోని అన్ని చరణాలనూ ఆలపించటం జరిగింది. ఇదే కీర్తన ఈ కచేరీలో ఉప ప్రధానాంశంగా సాగింది. పంతువరాళి రాగం, స్వరకల్పన కళాకారుని మనోధర్మసామర్థ్యాన్ని ప్రకటించాయి. త్రిశ్రగతి అది తాళ కృతిలో, ప్రముఖంగా ముక్తాయి భాగం, గాయకుని ప్రతిభనేకాక వయోలిన్, మృదంగ, ఘటం వాద్య కళాకారుల ప్రతిభను కూడా వెలికితీసింది. ప్రధానాంశం అయిన రాగం తానం పల్లవిలో , తోడి రాగ ప్రధానంగా, చతురస్ర త్రిపుట తాళం, ఖండ నడలో సాగింది. స్వరకల్పనలో మలయమారుతం, శ్రీ రాగం, అమృతవర్షిణి రాగాలతో స్వరకల్పన రాగమాలికగా సాగింది. చివరిగా మిశ్ర సల్లాపం రాగంలో శ్రీ నైవేలి సంతానగోపాలన్ గారి విరచిత తిల్లాన, మంగళంతో ముగిసింది. – తూపురాణి శ్రీధర్, తుంబురు మ్యూజిక్ అకాడమీ.

## వి.జి.ఆర్.మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం

డా॥ బుల్లయ్య కాలేజిలో 01-12-2019 తేదీన నాలుగవ వార్షికోత్సవం జరిగినది. ఈ సందర్భంగా శ్రీ పంతుల గోపాలరావుగారు మరియు వారి శ్రీమతి పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించి, నూతన వస్త్రములు మరియు బంగారు ఉంగరము నిచ్చి, శ్రీపంతుల గోపాలరావు గారికి ' శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు మెమోరియల్ అవార్డు'ను వి.జి.ర్ సంగీత అకాడమీ వ్యవస్థాపకులైన శ్రీమతి డా॥వేదుల గౌరి రాంమోహన్ మరియు శ్రీ రాంమోహన్ దంపతులకు అందజేసేరు. ముఖ్యఅతిధిగా బుల్లయ్య కాలేజి సెక్రటరీ మరియు కరెస్పాండెంటు శ్రీ మధు కుమార్‌గారు విచ్చేసిరి. శ్రీ ద్వారం త్యాగరాజుగారు విశిష్ట అతిధిగా వచ్చిరి. శ్రీ పంతులగోపాలరావు గారు వారి సందేశాన్ని తెలుపుతూ శ్రీ విజయేశ్వర్రావు గారితో వారి కున్న అనుబంధాన్ని విశదీకరించిరి. శ్రీమతి అడ్డాల రాణికి బెస్టు స్టూడెంటు ఆఫ్ ద ఇయర్ 2019 ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో ఈ అకాడమీ విద్యార్థులైన కౌషల్, వేదాంషి, ఆశ్రీత, నైష, ధీరజ్, స్వర, ఆర్ణ, తన్వి, అక్షిత, తేజస్విని, శ్యామల, జానకి, యశస్విని ప్రియాంక, హరిప్రియాంక, ఎల్లేశ్వరి, జూనియర్ విభాగంలోనూ, శ్రీమతి ఉమాదేవి, శ్రీమతి అడ్డాల రాణి, శ్రీమతి శ్రీశుభ, శ్రీమతి సురభి, కుమారి ఆముక్తమాల్యద, మాస్టర్ అనుజ్, కుమారి శ్రియ, మరియు కుమారి శ్రీజ సీనియర్ విభాగంలోనూ తమ గానాన్ని వినిపించేరు.

---

→ స్టేజ్-4 నిరిగమ ధనిరిగ
గరిసని ధనిధప ధనిరిస నిధపమ
పధపమ గరినిస ॥ స్థాయీ॥

రాగ్ 'దేశ్'లో కొన్ని 'తాన్'లు

→ నిసరిప మగరిస నిస (స్థాయీ)
→ నిసరిమ పనిదప నిసరిప
మగరిస నిస ॥ స్థాయీ॥

నిసరిమ పనిసరి సనిధప
మగరిమ పనిధప మగరిమ
పధ మగ రిపమగ రిసనిస "స్థాయీ"

ఈ విధంగా 'తాన్'లు అకారంతో అద్భుతమైన ఆకర్షణతో సాగుతాయి.

ముందుగా గురువులు వ్రాసి యిచ్చిన ఆలాప్‌లు, తాన్‌లు సాధన చేసి, తర్వాత కాలంలో తమ స్వంత కల్పనతో మనోధర్మ సంగీతంలో ప్రతిభాపాటవాలను సాధించి, రాణిస్తారు హిందూస్థానీ సంగీత విద్యార్థులు.


## హైదరాబాద్‌లో శ్రీ యం.యస్. బాలసుబ్రహ్మణ్యశర్మ సంస్మరణ సభ

ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు సంగీత సామ్రాట్ కీ॥శే॥ శ్రీ యం.యస్.బాలసుబ్రహ్మణ్యశర్మగారి 18వ సంస్మరణ సభ డా॥ ఎ.ఎస్.రావ్‌నగర్, శ్రీ హనుమాన్ టెంపుల్‌లో 30 నవంబరు 2019 తారీఖున జరుపబడినది. ప్రముఖ సంగీతాచార్య డా॥వైజర్సు బాలసుబ్రమణ్యంగారు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. డా॥ కె.వి.బి.గోపాలం గారు. కుమారి ఆరుణాచందరాజ్ గారు ప్రధాన వక్తలుగా పాల్గొని శ్రీ బాలసుబ్రమణ్యశర్మగారి సంగీత విద్వత్తును, గాత్ర విశిష్టతను గురించి ప్రసంగించినారు అనంతరం శ్రీ యం.యస్.బాలసుబ్రమణ్యశర్మగారి శిష్యులైన బెంగుళూరు వాస్తవ్యులు శ్రీమతి వెన్నెలకంటి అపర్ణగారి గాత్రకచేరి జరిగినది. వీరికి ప్రక్కవాయిద్యాలుగా వయోలిన్‌పై శ్రీ ద్వారం సత్యనారాయణరావుగారు, మృదంగం కొటిపల్లి రమేష్‌గారు, మోర్సింగ్ డా॥ శ్రీనివాస గోపాలన్‌గారు సహకరించారు. ఈ సంస్మరణ సభ శ్రీ యం.యస్.బాలసుబ్రమణ్య శర్మగారి కుటుంబ సభ్యులద్వారా జరుపబడినది.

శ్రీమతి అపర్ణ తన గాత్ర సభను 'అభీష్టవరద' కృతితో ప్రారంభించి, 'గురులేక', శంభోమహదేవ కృతి పంతువరాళి రాగం పాడి, 2 జాగాలలో నెరవు, స్వరకల్పన చేసి ప్రతిభను చూపించారు. తర్వాత 'యాదగిరినిలయా' కృతి కానడ రాగంలో ఎమ్.యస్.బి.యస్.గారి రచన, ఇంకా ప్రధానాంశంగా 'మరిమరివచనా' కృతి కాంభోజి రాగంలో రాగం, నెరవు స్వరకల్పన ధీటుగా పాడి సభికుల మన్ననల్ని పొందారు. చివరిగా 'గోవింద గోవింద' అన్నమాచార్య కీర్తన, ఎమ్.యస్.బి.యస్.గారి శివరంజని తిల్లాన పాడి కచేరిని ప్రేక్షకుల కరతాళ ధ్వనులలో ముగించారు.

## పాడుతా తీయగా లోప్రథమ బహుమానం అందుకున్న కుమారి లక్ష్మిశ్రీవల్లి -భిమవరం

లక్ష్మిశ్రీవల్లి సంగీత సాహిత్యాలకు నెలవైన కుటుంబంలో పుట్టింది. తాతగారు స్వర్గీయ కొండూరి శేషాచార్యులుగారు హిందీ లెక్చరర్‌గా చేశారు. తండ్రిగారు వేంకటరామకృష్ణగారు డి.యన్.ఆర్ కళాశాలలో లైబ్రరీలో పనిచేస్తున్నారు. శ్రీవల్లి 4వ విట నుండే సంగీతం పట్ల అభిమానం చూపుతూ వచ్చింది. గురువు స్థానిక



సంగీత విద్వాంసులు శ్రీరామ సంగీత అకాడమీ సారధ్యులు శ్రీ వింజవరపు రామకృష్ణగారి వద్ద సంగీతం నేర్చుకున్నది. శ్రీవల్లి అభ్యుదయానికి గురువు రామకృష్ణగారు ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా ఆమె భవిష్యత్తును ఏనాడో ఊహించి ఆశీర్వదించారు. ఈ.టి.వి.వారు నిర్వహిస్తున్న పాడుతా తీయగా కార్యక్రమంలో ప్రధమస్థానాన్ని సాధించి మూడు లక్షల రూపాయలు బహుమతి అందుకున్నది.

శ్రీరామ సంగీత అకాడమీ నిర్వహకులు శ్రీమతి కె.లక్ష్మి నాగమణి, కె.విజయలక్ష్మి జ్యోతి, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ నిర్వహకులు శ్రీ చెరుకువాడ వేంకటరామయ్య చైతన్యభారతి అధ్యక్షులు శ్రీరాయప్రోలు భగవాన్‌గారు ప్రభుతులు శ్రీవల్లిని అభివందించి ఆశీర్వదించినారు. **– కురిశేటి లక్ష్మినాగమణి**

## సామగానలహరి, నర్సాపురం

పశ్చిమగోదావరి జిల్లా అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో 'సామగానలహరి' చతుర్దమాసోత్సవ కార్యక్రమంలో భాగంగా పి.ఎల్.శృతి ప్రార్ధనతో ప్రారంభమైంది. తదుపరి కార్యక్రమముగా సంస్కృత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ కొడుకుల సూర్యనారాయణ గారి గాత్ర కచేరీ జరిగింది. వయోలిన్ పై శ్రీమతి పద్మావతి, మృదంగం పై శ్రీ సి.ఎచ్.లక్ష్మినారాయణ (ఏలూరు) సహకరించారు. వసంత వర్ణం, చక్రవాకం, గజాననయుతం సాధించనే, మోహన – ఎవరురా నినునో ఎంత ముద్దో ఎంత సొగసో, మరుగేలరా, కల్యాణి రాగాలాపన – వాసుదేవయని – జావళి –వారి పొందు, గంధముపూయరుగ, వచ్చెను అలమేల్మంగా, సామజవరగమన, శంభో శివశంభో, మంగళంతో ముగిసింది. కచేరీ వీనులవిందుగా సాగింది.

## భక్త రామదాసు 400వ జయంత్యుత్సవాలు

వాగ్గేయకారులు 'భక్త రామదాసు' (1620–1687) చతుశ్శత 400వ జయంత్యుత్సవాలు 2020 జనవరిలో తెలుగురథం నిర్వహిస్తుంది. మాఘ శుక్ల విదియ – జయంతి సందర్భంగా ఆచరిస్తున్న సంప్రదాయ నేపథ్యంలో 2020 జనవరి 26/27 ఆది / సోమవారాల్లో వస్తుందని తెలుస్తుంది. ఈ రెండు రోజుల్లో ఒకరోజు రామదాసు జయంత్యుత్సవాలు 'తెలుగురథం' నిర్వహించాలని ఆలోచనలో ఉంది. ఆసక్తిపరులైన సంగీత గురువులు / శిక్షకులు / కళాకారులు తమ పేర్లను ఇక్కడ నమోదు చేసుకోవలసినదిగా కోరుచున్నాము. నియమ నిబంధనావళి వివరాలు త్వరలో ప్రకటించబడతాయి. కొంపెల్ల శర్మ (తెలుగు)

## సద్గురుసన్నిధి-రాజమండ్రి

ప్రతీ నెలా 2వ ఆదివారం నాడు స్థానిక త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో నిర్వహించే ఈ నెలవారీ కార్యక్రమములు ది.08.12.2019న ఎంతో శోభాయమానముగా నిర్వహించారు. నాటి రోజున ముందుగా ప్రముఖ శాస్త్రీయ, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ గారి శిష్యులు మరియు సినీగాయకులు శ్రీ రాణి శ్రీనివాస శర్మ హైదరాబాద్ గారి గాత్ర కచేరి ఆద్యంతం రసరమ్యంగా సాగింది. వీరికి వయోలిన్‌పై శ్రీ

హేమాద్రి కశ్యప్ హైదరాబాద్ గారు, మృదంగంపై సీనియర్ మృదంగ విద్వాంసులు శ్రీ ధన్వాడ ధర్మారావు గారు, ఘటంపై శ్రీ రాయప్రోలు బాల దినకర్‌గార్లు అత్యంత సమర్థవంతముగా సహకారాన్ని అందించారు. అనంతరం ' శ్రీ ఆంజనేయ నాట్య మండలి' తాడేపల్లిగూడెం వారి నిర్వహణలో మరియు ప్రఖ్యాత మృదంగ, ఘట విద్వాంసులు శ్రీ సరస్వతుల హనుమంతరావు గారి బృందం ఆధ్వర్యంలో 'శ్రీరామాంజనేయ యుద్ధం' పౌరాణిక నాటక ప్రదర్శన ఆద్యంతమూ అత్యంత ఆధ్యాత్మిక చింతనతో సాగింది. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు శ్రీ శిష్టు మధుసూదన్ గారిచే కళాకారులంతా సత్కరింపబడినారు.

## అమెరికాలో పిట్సబర్గ్ కల్చరల్ పెస్టివల్

సౌత్ ఏషియన్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫాక్స్ ఛాపెల్ హైస్కూల్ ఆడిటోరియంలో, 6.10.19 ఉదయం 10గంటల నుండి 7గంటల వరకు నిర్విరామముగా అత్యంత వైభవముగా జరిగింది.

ముఖ్య అతిథి శ్రీ అయ్యగారి శ్యామసుందరం, టాప్ గ్రేడ్ వీణా విద్వాంసులు, సంగీత నాటక ఎకాడమీ పురస్కార గ్రహీత వీణా వాద్యం గణపతి ప్రార్థనతో ప్రారంభమైనది.

డా॥ గుత్తిరావు ఆహ్వానము పలికేరు. వివిధ సంగీత నృత్యకళాప్రదర్శనలు ప్రారంభమైనాయి. శ్రీమతి సీతాలక్ష్మి మహాదేవన్, సుజనా ములుకుట్ల, షీలా గణేష్, సరస్వతీ చెల్లూరి, శుభా శ్రీరాం గానం చేసేరు. డా॥ దీపామణి భరతనాట్యంలో బాలకనకమయ కృతి, వారి బృందముతో హంసధ్వని రాగ తిల్లానా ఆహుతులను అలరించింది.

దీక్షా శర్మ, శ్రావణి, కీర్తి, స్రవంతి, శృతి, నీతి, గౌరి, బృందగానము శ్రోతలను బహుదా అలరించినవి. శ్రీమతి బిందుమాధవి గుత్తి రాచూరి శిష్యురాలు తన్వి మేద, మద్దూరు, గణేశ పంచరత్నం, వసంతా కృష్ణ–నారాయణతే నమో నమో కూచిపూడి నృత్యం రక్తి కట్టించేరు.

భరత నాట్యములో జాహ్నవీ గంగిసెట్టి మురళీధర కౌతము, ప్రదర్శించేరు. మణిపురి నృత్యంలో మంజీర నర్తన్, రుషా మండల్, పౌషాలీసా, మైత్రీసుందర్, శతాబ్ది కుందు, అనుమిత్ర మండల్, అంతర క్లీటిన్, ప్రియా మాత్రేజ, అన్విత్తక్కార్, రామి కేతనాథ్ అద్భుతంగా ప్రదర్శించేరు. పిండివంటలతో భోజన విరామము – వివిధ ప్రాంతముల కళామిత్రులు పలుకరింపులు అనంతరం విక్రం సుందర రామన్ గాత్రకచేరి చక్కగా పాడేరు.

శోభిత రవి, అక్షర మురళి, భావనా కొల్లా, జోతికా గోరూర్, మాలిని హరినాథ్, శృతి మిరియాల, భరతనాట్యములో ధనశ్రీ తిల్లాన రక్తిగా ప్రదర్శించేరు. పల్లవి ములుకుట్ల, సంహిత వాసుదేవన్, జన్యఅయ్యర్, కీర్తన విశ్వేష్, సోహన్ గౌరుగంటు, కర్ణాటక సంగీతం శృతి పక్వముగ పాడి వినిపించేరు.

సియా అయ్యర్, శ్రియా సురేష్, సంయుత, లాల్గుడి తిల్లానాలను చక్కగా పాడి వినిపించేరు. కథక్ నృత్యంలో తరానా, మాన్సిడేవిడ్, సాగర్ కామత్, కేథరిన్ నాలేస్నిక్, అద్భుతంగా ప్రదర్శించేరు. కూచిపూడి నృత్యంలో సుమలత శ్రీరామోజు, అనన్య ఎండ్లూరి, నివేస్రిత పులివర్తి, శరణ్య అక్కిపెద్ది, అదివో అల్లదివో, నమోస్తు నటరాజ ప్రదర్శించేరు. సుష్మిత రాజన్, రష్మిత బయ్యన, లక్ష్మికుంజన్, నేహ నందమూరి, శివాని కొమ్మినేని, మాన్సీషా, ఇషా వ్యాస్, రియా చడా, శ్రద్ధ వెడటి, కీర్తనం థీమాటిక్ తరానా ప్రదర్శించేరు.

ముఖ్యఅతిధి, ప్రముఖ వైణికులు, శ్రీఅయ్యగారి శ్యామసుందరం దంపతులకు ఘన సన్మానం, సత్కారం – ముఖ్యఅతిధి ప్రసంగములో ఉత్సవమును సమీక్ష చేస్తూ నిర్వాహకులను అభినందించేరు. అనంతరము శ్రీ అయ్యగారి శ్యామసుందరం, శ్రీమతి జయలక్ష్మి వీణా వాద్య కచేరీలో శ్రీరాగములోని ప్రసిద్ధ త్యాగరాజ పంచరత్న కృతి ఎందరో మహానుభావులు, ద్విజావంతి రాగంలో పప్పు సోమేశ్వరరావు కృతి, బేహాగ్ రాగములో అన్నమయ్య కీర్తన నారాయణతే నమో నమో, సింధుభైరవి రాగంలో పురందరదాసు దేవరనామము, వెంకటాచలనిలయం వాయించి మధ్యమావతి రాగంలో నగుమోముగలవాని త్యాగరాజ ఉత్సవసాంప్రదాయ కీర్తనతో కచేరీ రక్తిగా ముగించేరు.

డా॥ గుత్తిరావు, శ్రీమతి డా॥పార్వతిరావు వందన సమర్పణ చేసేరు. పిట్సబర్గ్ కల్చరల్ ఫెస్టివల్ వీణావాద్యంతో ప్రారంభం – వీణకచేరీతో ముగింపు

## చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల ఆరాధనలో సంగీత కచేరీ

ది.22,23 డిశంబరులో జరిగిన 26న ఆరాధన కార్యక్రమాలలో 23.12.19న శ్రీమతి వి.లలితా చంద్రశేఖర్ గాత్ర సంగీత సభ జరిగింది. శ్రీ ఎమ్.నీలాద్రిరావు వయోలిన్‌పై శ్రీ పి.మెహర్ సాగర్ మృదంగంపై సహకరించారు. కచేరీలో వారు సామినిన్నేకోరి, గజాననయుతం, దేవక్రియరాగాలాపన–శ్రీ గురుగుహతారయ, ఉపప్రధాన అంశంగా గౌరీ మనోహరి రాగాలాపన – గురులేక కీర్తన, నెఱవు; ప్రధాన అంశంగా శంకరాభరణం త్రిస్థాయి ఆలాపన చేసి– బృహదీశ్వరాయనమస్తే –దీక్షితార్ – స్వరకల్పనతో భక్తి భావయుతంగా వినిపించారు. తని ఆవర్తనం విశేషంగా వున్నది. తదుపరి ఎంత చెలువగ; నవనీత చోర; వెంకటరమణనే బారో అంశాలు వినిపించి ముగించారు.

## సహస్రదీపాలంకరణ సేవలో అడ్డాల శ్రియ

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే సహస్రదీపాలకరణ సేవలో విశాఖకు చెందిన కుమారి అడ్డాల శ్రియకు అవకాశం లభించింది. స్వామివారి సేవలో పలుకృతులగానం చేసింది భక్తియుతంగా.

## విజయనగర్ ఫైన్ ఆర్ట్స్ - హైదరాబాద్

వారి నిర్వహణలో 23.11.19న డా॥ వై.రమాప్రభగారి గాత్రసంగీత సభ జరిగింది. హంసధ్వనిలో వర్ణం (స్వీయం), నాటలో శ్రీమహాగణపతే, బంటురీతి, కర్ణరంజనిలో వాంఛతోను, ఉపప్రధాన అంశంగా 'శంకర'–సుబ్బరాయశాస్త్రి, నెనరుంచినాను, ప్రధాన అంశంగా కళ్యాణిలో కమలాంబాం భజరే –దీక్షితర్ కృతి ప్రతిభా వంతంగా ప్రదర్శించారు. చివరలో అన్నమయ్య నారాయణతీర్థ పురందరదాసుల రచనలు గానం చేశారు.

శ్రీమతి పావని శ్రీకాంత్ మల్లాజోశ్యుల – అమెరికా – వయోలిన్‌పై, శ్రీపలివెల విద్యాసాగర్–మృదంగంపై మాస్టర్ శివతేజ మల్లాజోశ్యుల (11 సం॥లు) కంజిరపై సహకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

**ఈ సంస్థ 25,26 జనవరిలో రంజనీశివకుమార్, శ్రీకాంత్ మల్లాజోశ్యుల సంగీతకచేరీలు ఏర్పాటు చేసింది. శ్రీలక్ష్మీగణపతి దేవాలయం – విజయనగర్‌కోలనీ హైద్రాబాద్‌లో జరుగుతాయి. వివరాలకు జగన్నాధరావు మల్లాజోశ్యుల – 8019245201**

## విజ్ఞాన సమితి హైదరాబాద్‌లో అన్నమయ్య కీర్తనలలో చతుషష్టి కళావైభవం

విజ్ఞాన సమితి, నాదాలయ, అలివేలు మంగ సర్వయ్య ఛారిటబుల్‌ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 24.11.2019 ఆదివారం ఒక విశిష్టకార్యక్రమం 108మంది కళాకారులతో అన్నమయ్య 108 కీర్తనలను అందులోను 64కళల గూర్చి ప్రస్తావించిన కీర్తనలను గానంచేసేలా కార్యక్రమ అనుక్రమణిక సిద్ధంచేశారు. 'వాగ్గేయకార సాహిత్య విశ్లేషకులు' శ్రీ విష్ణుభట్ల రామకృష్ణగారు ప్రతికీర్తన గానమునకు ముందు – అందులో ఉటంకింపబడిన కళగూర్చి సంక్షిప్తపరిచయం అందించి కార్యక్రమాన్ని సుశోభితం చేశారు.

ముఖ్యఅతిధి డా॥ కె.వి.రమణాచారి ఐ.ఎ.ఎస్, గౌరవఅతిధి ఆదిరాజ్‌పార్ధసారధిగారు, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీమతి వేదవతీ ప్రభాకర్‌గారు. జ్యోతిప్రకాశనం 'సంగీత కళారత్న' దరూరి రాఘవాచారి గారు చేశారు.

ఆనంద్‌నగర్ కమ్యూనిటీహాలు, ఖైరతాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో 108 కన్నా ఎక్కువ సంఖ్యలో కళాకారులు పాల్గొని వారికి కేటాయించిన అన్నమయ్యకీర్తనల ఆలాపన చేశారు. శ్రీమతి శేషులతా విశ్వనాథ్ నిర్వహణలో అన్నమయ్య సప్తగిరి సంకీర్తనా గానం జరిగింది. అలాగే శ్రీమతి వేదవతీప్రభాకర్ నిర్వహణలో పంచరత్నరాగాలలోని అన్నమయ్య కృతులగానం జరిగింది.

ఇంకాయిందులో కళాకారులతో పాటు సభానిర్వాహకులు సీతారామశర్మ, ఓంప్రకాష్, గోపాలకృష్ణ, వెంకటసుజ్ఞాన్, శ్రీవత్స తేజస్విగానం చేయగా సాయి భార్గవ వైలన్, బి.జనార్ధన్ మృదంగంపై సహకరించారు.

## కేళిక - కాకినాడ రెండవ మాసకార్యక్రమం

శాస్త్రీయ నృత్యకళాకారుల సంక్షేమసమాఖ్య (రి) కాకినాడ వారి ఆధ్వర్యంలో నృత్యగురువులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో రెండవ కార్యక్రమం 8.12.2019న అయ్యప్ప దేవాలయం కాకినాడలో జరిగింది. శ్రీనటరాజ కళామందిర్, ఆనెంప్రసాద్ – నాట్యాచార్య శిష్యబృందం ఇందు పాల్గొని ప్రతిభావంతమైన కూచిపూడి ప్రదర్శన యిచ్చారు.

## ఘంటశాల వారిజయన్తి - విజయవాడలో

విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలలో 4.12.19న స్వర్గీయ ఘంటసాల వారి 97వ జయన్తి ఉత్సవం నిర్వహింపబడింది. విజయవాడ సెంట్రల్ శాసన సభ్యులు శ్రీమల్లాది విష్ణువర్ధన్ సభాధ్యక్షత వహించగా దేవదాయ ధర్మదాయ శాఖామాత్యులు వెల్లంపల్లి శ్రీనివాస్‌గారు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. జంధ్యాల శంకర్, బాకిసంజీవరావు గారలు అతిధులు. ఈ సందర్భంగా ఘంటసాల సంగీత వైభవాన్ని శ్రీ మల్లాది విష్ణుగారు, శ్రీ వెల్లంపల్లి శ్రీనివాసుగారలు తెలియజెపుతూ అటువంటి గాయకుడ్ని మళ్లాచూడమని అన్నారు.

శ్రీదండు చంద్రశేఖర్ బృందం ఉదయం స్వరనీరాజనం సమర్పించగా, సాయంత్రం టి.వి.యస్.మణ్యమ్ ఆర్కెస్ట్రా, ఘంటసాల కళాసమితి వారి సినీ సంగీత విభావరి జరిగాయి.

## గాయత్రీ మహిళా సంగీత సన్మండలి - గుంటూరు

స్థానిక త్యాగరాజస్వామి కళావేదిక లక్ష్మీపురంలో 01.12.19 ఆదివారం ఉదయం 11.00లకు నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ప్రవచనకర్త, వాగ్దేవి వరపుత్ర, సమన్వయ సరస్వతి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు 'త్యాగరాజ వైభవము' పై ప్రవచన కార్యక్రమం జరిగింది. త్యాగరాజస్వామి విరచిత కీర్తలను, జీవితంలోని కొన్ని ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. శర్మగారిని వేదమంత్రాలతో, పూర్ణకుంభంతో సభా స్థలికి తీసుకువచ్చారు. ప్రవచనం ఆద్యంతం ఎంతో చక్కగా సాగి అప్పుడే అయిపోయిందా అని అనిపించింది. ఈ కార్యక్రమాన్ని శ్రీదత్త ప్రసాద్, కోటంరాజు చంద్రమౌళీశ్వరరావు, పాటిబండ లలిత, కలవల శ్రీలక్ష్మి సమర్పించారు.

సాయంత్రం అదే వేదికపై శ్రీభక్త జ్ఞానానంద తీర్ధ 31వ ఆరాధన మహోత్సవం జరిగింది. శ్రీభక్త జ్ఞానానంద తీర్ధ శ్రీ ఓగిరాల వీరరాఘవ శర్మ మెమోరియల్ అవార్డును శ్రీ మోదుమూడి సుధాకర్ గారికి అందచేసారు. శ్రీ ఓగిరాల శ్రీరామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసారు. ముఖ్యఅతిధిగా కొండా కోటిరెడ్డి, ఆత్మీయ అతిధిగా శ్రీ పి.వి.గౌరిశంకర్ పాల్గొన్నారు.

శ్రీ మోదుమూడి సుధాకర్ శ్రీ గాయత్రీదేవి వలజిరాగంలో భక్త జ్ఞానానంద తీర్థుల వారి రచనతో ప్రారంభించారు.

వకుళాభరణంలో త్యాగరాజు గారి రచన ఏ రాముని నమ్మితివో, కదన కుతూహలంలో మైసూరు వాసుదేవాచారి రచన 'నీకేలదయా', శుద్ధ ధన్యాసిలో జ్ఞానానంద తీర్థ రచన 'సుందరీ సదా', సామరాగంలో సదాశివ బ్రహ్మేంద్ర రచన మానససంచరరే; ప్రయాగరంగ దాసురచన రామరామయనరాదా అనే కీర్తనలు రాగాలాపన, స్వరకల్పనలతో ఎంతో మనోరంజకంగా అలపించారు. ప్రధానాంశంగా కల్యాణిరాగంలో త్యాగరాజ కృతి 'సుందరీ నీదివ్యరూపం' సుధాకర్‌గారు తనదైన శైలిలో పాడి సంగీత రసజ్ఞుల మన్ననలు అందుకున్నారు. కచేరీ ఆసాంతం చక్కగా సాగింది. వీరికి వయోలిన్‌పై శ్రీపాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై శ్రీ కె.సద్గురుచరణ్ ఎంతో చక్కగా వారి విద్వత్తుని చూపి సహకరించారు.

వ్యవస్థాపక అధ్యక్షులు డా॥టి.(వి) సూర్యకాంతం, ప్రధాన కార్యదర్శి ఎమ్.వై.శేషురాణి, పాటిబండ లలిత, శ్రీ మంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. **– శ్రీమతి మాధవపెద్ది మీనాక్షి.**

## కాకినాడ సంగీత పోటీలు జనవరి 19న

సంగీత విద్వత్సభ (రి), కాకినాడ 74వ వార్షికోత్సవ సంక్రాంతి గాన సభలలో భాగంగా రాష్ట్రస్థాయి **గాత్ర, వీణా వాద్య పోటీలు** జనవరి 19వ తేది ఆదివారం ఉదయం 9గంటల నుండి. జూనియర్, సీనియర్ విభాగాలు : 16 సంవత్సరముల లోపు బాలబాలికలు జూనియర్లు గాను, 17 సం॥ల నుండి 26 సం॥ లోపువారు సీనియర్లు గాను పరిగణింపబడుదురు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో నివసించే అభ్యర్థులే పాల్గొనడానికి అర్హులు.

నిబంధనలు : జూనియర్ విభాగం : ఆదితాళవర్ణం రెండవ కాలంలో పాడవలెను/ వాయించవలెను.

మూర్తి త్రయం కృతులలో కనీసం ఇద్దరి కృతులు అందజేసి అందులో న్యాయనిర్ణేతలు కోరిన కృతిని పాడవలెను/ వాయించవలెను.

నిబంధనలు : సీనియర్ విభాగం : ఆదితాళ వర్ణం రెండు కాలాలలో పాడవలెను / వాయించవలెను.

మూర్తి త్రయం కృతులలో కనీసం యిద్దరి కృతులు మరియు స్వాతి తిరునాళ్ వారి కృతి అందజేసి అందులో న్యాయనిర్ణేతలు కోరిన కృతిని పాడవలెను / వాయించవలెను. తప్పని సరిగా రాగాలాపన, నెరవల్, స్వర కల్పన ప్రదర్శింపవలెను.


బహుమతులు : జూనియర్లు : గాత్ర-వీణ విభాగం
ప్రథమ-2,000/-,ద్వితీయ-1,500/-, తృతీయ-1,000/-
సీనియర్లు : గాత్ర-వీణ విభాగం
ప్రథమ-4,000/-,ద్వితీయ-3,000/-, తృతీయ-2,000/-
వేదిక : సూర్యకళామందిరం, సినిమా రోడ్, మునిసిపల్ ఆఫీసు యెదురుగా, కాకినాడ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు **940149002, 9441011668, 9246049046**

### కొలంబస్ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో సంగీత కచేరి

7న డిశంబరు 2019న కొలంబస్ శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో శ్రీమతులు ఎమ్.విజయకుమారి, కాత్యాయనిగానం చి॥సిద్ధార్థ్ మృదంగం, చి॥ శ్రీనాధ్ వేణువు. భాగేశ్వరిరాగంలో తరంగం, హిందోళ, శుద్ధధన్యాసి రేవతి, యమన్ కళ్యాణి రాగాలలో అన్నమయ్య కీర్తనలు గానం చేశారు.

### వీణా కచేరి

హైదరాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ది.10.12.2019 మంగళవారం సాయంత్రము శ్రీమతి పద్మారామస్వామి, కమల నాగమణి, పద్మజ, సుధాలక్ష్మి వీణ కచేరి. శ్రీ బులుసు రవికుమార్ మృదంగముపై సహకరించారు. ఆద్యంతము రక్తికట్టిన ఈ సంగీత కచేరిలో శ్రీ గణనాథం – కనకాంగి, బాలకృష్ణ మోహన–మోహనరాగం, శంభో శంభో–రేవతి ధిల్లాన – దేశ్ ఆహుతుల మెప్పు పొందినవి.



# విశాఖ మ్యూజిక్ అకాడమీ - స్వర్ణోత్సవ వేడుకలు

అక్టోబరు 29వ తేది 1969వ సం॥ విజయదశమి శుభదినాన విశాఖలో కొందరు ఔత్సాహికులైన సంగీతాభిమానులు కలసి ప్రతినెలా లబ్ధప్రతిష్ఠులైన సంగీతజ్ఞులతో ఒక సంగీతసభ నిర్వహించాలనీ, వర్ధిష్ణుకళాకారులకు అవకాశంగా ఒక వేదిక నందించాలన్న ఆశయాలతో 'విశాఖ మ్యూజిక్ అకాడమీ' అన్న సంస్థకు నాందిపలికారు. ఆ సంస్థ దినదిన ప్రవర్ధమానమై, ఎందరో అభిమానులను చేర్చుకొని క్రమంతప్పకుండా ప్రతినెలా సంగీతసభలూ, నృత్యకార్యక్రమాలూ, ప్రతిసంవత్సరం యువకళాకారుల సంగీతోత్సవాలూ, వార్షికోత్సవాలలో అకాడమీ ప్రతిష్ఠాత్మక 'సంగీత / నృత్యకళాసాగర' బిరుదు ప్రదానాలు జరుపుకుంటూ నేటికి యాభైవసంతాల సుదీర్ఘ యానంచేయడం సంగీత ప్రపంచంలో గొప్ప విషయం. నిబద్ధత కలిగినసంస్థ యిదీనని రసజ్ఞుల ప్రశంసల నందుకుంది. యీ సందర్భంగా అకాడమీ తన స్వర్ణోత్సవ వేడుకలను స్థానిక సిరిపురంలో గల వి.ఎమ్.ఆర్‌డి.ఎ. ఆడిటోరియంలో 22.11.19 నుండి 01.12.2019 వరకూ పదిరోజుల పాటు రసజ్ఞమనోహరంగా, సంగీతాభిమానులకు వీనులవిందుగా జరుపుకుంది.

యీ స్వర్ణోత్సవాల సందర్భంగా అకాడమీ స్థానిక తపాలాశాఖద్వారా ఆవిభాగ అధిపతి యస్.యస్.పి.ఓ.యస్.శ్రీ ఎన్.సోమశేఖరరావుగారి స్వహస్తాలతో 'ఫస్ట్ డే కవర్'ను 22.11.19 నాటి ఉదయం విడుదల చేయడం ఒక మరపురాని అనుభూతి. మొదటి రోజున సంగీతసభకు ముందు 'జ్యోతిప్రజ్వలన' అనంతరం కుమారి మూలా శ్రీలత ప్రార్థనతో ఆరంభమైనసభలో అకాడమీ అధ్యక్షులు డా॥యస్వీరంగరాజన్, ఛీఫ్ పాట్రన్ డా॥యస్.విజయకుమార్, కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీయుతులు కందాళ శ్రీనివాసరావు, కె.వి.రామమూర్తి, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ పాల్గొని స్వర్ణోత్సవాల పూర్వాపరాలను తెలియజేశారు. సభానంతరం ఆంధ్రదేశంలో ఎ-టాప్ గ్రేడ్ సాధించిన నాదస్వర విద్వాంసులు శ్రీ గురివిల్లి అప్పన్న తన సునాదపూరితమైన నాదస్వరవాద్య మంగళధ్వనితో ప్రారంభ సంగీతసభను అందించారు. శ్రీయుతులు కె.డిల్లేశ్వరరావు నాదస్వరసహకారం, గురివిల్లి దుర్గారావు స్పెషల్ తవిల్‌పైన, కె.ఎమ్.మనోహర్ డోలుపైన, సహకారం అందించగా శ్రీ అప్పన్న తనదైన మధురమైన వాద్యశైలితో 'నవరాగమాలిక' వర్ణంతో మొదలుపెట్టి 'సిద్ధివినాయకం, నరసిజనాభసోదరి, తెలిసిరామచింతన' మొదలైన పరిచయమైన కీర్తనలను వినిపించారు. ముఖ్యాంశంగా తోడిరాగంలో 'చేసినదెల్ల మరచితివో' అంటూ స్వరకల్పనలు అనంతరం చేసిన తవిల్ విద్వాంసుల తనియావర్తనం శ్రోతలనాకట్టుకుంది.

23.11.19 రెండవరోజు డా॥సోమాఘోష్ తమ సుమధుర హిందుస్థానీ గాత్రంతో శ్రోతలను రంజింపజేశారు. శ్రీయుతులు సందీప్ మిశ్రా సారంగిపై, ఓంకార్ అగ్నిహోత్రి హార్మోనియంపై, అమిత్ కీబోర్డుపై, వివేక్ మిశ్రా తబలాపై, క్రిష్ణమోహన్ రిథిమ్స్‌తో సహకరించగా గాయని కళావతిరాగంలో 'దర్శన్‌దో శ్యామ్' అంటూ నెమ్మదిగా ఆరంభించి ఒక్కసారిగా 'జటాకటాహ' అంటూ హంసధ్వనిరాగంలో రావణవిరచిత 'శివస్తోత్రం' అందుకోవడం శ్రోతలనాశ్చర్యపరచింది. 'దుర్గ'రాగంలో ఒకభజన్ దేశ్‌రాగంలో పసందైన 'దాద్రా'తో ముగించారు సభను సోమాఘోష్.

24.11.19 అనగా మూడవరోజు ఎప్పటినుంచో విశాఖ రసజ్ఞులెదురుచూస్తున్న 'వైణికమాంత్రికుడు' శ్రీరాజేష్ వైద్య తన వీణావాదనతో శ్రోతలను మైమరపింపజేశారు.

విమానమాలస్యమవగా మలేషియా నుంచి తిన్నగా విశాఖ వేదికపైకి వచ్చిన యీబృందమంతా యేమాత్రం తొణకక రెండున్న రగంటలు ప్రేక్షకులను కట్టిపడేయడమే వీరి విద్వత్తుకు తార్కాణం. శ్రీ మోహన్‌రామన్ మృదంగంపై, శ్రీ ప్రవీణ్ నారాయణ్ తబలాపై, శ్రీ సాయిహరి ఘటంపై వీణవెంట పరుగులెత్తి సహకరించగా రాజేష్ వైద్య శ్రోతలకు బాగుగా పరిచయమైన 'మహాగణపతిం, సరససామదాన, సుధామయి, రఘువంశసుధా" మొదలైన కీర్తనలను వేగవంతమైన స్వరకల్పనలతో పాటు, పంచరత్నమైన 'ఎందరో మహానుభావులు' కీర్తనను జనరంజకంగా వినిపించారు. ముఖ్యాంశంగా కూడా అభేరిరాగంలో 'నగుమోము' కీర్తనను అనితర సాధ్యంగా వాయించిన ఆయన చేతివేళ్ళకు నమస్కరించవలసినదే.

25.11.19 అనగా నాల్గవరోజు 'హైదరాబాద్ బ్రదర్స్'గా ప్రఖ్యాతిగాంచిన గాత్రయుగళం శ్రీయుతులు డి.శేషాచారి మరియు డి.రాఘవాచారి గారలను అకాడమీ ప్రతిష్ఠాత్మక 'సంగీతకళాసాగర' బిరుదునిచ్చి బంగారు పతకాలతో, ప్రఖ్యాపనపత్రము, శాలువ, పట్టువస్త్రములు మరియు చందనమాలలతో సత్కరించింది. అకాడమీ ఆ సన్మానసభలో ప్రతియేటా యొసగే 'ఆర్టిస్ట్ ఆఫ్ డిస్టింక్షన్' అవార్డును విశాఖకు చెందిన శ్రీ హనుమంతురామచరణ్‌కు ప్రకటించి పదివేల రూపాయల నగదు బహుమతి నందించింది. అంతేకాక బిదసంగీతవిద్యార్థులైన యస్.శిరీష, ఆర్.జయశ్రీ (స్థానిక బి.వి.కె కళాశాల( మరియు డి.నాగరాజు, కె.కుసుమ (మహరాజా ప్రభుత్వ సంగీత కళాశాల, విజయనగరం( లకు ఒక్కొక్కరికి అయిదువేల రూపాయల నగదునందించి ప్రోత్సహించింది.

యువకళాకారుల సంగీతోత్సవాలలో 'బెస్ట్ కాన్సర్ట్' అవార్డును కుమారి ఎన్.వి.యస్.ఎల్. ప్రసన్న, మరియు కుమారి వి.గాయత్రీ విభావరిలకు ఒక్కొక్కరికి 2116/- నగదు బహుమతితో పాటు అందించింది. తరువాత జరిగిన సంగీతసభను 'సంగీతకళాసాగర' బిరుద గ్రహీతలు బేగడ రాగవర్ణంతో శ్రావ్యంగా ఆరంభించారు.

'ఎవరనీ నిర్ణయించిదిరా, కాలహరణ మేలరా, మాయమ్మ, నీదయరాదా' కీర్తనల అనంతరం శ్రోతల కోరికపై ముఖ్యాంశంగా కీరవాణిరాగ కీర్తన 'అంబవాణి' వినిపించారు. వారి రాగాలాపనలూ, స్వరకల్పనలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. శ్రీ యుతులు ద్వారం సత్యనారాయణరావు వాయులీనంపై వంకాయల వేంకటరమణమూర్తి మృదంగంపై యస్.హనుమంతరావు ఘటంపైన దీటైన సహకారమందించారు.

26.11.19 అనగా అయిదవరోజు మేండలిన్ మాంత్రికుడు స్వర్గీయ యు.శ్రీనివాస్ శిష్యుడు శ్రీ యస్.అరవింద్ భార్గవ్ మాండలీన్ వాద్యసభ ఉల్లాసభరితంగా సాగింది. తనగురువుగారి యాభయ్యవ పుట్టినరోజు సందర్భంగా తాను రూపకల్పనచేసిన యాభైరాగాల సమాహారాన్ని ప్రత్యేకంగా అకాడమీ యాభైసంవత్సరాల సేవకు తనవంతు స్పందనగా యాభైరాగాలను సుమారుపన్నెండు నిముషములలో తాను ముందుగ చెప్పినక్రమంలో వినిపించి తన విద్వత్తును తెలియజేశారు. అందులో చివరగా వినిపించిన కీరవాణి రాగంలో ఆర్.టి.పి. స్వరకల్పనలు రంజింప జేశాయి. అంతకు ముందు 'శ్రీరాగవర్ణం, నాట పంచరత్నం, కోకిలవరాళిరాగ కీర్తన' వినిపించి సభను జనరంజకంగా మలచుకున్నారు. వీరికి శ్రీ ఉడుప్పి శ్రీజిత్ వాయులీనంపై శ్రీ ధన్వాడ ధర్మారావు మృదంగంపై, శ్రీ చిదానంద మోర్సింగ్‌పై సహకారమందించి సభను రక్తికట్టించడంలో దోహదపడ్డారు.

27.11.19 అనగా ఆరవరోజు దేశవిదేశాలలో విశాఖ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రఖ్యాతగాయని డా॥పంతుల రమ, భర్త శ్రీ ఎమ్.యస్.ఎన్.మూర్తి వాయులీనంపైన, శ్రీ కోటిపల్లి రమేష్ మృదంగంపైన, శ్రీ యం.హరిబాబు ఘటంపైన సహకరించగా కర్ణపేయమైన గాత్రంతో శ్రోతలను రసడోలికలలో విహరింపజేశారు. 'శహనరాగవర్ణం, గౌళిపంతు, దర్బారు, లలిత' రాగాలలో కీర్తనల అనంతరం శంకరాభరణరాగం ముఖ్యాంశంగా 'స్వరరాగసుధారస' కీర్తనను తనదైన తీరైన స్వరకల్పనతో అందించి తిరుగులేని ఆమె సంగీతజ్ఞానమును సాధనను శ్రోతలకు మరొక్కమారు తెలియజేశారు.

28.11.19 అనగా యేడవరోజు అమెరికాలో చదువుకొని సంగీత సాధనకై చెన్నై చేరుకున్న యువగాత్రవిద్వాంసుడు శ్రీరామకృష్ణన్‌మూర్తిగాత్రసంగీతసభ అద్వితీయంగా అత్యంతరసవత్తరంగా సాగింది. ఆయన రాగాలాపనలలో స్వరకల్పనలలో చూపిన మనోధర్మం వర్ధిష్ణు కళాకారులకు ఆదర్శంగా, రసజ్ఞులైన శ్రోతలకు మనోరంజకంగా నిలిచింది.

శ్రీ ఎమ్.యస్.ఎన్.మూర్తి వాయులీనంపై, శ్రీ వంకాయల వేంకటరమణమూర్తి మృదంగంపై, శ్రీ చంద్రశేఖరశర్మ ఘటంపై తమవిద్వత్తును సహకార రూపంలో చూపించి సభికుల కరతాళధ్వనులందుకున్నారు. శ్రీ మూర్తి 'మాయామాళవ గౌళ, అఠాణా, బేగడ, వరాళి, దేవమనోహరి' వంటి ఎన్నో రాగాలలో కీర్తనలు వినిపిస్తూ ముఖ్యాంశంగా ఆరభి రాగంలో 'నా మొఱలవిని' అన్న కీర్తనను 'తానుపంతుల రమగారి వద్ద నుంచి నేర్చుకొని పాడుతున్నా 'నని వేదికపై చెప్పడం ఆయన విద్వత్తుతో పాటు వినయసంపదను కూడా తెలియజేసింది. అంతేగాక 'ధన్యాసి' రాగంలో ఆయన పాడిన ఆర్.టి.పి, స్వరకల్పనలు శ్రోతల మనసులో నిలిచిపోయాయి.

29.11.19 అనగా ఎనిమిదవరోజు అకాడమీ శ్రీ లాల్గుడి జి.జె.కృష్ణన్ మరియు లాల్గుడి విజయలక్ష్మి గారల వాయులీన యుగళవాద్యసభను యేర్పాటు చేసింది. శ్రీ యుతులు ఆర్.రమేష్ మృదంగంపైన, శ్రీ యం.హరిబాబు ఘటంపై సహకరించగా స్వచ్ఛమైన లాల్గుడి బాణీలో పసందైన వాయులీనవాద్యం వినిపించారు విద్వాంసులు. దేవగాంధారి రాగవర్ణంతో ఆరంభించి 'ఆందోళిక, వనస్పతి, మణిరంగు, కల్యాణవసంతం, బిందుమాలిని' వంటి అరుదైన రాగాలలో కీర్తనలను వినిపించడం విశేషం. ముఖ్యాంశంగా శ్రోతలకోరికపై తోడిరాగం మంచి మంద్రస్థాయి ప్రస్తారంతో వినిపించి 'గతినీవని' అన్న కీర్తన స్వరకల్పనలతో శ్రోతలను ఆహ్లాదపరిచారు. బిలహరి రాగంలో వారందించిన ఆర్.టి.పి. వాయులీనంపై వారికి గల పట్టును తెలియజేసింది.

30.11.19 అనగా తొమ్మిదవరోజు బెంగుళూరుకు చెందిన మానసి ప్రసాద్ గారి గాత్ర సంగీతసభ, శ్రీ మాథుర్ శ్రీనిధి వాయులీనంపై, శ్రీ జయభాస్కర్ మృదంగంపై, శ్రీ యస్.హనుమంతరావు ఘటంపై సహకరించగా ఉల్లాసభరితంగా సాగింది. 'బహుదారి, రీతిగౌళ, గానమూర్తి,' రాగాలలో కీర్తనలు, మోహనరాగంలో 'మోహనరామా' కీర్తనను ముఖ్యాంశంగా చేసి వినిపించారు. తరువాత శుద్ధసావేరిలో ఆమె గానంచేసిన ఆర్.టి.పి. శ్రోతలను అలరించింది.

యిక చివరిరోజు 01.12.19న ఉదయం అకాడమీ విశాఖ నుంచి దేశవిదేశాలలో తన శాస్త్రీయ పరిజ్ఞానంతో శ్రోతలను రంజింపజేస్తూ, పల్లవి స్పెషలిష్టుగా పేరుగాంచి, అత్యున్నతస్థాయి శిష్యులతో గురుసంప్రదాయాన్ని విస్తరింపజేస్తున్న శ్రీమతి మండ సుధారాణి గారి సోదాహరణ ప్రసంగం జరిగింది. 1960 దశకం నుంచి దశలవారీగా సంగీతకళానిధి శ్రీపాద పినాకపాణి గారితో ఆరంభించి నేడు విశాఖలో నున్న సంగీతజ్ఞుల వరకూ సూక్ష్మంగా పరిచయంచేస్తూ 'విశాఖ సంగీత వైభవం' శీర్షికన ఆమె దృశ్యమాధ్యమ సహకారంతో ప్రసంగించారు. విశాఖలో తమదంటూ ఒక ముద్రవేసుకున్న సంగీతజ్ఞులు 'శ్రీమతులు రామవరపు విజయలక్ష్మి, మల్లాప్రగడ జోగులాంబ, అరుంధతీ సర్కార్, యిందిరా కామేశ్వరరావు, యస్.వసుంధరాదేవి, యం.జలజాక్షి, శ్రీయుతులు కులపతి ఐవియల్ శాస్త్రి, కొమాండూరి కృష్ణమాచారి, యివటూరి విజయేశ్వరరావు, వంకాయల నరశింహం, ముళ్ళపూడి శ్రీరామమూర్తి, నేదునూరి కృష్ణమూర్తి, రామానుజసూరి, యమ్మెల్

నరశింహం' యిత్యాదులతో విశాఖ అనుబంధం, వారి శైలి, వారి శిష్యపరంపర గురించి తనకు తెలిసినంతవరకూ అతి స్వల్పంగా తెలియజేయడం ప్రేక్షక ప్రశంసాపాత్రమైంది. ముఖ్యంగా సంగీతసంస్థలు మరియు ఆకాశవాణిని కూడా ప్రసంగంలో చేర్చడం విశేషం. అదేరోజు సాయంత్రం జరిగిన బెంగుళూరుకు చెందిన 'హరి–చేతన' బృందం సమర్పించిన కథక్ నృత్య కార్యక్రమం నయనా నందకరమై శోభిల్లింది. వారు సమకూర్చుకున్న విద్యుదలంకరణ, ఆడియోవిభాగం, వేదికతీరు వారి ప్రదర్శన రసవత్తరమై నిలవడానికి దోహదపడ్డాయి. ఆరంభంలో కథక్ నృత్యరీతులను వీడియోమాధ్యమంద్వారా పరిచయం చేయడం శ్రోతలు ఆ నృత్యాంశాలను అర్థం చేసుకొనవకాశమిచ్చింది. ఉపనిషత్తులలోని 'శిక్షావల్లి' నుండి శ్లోకాలకు అభినయంతో ఆరంభించి సరస్వతి రాగంలో 'లక్ష్మి, పార్వతి, సరస్వతు' లపై ఒక అంశంతో ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు నర్తకులు. నృత్యశబ్దప్రధాన మైన' కథక్ ఖయాల్', బృందావన సారంగ రాగంలో 'రాధాకృష్ణలీలలు' మనోరంజకంగా మంచి సాధనతో ప్రదర్శించి ప్రేక్షక హృదయాలను బృందం దోచుకున్నారు.

హరి –చేతన ముఖ్యనర్తకులుగా, స్నేహ, సావన్, శిరీష్, నవ్య, గాయత్రి, యశస్విని, సోనాలి సహనర్తకులుగా బృందం కథక్ నృత్యం ప్రదర్శించిన తీరు అకాడమీ స్వర్ణోత్సవాలకు తగినరీతిలో ముక్తాయింపు పలికింది.

నృత్యకార్యక్రమం ఆరంభమునకు ముందు కార్యక్రమాల ముగింపుసభలో అకాడమీ సంస్థకు ఎనలేని సేవలందించిన పూర్వాధ్యక్షులూ, విద్యాధికులూ, ప్రాసంగికులూ ప్రొ. అయ్యగారి ప్రసన్న కుమార్‌గారినీ, విశాఖలో సంగీతజనకులం స్థాపించి గతకొన్ని దశాబ్దాలుగా కొన్ని వేలమందికి ఉచితసంగీత శిక్షణ నందిస్తున్న కులపతి ఐవియల్ శాస్త్రిగారిని సభాముఖంగా సన్మానించి అకాడమీ తననుతాను సన్మానించుకుంది. ముఖ్యంగా యేనాడూ యెటువంటి సన్మానమునకూ అంగీకరించని అకాడమీ బంగారు కార్యదర్శి, 49సం॥గా కార్యవర్గంలో నుండి, 39 సం॥గా కార్యదర్శిభారాన్ని తన భుజస్కంధాలపై మోస్తున్న శ్రీమాన్ యమ్మెస్ శ్రీనివాస్‌ను అకాడమీ ఘనంగా సన్మానించి తనకృతజ్ఞత చాటుకుంది.

అకాడమీకి దేశవిదేశాలలో ఒక ప్రత్యేకగౌరవాన్ని తెచ్చిన కార్యదర్శిగా, సభ్యులందరినీ క్రమశిక్షణతో ఒకేత్రాటిపై నడపగలిగిన నిత్యపరిశ్రామికునిగా, నిరంతరం అకాడమీయే తానుగా తానే అకాడమీగా పాటుపడే కష్టజీవిగా, క్రమంతప్పక కార్యక్రమాలను ఒక ప్రణాళికతో నిర్వహిస్తున్న నిర్వాహకునిగా, శ్రీ శ్రీనివాస్ సేవలను ప్రస్తుతిస్తూ. ప్రఖ్యాపనపత్రము, శాలువ, మెమెంటోలతో అధ్యక్షులు శ్రీ యస్వీ రంగరాజన్ మరియు సభ్యులు సత్కరించడం అకాడమీ సభ్యులకే గాక రసజ్ఞులైన విశాఖ వాసులకు ఆనందదాయకమైంది.

అకాడమీ స్వర్ణోత్సవాల సావనీర్‌ను అత్యంతాకర్షణీయంగా విలువైన అంశాలను చేర్చి యీసభలో విడుదలచేయడం జరిగింది. యింతవైభవోపేతంగా స్వర్ణోత్సవాలను నిర్వహించుకోవడానికి ఆర్థకసహకారమందించి ప్రాయోజకులుగా నిలచిన " Raju Vegesna Group, Novus Constructions, Sri Prakash Vidyaniketan, Tata sons, Kantilal Jaikishandas Choksi Charitable Trust, Sadguru Developers, The Visakhapatnam Coop Bank Ltd and Vijay Nirman Company" సంస్థలకూ 'కనకదండి వెంకటరత్నం మరియు సత్యనారాయణమూర్తి మనుమలు, డా. యస్. లక్ష్మీప్రసాద్, శ్రీమతి రేవతి రాణి మరియు శ్రీ నార్ల మణిప్రసాద్, ప్రొ. మధిర రామకృష్ణ, శ్రీమతి పి.వి. రాజ్యలక్ష్మి, శ్రీ సి. హెచ్. దుర్గాప్రసాద్, శ్రీమతి టేకుమళ్ళ శ్యామల, మల్లాజోస్యుల సోదరులు శ్రీయుతులు యమ్మెస్ శ్రీనివాస్, భవానిశంకర్, రవిశంకర్, మరియు డా॥లక్ష్మీపతి చెల్లూరి, శ్రీమతి సరస్వతి చెల్లూరి' గారలందరకూ పేరు పేరున అకాడమీ ధన్యవాదపూర్వక కృతజ్ఞతలు సభా ముఖంగా సమర్పించుకుంది. ఉత్సవాల ఆరంభంలో కళాకారులను సత్కరించిన VMRDA Chairman శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుగారికి, ముగింపుసభలో ముఖ్యఅతిథిగా విచ్చేసి అకాడమీని ఆశీర్వదించిన WORLD TEACHER TRUST Chairman మాస్టర్ పార్వతీకుమార్ గారికీ అకాడమీ ధన్యవాదాలు తెలియజేసింది. యీ స్వర్ణోత్సవాల సందర్భంగా అకాడమీ అధ్యక్షులు డా. యస్వీరంగరాజన్, ఛీఫ్ పాట్రన్ డా॥యస్. విజయకుమార్, ఉపాధ్యక్షులు శ్రీ కందాళ శ్రీనివాసరావు, కె.వి. రామమూర్తి, కార్యదర్శి యమ్మెస్ శ్రీనివాస్, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్, సహకార్యదర్శులు శ్రీ టి. కృష్ణారావు, ఎ. భుజంగరావు నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుండి నడిపించారు. ఆరంభం నుండి చివరి వరకూ కార్యవర్గసభ్యులు శ్రీయుతులు వి. నరసయ్య, సుసర్ల శ్రీనివాస్, యం. జ్వాలాప్రసాద్, సి. హెచ్. దుర్గాప్రసాద్, మరియు కె. కొండలరావు, తదితరులు అందించిన సేవలు ఉత్సవాలు నిర్విఘ్నంగా జయప్రదంగా ముగియడంలో సహకరించాయి.

ముఖ్యంగా సరియైన సమయంలో అకాడమీకి ఆర్థికబలంచే కూర్చడంలోనూ, నిర్వహణలోనూ వివిధరకాలుగా తనచేయూత నందించి వెన్నుదన్నుగా నిలచిన శ్రీ బి.ఎ. రాజారావుగారికి అకాడమీ ప్రత్యేక ధన్యవాదాలు సమర్పించుకుంది.

వ్యాఖ్యాతలుగా డా. పేరాల బాలమురళి, వియెస్సెన్మూర్తి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి సభలను రక్తికట్టించారు.

విశాఖ సాంస్కృతిక చరిత్రలో యీ విశాఖ మ్యూజిక్ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకలు ఒక నూతన అధ్యాయం నెలకొల్పాయంటే యేమాత్రం అతిశయోక్తిలేదు. – **వియెస్సెన్మూర్తి**